
'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 188

గురువారం 28-9-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


ఇషా సింగ్

బుల్లెట్ దిగింది...
ఆసియా క్రీడల్లో ఒకే రోజు ఏడు పతకాలతో అదరగొట్టిన భారత షూటర్లు. ప్రపంచ రికార్డుతో పసిడి పతకం నెగ్గిన సిఫ్ట్ కౌర్. 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం, వ్యక్తిగత విభాగంలో రజతం నెగ్గిన తెలంగాణ షూటర్ ఇషా సింగ్. – 12లో



ఆస్కార్ నామినేషన్‌లో '2018'
2018 కేరళ వరదల ఆధారంగా తెరకెక్కిన మలయాళ సినిమా '2018' ఆస్కార్ నామినేషన్ బరిలో నిలిచింది.
- వివరాలు 11లో



మణిపూర్‌లో సాయుధ చట్టం...
మణిపూర్‌లో కల్లోల పరిస్థితుల నేపథ్యంలో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగించారు.
- వివరాలు 6లో



నిజ్జర్ హత్య వెనుక పాక్ ఐఎస్ఐ !
కెనడాలో ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ హస్తం ఉందని తెలుస్తోంది.
- వివరాలు 6లో



అర్ధనగ్నంగా రక్తమోడుతూ..
మధ్యప్రదేశ్‌లో అత్యాచారానికి గురైన బాలిక అర్ధనగ్నంగా, రక్తమోడుతూ సాయం కోసం తిరిగిన వీడియో కంట తడి పెట్టిస్తోంది.
- వివరాలు 6లో

ఖరారుకు ముందే.. తకరారు



కాంగ్రెస్‌లో అభ్యర్థుల ఖరారు మొదలుకాక ముందే అసమ్మతి మొదలు

పార్టీ టికెట్లు అమ్ముకుంటున్నారంటూ మహేశ్వరం నేత ఆరోపణలు

- దీనిని సీరియస్‌గా తీసుకుని సస్పెండ్ చేసిన టీపీసీసీ
- మరోవైపు ఇప్పటికే సర్వేల పేరిట బీసీలకు కోత పెడుతున్నారనే ఆరోపణలు
- జనరల్ స్థానాలు కూడా తమకు కావాలంటున్న ఎస్టీ నేతలు
- టికెట్ల ప్రకటన ప్రారంభమైతే మరింత రచ్చ తప్పదనే ఆందోళనలో టీపీసీసీ
- పరిస్థితిని చక్కదిద్దేందుకు రంగంలోకి దిగిన ఠాక్రే... బుజ్జగింపులు మొదలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో అసెంబ్లీ టికెట్లు ఎవరెవరికి ఇచ్చేదీ ఇంకా ఖరారుకాక ముందే అసమ్మతి సెగ మొదలైంది. స్క్రీనింగ్ కమిటీ సమావేశాల్లో జరుగుతున్న చర్చలు, ఖరారయ్యాయని భావిస్తున్న స్థానాల గురించిన సమాచారం బయటికి వస్తుండటంతో అసంతృప్తులు గళం విప్పుతున్నారు. పార్టీ టికెట్లను అమ్ముకుంటున్నారంటూ.. మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన నాయకుడు కొత్త మనోహర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఆశావహుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో బీసీలు, ఎస్టీలు, ఎస్సీలు, మాల, మాదిగ, లంబాడీ, ఆదివాసీ, పార్టీ అనుబంధ సంఘాలు, ఇతర కేటగిరీల పేరుతో ఇప్పటికే టికెట్ల కోసం డిమాండ్లు వినిపిస్తున్న నేపథ్యంలో.. టికెట్ల ప్రకటన తర్వాత పరిస్థితి ఇంకెలా ఉంటుందోనన్న చర్చ జరుగుతోంది.

ఇప్పటికే ఢిల్లీకి బీసీ నేతలు

ఈసారి బీసీలకు టికెట్ల కేటాయింపు కాంగ్రెస్‌లో పెద్ద చిచ్చు రాజేసేలా కనిపిస్తోంది. ప్రతి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో రెండు చొప్పున 34 స్థానాలు బీసీలకు ఇస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం మాట ఇచ్చింది. ఈ మేరకు తమకు కనీసం 34 అసెంబ్లీ టికెట్లు ఇవ్వాలని.. వాటిని 40 వరకు పెంచాలని బీసీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం హైదరాబాద్ వేదికగా పలుమార్లు సమావేశం కావడంతోపాటు ఇప్పుడు హస్తిన బాట పట్టారు. బీసీ నేతలు బుధవారమే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలవాల్సి ఉన్నా.. ఆయన బెంగళూరులో ఉండటంతో వీలుకాలేదు. అందుబాటులో ఉన్న అధిష్టానం నేతలను కలుస్తున్న బీసీ నేతలు.. మిగతా 2వ పేజీలో ▶

ఒక్కోచోట పది మంది..
కాంగ్రెస్ టికెట్ల కోసం పదిమందికిపైగా దరఖాస్తు చేసుకున్న స్థానాలు 50కి పైగా ఉన్నాయి. ఇందులో ఇద్దరు లేదా ముగ్గురు గట్టిగానే యత్నిస్తున్నారు. వివిధ సమీకరణాల్లో లాబీయింగ్ చేసుకుంటూ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఈ నేపథ్యంలో ఏ ఒక్కరికి టికెట్ వచ్చినా మిగతా నేతలు రోడ్డెక్కే అవకాశాలున్నాయి. ముఖ్య నాయకులపై ఉన్న అసంతృప్తిని కక్కేసి ఇతర పార్టీలోకి వెళ్లిపోవాలని కొందరు, పార్టీలోనే ఉండి తమకు అన్యాయం చేసిన నేతలను బహిరంగంగా విమర్శించాలని మరికొందరున్నట్టు సమాచారం. టికెట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించిన మహేశ్వరం నేత కొత్త మనోహర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో.. అధికారికంగా టికెట్లు ప్రకటించాక ఎన్ని చోట్ల అసమ్మతి రగులుతుంది? దాన్ని చల్లార్చే యత్నాలు ఏమేరకు గట్టెక్కుతాయి? టికెట్లు రాక రోడ్డెక్కేనేతలపై ఏ చర్యలు తీసుకునే అవకాశం ఉందన్న అంశాలు చర్చనీయాంశంగా మారాయి.

మీ నలుగురికి టికెట్లు బుక్ చేస్తాం.. వస్తారా?
- కర్ణాటకలో కాంగ్రెస్ పథకాలు అమలవుతున్నాయో లేదో చూసొద్దాం
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవితలకు సీఎల్పీ నేత భట్టి సవాల్
- గాంధీభవన్‌లో టీపీసీసీ వార్ రూం ప్రారంభం



- వివరాలు 2లో

చంద్రబాబుకు నో రిలీఫ్..!

తక్షణ ఉపశమనానికి సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ తిరస్కరణ


- కస్టడీ పిటిషన్‌పై వాదనలు వినకుండా ట్రయల్ జడ్జిని నియంత్రించలేం.. అక్టోబరు 3నే విచారణ జాబితాలోకి ఎస్‌ఎల్‌పీ..
- తగిన ధర్మాసనం విచారిస్తుందని స్పష్టీకరణ
- అంతకుముందు విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ ఎస్వీఎన్ భట్టి
- పాస్ ఓవర్‌తో ఉపయోగం లేదు.. సోమవారం జాబితా చేయాలన్న బాబు న్యాయవాది హరీశ్ సాల్వే
- అది సాధ్యం కాదు.. వచ్చే వారమే జాబితా చేస్తామన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా



సాక్షి, న్యూఢిల్లీ: మాజీ సీఎం చంద్రబాబుపై సీఐడీ దాఖలు చేసిన పోలీసు కస్టడీ పిటిషన్‌పై వాదనలు వినకుండా ట్రయల్ జడ్జిని తాము నియంత్రించలేమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. చంద్రబాబుకు తక్షణ ఉపశమనం కల్పించేందుకు నిరాకరిస్తూ కేసును తగిన ధర్మాసనం ముందు జాబితా చేస్తామని, అక్టోబరు 3న దీన్ని విచారిస్తుందని సీజేఐ పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి తనపై దాఖలైన కేసును కొట్టివేయాలని కోరుతూ చంద్రబాబు దాఖలు చేసిన ఎస్‌ఎల్‌పీ బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి ధర్మాసనం ముందుకొచ్చింది. అయితే ఈ పిటిషన్ విచారణపై జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టికి కొన్ని రిజర్వేషన్లు (అభ్యంతరాలు) ఉన్నాయని జస్టిస్ సంజీవ్‌ఖన్నా పేర్కొన్నారు. దీంతో జస్టిస్ భట్టి నిర్ణయంపై తామేమీ చేయలేమని, కేసును త్వరగా జాబితా చేయాలని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే కోరారు. వచ్చే వారం జాబితా చేస్తామని జస్టిస్ సంజీవ్‌ఖన్నా పేర్కొనడంతో, జస్టిస్ భట్టి విచారణ నుంచి వైదొలిగిన అంశాన్ని సీజేఐ ముందు ప్రస్తావించేందుకు చంద్రబాబు తరఫు మరో సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా అనుమతి కోరారు. ఇందుకు అనుమతించిన జస్టిస్ సంజీవ్‌ఖన్నా కేసును పాస్ ఓవర్ చేయాలా? అని న్యాయవాదుల్ని ప్రశ్నించారు. పాస్ ఓవర్‌తో ఉపయోగం ఉండదని,
మిగతా 10వ పేజీలో ▶

గ్రూప్‌-1 ప్రిలిమ్స్ రద్దు సబబే

- హైకోర్టు ద్వి సభ్య ధర్మాసనం తీర్పు
- సింగిల్ జడ్జి ఉత్తర్వులకు సమర్థన
- అన్ని అంశాలను పరిశీలించాకే తీర్పునిచ్చారని స్పష్టీకరణ
- ప్రిలిమినరీ పరీక్ష తిరిగి నిర్వహించాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్ష రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం సమర్థించింది. నోటిఫికేషన్ నిబంధనలను సవరిస్తూ అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయకపోవడం చట్ట వ్యతిరేకమేనని పేర్కొంది. అన్ని అంశాలు పరిశీలించిన తర్వాత సింగిల్ జడ్జి తీర్పు వెలువరించారని, అందులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేసింది. జూన్ 11న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని ఆదేశించింది. బయోమెట్రిక్ సహా నోటిఫికేషన్‌లో పేర్కొన్న అన్ని నిబంధనలను తప్పకుండా పాటించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)కి తేల్చిచెప్పింది. సింగిల్ జడ్జి తీర్పును కొట్టివేయాలని కోరుతూ టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. గ్రూప్‌-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు చేస్తూ ఈ నెల 23న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ టీఎస్‌పీఎస్సీ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి,
మిగతా 2వ పేజీలో ▶

సుప్రీం ఏం చెబుతుందో!
- గ్రూప్‌-1 అభ్యర్థుల్లో నిరాశా నిస్పృహలు
- ఏడాదిన్నర శ్రమ మళ్లీ వృథా అవుతుందన్న ఆందోళన
- మొత్తం రెండుసార్లు ప్రిలిమినరీ పరీక్ష రాసిన నిరుద్యోగులు
- ప్రభుత్వం సుప్రీంలో సవాల్ చేస్తే తీర్పు ఎలా వస్తుందోనన్న ఉత్కంఠ

2లో



వరి ఆల్ టైం రికార్డ్

- ఈ వానాకాలం సీజన్‌లో 65 లక్షల ఎకరాల్లో వరి సాగు.. గతేడాది వానాకాలంలో 64.54 లక్షల ఎకరాలు నమోదు
- ఈ నెలాఖరుతో ముగియనున్న ఖరీఫ్ సాగు
- అర్హులయిన రైతులందరికీ రుణమాఫీ పూర్తి
- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి వెల్లడి


సాక్షి, హైదరాబాద్: వరి సాగు ఆల్‌టైం రికార్డు నమోదు చేసుకొంది. తెలంగాణ చరిత్రలో మొదటిసారిగా ఈ వానాకాలం సీజన్‌లో ఏకంగా 65,00,873 ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. ఈ నెలాఖరుకు వానాకాలం సీజన్ ముగియనుంది. వచ్చే నెల 1 నుంచి యాసంగి సీజన్ ప్రారంభం కానుంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ బుధవారం నివేదిక విడుదల చేసింది. గతేడాది వానాకాలం సీజన్‌లో 64.54 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, 2021 వానాకాలం సీజన్లో 62.13 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఈ ఏడాది లెక్కతో గత రికార్డులన్నీ బద్దలయ్యాయి. ఇక ఈ సీజన్‌లో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం లక్ష్యం 1.24 కోట్ల ఎక రాలు కాగా, ఇప్పటివరకు 1.26 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అందులో వరి సాధారణ సాగు విస్తీర్ణం 49.86లక్షల ఎకరాలు కాగా, ఇప్పటికే ఏకంగా 65 లక్షల ఎకరాలు దాటింది. సాధారణం కంటే 15.14 లక్షల ఎకరాల్లో అదనంగా వరి సాగైంది.

తగ్గిన పత్తి సాగు

ఇక పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.59 లక్షల ఎకరాలు కాగా, కేవలం 45.16 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఈసారి సకాలంలో వర్షాలు పడకపోవడంతో పత్తి సాగు తగ్గింది. ఇక భారీ వర్షాలు కురవడం వల్ల వేసిన పత్తి కూడా అనేకచోట్ల పాడైపోయింది. ఇక అనేకచోట్ల గులాబీరంగు పురుగు పత్తిపై దాడి చేసింది.

12లక్షల ఎకరాల్లో ఉద్యానపంటలు

ఈ వానాకాలం సీజన్‌లో 65 లక్షల ఎకరాల్లో వరి సాగు తెలంగాణ చరిత్రలో రికార్డు అని
మిగతా 5వ పేజీలో ▶



హెచ్‌ఎండీఏ ఆదాయం రూ.6945 కోట్లు

కోకాపేటలో రూ.3,319.60 కోట్లు.. బుద్వేల్‌లో రూ.3,625.73 కోట్లు

సాక్షి, హైదరాబాద్: కోకాపేట, బుద్వేల్‌లోని భూముల విక్రయాల ద్వారా హెచ్‌ఎండీఏకు రూ.6,945.33 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ రెండు చోట్ల హెచ్‌ఎండీఏకు ఉన్న భూములను ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించగా, కొనుగోలుదారులు పూర్తిగా డబ్బులు చెల్లించారు.

➤ కోకాపేటలో మొత్తం 7ప్లాట్లలో ఉన్న 45.33 ఎకరాల భూమిని విక్రయించారు. ఇందులో ఒక్కో ప్లాట్‌లో 3.60 ఎకరాల నుంచి 9.71 ఎకరాలుంది. ఎకరం అత్యధికంగా రూ.100.75 కోట్లకు అమ్ముడుపోగా, సగటున ఎకరానికి రూ.73.23 కోట్ల చొప్పున ధర పలికింది. మొత్తం 7ప్లాట్లపై రూ.3,319.60 కోట్ల ఆదాయం లభించింది. బుద్వేల్‌లోని 14 ప్లాట్లలో ఉన్న 100.01 ఎకరాలు కూడా పూర్తిగా అమ్ముడు పోయింది. ఎకరానికి గరిష్ఠంగా రూ.41.75 కోట్లు ధర లభించింది. సగటున మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

లులు మాల్ షురూ



హైదరాబాద్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన లులు షాపింగ్ మాల్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. కేరళ నుంచి వెళ్లి దుబాయిలో స్థిరపడి ప్రపంచ వ్యాప్తంగా పలు షాపింగ్ మాళ్లను నెలకొల్పిన లులు సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ యూసఫ్ అలీని అభినందించారు.
- వివరాలు 14లో

బెంగళూరు-వాడీ లైన్ల అనుసంధానం సిద్ధం



మహబూబ్‌నగర్‌-కర్ణాటకలోని మునీరాబాద్ మధ్య 243 కి.మీ. మేర జరుగుతున్న రైల్వే లైన్ పనుల్లో భాగంగా దేవరకద్ర-కృష్ణా స్టేషన్‌ల అనుసంధానంతో ఈ ప్రాజెక్టు తెలంగాణ పరిధిలో పూర్తయింది.
- వివరాలు 14లో

'రింగ్' అంతా లోకేశ్‌దే



టీడీపీ హయాంలో అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్‌ఆర్) అలైన్‌మెంట్ ఖరారు పేరిట జరిగిన భూ దోపిడీలో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుమారుడు లోకేశ్ కీలక పాత్ర పోషించినట్లు సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం వెల్లడించింది.
- వివరాలు 10లో

సింగరేణిలో పోరు సైరన్



సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల షెడ్యూల్ ఖరారైంది. సింగరేణి కార్మిక సంఘాలు, యాజమాన్యం ప్రతినిధులతో కేంద్ర కార్మిక శాఖ సమావేశమైంది. తీవ్ర తర్జనభర్జన నడుమ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది.
- వివరాలు 5లో



బహిరంగ సభలతో బీజేపీ
- ఎన్నికల నోటిఫికేషన్ నుంచి ప్రచార ముగింపు దాకా హోరెత్తించాలని ఆ పార్టీ నిర్ణయం
- అక్టోబర్‌లో 30 నుంచి 40 సభలతో 'కాషాయ కార్పెట్ బాంబింగ్'

- వివరాలు 3లో

ఇదండీ సంగతి



..మధ్యలోనే నిమజ్జనం అవుతారేమోనని భయంగా ఉంది స్వామి!

రాష్ట్రానికి ఎన్టీపీసీ 'కొత్త' వెలుగులు

నూతన ప్లాంట్ తొలి యూనిట్‌లో బుధవారం అర్ధరాత్రి నుంచే వాణిజ్య పరంగా విద్యుత్ ఉత్పత్తి

వచ్చే నెల 3న జాతికి అంకితం చేయనున్న ప్రధాని మోదీ!

త్వరలోనే మరో యూనిట్ కూడా అందుబాటులోకి..

ప్లాంట్ విద్యుత్‌లో 85శాతం రాష్ట్రానికే సరఫరా



ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు

జ్యోతినగర్ (రామగుండం)

మొత్తం 4 వేల మెగావాట్లతో..

➤ ఉమ్మడి ఏపీ విభజన నేపథ్యంలో.. తెలంగాణకు విద్యుత్ సరఫరా కోసం ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4,000 మెగావాట్ల సామర్థ్యమున్న థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. అందులో భాగంగా తొలుత తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ-1 చేపట్టారు. ఇందులో ఒక్కొటి 800 మెగావాట్ల సామర్థ్యమున్న రెండు యూనిట్ల నిర్మాణం పూర్తయింది. ఇందులో ఈ నెల 5న విజయవంతంగా తొలి యూనిట్ ట్రయల్ రన్ పూర్తిచేశారు. మరింత పరిశీలన అనంతరం ఈ యూనిట్‌లో వాణిజ్యపరంగా విద్యుదుత్పత్తి, సరఫరాకు సిద్ధం చేశారు.

రాష్ట్రంలోని రామగుండంలో ఎన్టీపీసీ కొత్తగా నిర్మిస్తున్న థర్మల్ విద్యుత్ ప్లాంట్ తొలి యూనిట్ అందుబాటులోకి వచ్చింది. 800 మెగావాట్ల సామర్థ్యమున్న ఈ యూనిట్‌లో ఉత్పత్తయ్యే విద్యుత్‌లో 85శాతం రాష్ట్రానికే అందుతుంది. బుధవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఈ యూనిట్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానిస్తారు. వచ్చే నెల 3న రాష్ట్ర పర్యటనకు రానున్న ప్రధాని మోదీ.. వర్చువల్ విధానంలో ఈ యూనిట్‌ను జాతికి అంకితం చేయనున్నట్టు తెలిసింది.

రెండో యూనిట్ కూడా సిద్ధమే

స్టేజీ-1లో నిర్మించిన 800 మెగావాట్ల రెండో యూనిట్ నిర్మాణం కూడా పూర్తయింది. స్టీమ్ బ్లోయింగ్‌ను మే 20న పరిశీలించారు. టర్బైన్, జనరేటర్‌తోపాటు మిగతా పనులూ పూర్తయ్యాయి. గత నెల 24న మిగతా 5వ పేజీలో ▶

టెట్‌లో తగ్గిన రిజల్ట్

పేపర్‌-1లో 36 శాతం, పేపర్‌-2లో 15.30 శాతం మందే పాస్

టీచర్ పోస్టులు తక్కువనే నిరాశ.. పెద్దగా శ్రద్ధ పెట్టని అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ నెల 15న జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. టెట్ రెండు పేపర్లకు కలిపి 4,13,629 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా వారిలో 1,11,562 మంది అర్హత పొందారు. పేపర్‌-1ను 2,23,582 మంది రాస్తే 82,489 (36.98%)మంది అర్హత పొందగా పేపర్‌-2లో మేథ్స్, సైన్స్ సబ్జెక్టులను 1,01,134 మంది రాస్తే 18,874 మంది (18.66%), సోషల్ స్టడీస్ సబ్జెక్టును 88,913 మంది రాస్తే 10,199 మంది (11.47%) అర్హత సాధించారు. పేపర్‌-2లో 1,90,047 మందికిగాను 29,073 (15.30%) మంది అర్హత పొందారు. టెట్‌కు సంబంధించిన అధికారిక వెబ్‌సైట్ https://cgg.gov.inలో తుది 'కీ'తోపాటు ఫలితాలు అందుబాటులో ఉన్నాయని టీఎస్ టెట్ కన్వీనర్ రాధారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

పడిపోయిన ఫలితాలు...: ఉమ్మడి రాష్ట్రంలో 2011లో టెట్ నిర్వహించగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016 నుంచి ఇప్పటి వరకూ ఐదుసార్లు పరీక్ష మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

గవర్నర్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ 'మిలాద్–ఉన్–నబీ'పర్వదినం శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధనలైన కరుణ, సహనం, ఐక్యత, సామరస్యం, సౌభ్రాతృత్వంలు మనందరికి స్ఫూర్తినిస్తూనే ఉంటాయన్నారు. ఈ పర్వదినం సందర్భంగా సమాజంలో ఐక్యత, సామరస్యం, శాంతి, సౌభ్రాతృత్వం, శ్రేయస్సు కోసం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

ముస్లింలకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా ముస్లింలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. అల్లాహ్ ప్రపంచ శాంతి స్థాపన కోసం మహమ్మద్‌ను చివరి ప్రవక్తగా పంపించారని ముస్లింలు విశ్వసిస్తారని పేర్కొన్నారు. ప్రవక్త జన్మదినోత్సవమైన మిలాద్ ఉన్ నబీ ముస్లింలకు అత్యంత పవిత్రమైన రోజని అన్నారు. తెలంగాణలో గంగా జమున తహజీబ్ పరిరక్షణకు తమ కృషి కొనసాగుతూనే ఉంటుందని కేసీఆర్ స్పష్టం చేశారు.

ఈషా సింగ్ బృందానికి స్వర్ణంపై సీఎం హర్షం



సాక్షి, హైదరాబాద్: చైనాలో జరుగుతున్న ఏసియన్ గేమ్స్ – 2023లో మహిళల 25 మీటర్ల పిస్టల్ టీం విభాగంలో తెలంగాణ క్రీడాకారిణి ఈషా సింగ్ బృందం స్వర్ణ పతకం సాధించడంపై సీఎం కె.చంద్రశేఖర్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈషా సింగ్ బృందం 1759 పాయింట్లతో భారత్‌కు బంగారు పతకం సాధించి సత్తా చాటిందని ప్రశంసించారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

వినాయక చవితి పర్వదినం ప్రారంభం నుంచి నేటి వరకు వాడవాడలా గణేశ్ మండపాల ఏర్పాటు, పూజా కార్యక్ర మాలతో ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయని, పూజలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసిందని కేసీఆర్ అన్నారు. భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొంటున్న నిమజ్జన కార్యక్రమానికి హైదరాబాద్ సహా పలు ప్రధాన నిమజ్జన కేంద్రాల వద్ద ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగలు ఒకే రోజు రావడం దైవేచ్ఛ అని, ఆధ్యాత్మిక వాతావరణంలో పండుగలు జరుపుకుంటూ 'గంగా జమున తెహజీబ్'ను మరోసారి ప్రపంచానికి చాటాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు.

కారును పోలిన గుర్తులు కేటాయించొద్దు

కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్‌ఎస్ నేతల విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కారును పోలిన గుర్తులు ఇతర అభ్యర్థులకు కేటాయించొద్దని బీఆర్‌ఎస్ నేతలు కేంద్ర ఎన్నికలసంఘానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం బీఆర్‌ఎస్ ప్రధానకార్యదర్శి సోమభరత్, ఎంపీలు వెంకటేష్ నేత, మన్నె శ్రీనివాసరెడ్డిలు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతో భేటీ అయ్యారు. కారును పోలిన ఇతర గుర్తుల వల్ల బీఆర్‌ఎస్‌కు వచ్చే నష్టాన్ని వారు వివరించారు. ఓ గుర్తింపు పొందని పార్టీకి రోడ్‌రోలర్ సింబల్ కేటాయించారని, దాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కారు సింబల్‌కు దగ్గరగా ఉన్న కెమెరా, రోటిమేకర్, టెలివిజన్ గుర్తులు కూడా కేటాయించొద్దని కోరారు. అనంతరం నేతలు మీడియాతో మాట్లాడుతూ కారును పోలిన గుర్తులు ఇతర అభ్యర్థులకు కేటాయించడాన్ని అవకాశంగా తీసుకొని కొన్ని ప్రజాస్వామ్య వ్యతిరేకశక్తులు ఓటర్లను తప్పుదారి పట్టిస్తున్నాయన్నారు. తమ విజ్ఞప్తి విన్న అధికారులు సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్టు బీఆర్‌ఎస్ నేతలు చెప్పారు.

'ఉద్యమాల్లో కొండా పాత్ర కీలకం'

సాక్షి, న్యూఢిల్లీ: భారత స్వాతంత్ర్య పోరాటం, ముల్కీ ఉద్యమం, నిజాం వ్యతిరేక పోరాటం, తెలంగాణ 1969 నాటి తొలి, మలి దశ ఉద్యమాల్లో కీలక పాత్ర వహించిన తెలంగాణ పక్షపాతి కొండా లక్ష్మణ్ బాపూజీ అని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతి వేడుకలు ఢిల్లీలో ఘనంగా జరిగాయి. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, ఓఎస్డీ సంజయ్ జాజులు జ్యోతి ప్రజ్వలన చేసి బాపూజీ చిత్ర పటానికి నివాళులర్పించారు.

హెచ్ఎండీఏ ఆదాయం రూ.6,945 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఎకరం రూ.36.25 కోట్ల చొప్పున విక్రయించారు. బుద్వేల్‌లోని మొత్తం భూములపై రూ.3625.73 కోట్ల ఆదాయం లభించినట్టు అధికారులు తెలిపారు. మోకిలాలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారిలో కొందరు ఇప్పటి వరకు డబ్బులు చెల్లించకపోవడానికి పలు కారణాలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. సకాలంలో బ్యాంకు రుణాలు లభించకపోవడం వల్ల కొందరు చెల్లించలేదన్నారు. బిడ్డర్ల విజ్ఞప్తులను సానుకూలంగా పరిశీలిస్తున్నట్టు చెప్పారు.

సుప్రీం ఏం చెబుతుందో!

గ్రూప్–1 అభ్యర్థుల్లో నిరాశా నిస్పృహలు

- ఏడాదిన్నర శ్రమ మళ్లీ వృథా అవుతుందన్న ఆందోళన
- మొత్తం రెండుసార్లు ప్రిలిమినరీ పరీక్ష రాసిన నిరుద్యోగులు
- తొలుత ప్రశ్నపత్రాల కుంభకోణంతో రద్దయిన పరీక్ష
- ఈసారి లోపభూయిష్టంగా నిర్వహించారంటూ రద్దు చేసిన హైకోర్టు
- ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేస్తే ఎలాంటి తీర్పు వస్తుందోనన్న ఉత్కంఠ



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష రాసిన అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఏడాదిన్నర సన్నద్ధత అంతా వృథా అయిపోతుందా?, ఎన్నో ఆశలతో గ్రూప్–1 కొలువు కోసం చేసిన ప్రయత్నాలు మళ్లీ మొదటికి వస్తాయా? అనే ఆందోళన నెలకొంది. మొత్తం మీద రెండోసారి రాసిన పరీక్షను హైకోర్టు రద్దు చేయడమే ఇందుకు కారణం. ప్రశ్నపత్రాల కుంభకోణం నేపథ్యంలో తొలిసారి ప్రభుత్వం ఈ పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. కాగా హైకోర్టు తాజా తీర్పును ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని నిర్ణయించిందనే సమాచారం ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఊరటనిస్తోంది.

అప్పుడలా..ఇప్పుడిలా..!

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 503 గ్రూప్–1 ఉద్యోగాల భర్తీకి గతేడాది ఏప్రిల్‌లో టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. 3,80,081 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది అక్టోబర్ 16న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించిన కమిషన్ కేటగిరీల జాబితా తయారు చేసి 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు అర్హుల జాబితాను ప్రకటించి పరీక్ష తేదీలు సైతం వెల్లడించింది. అయితే టీఎస్‌పీఎస్సీ కార్యాలయ పరిధిలో ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరులో ప్రశ్నపత్రాల కుంభకోణం వెలుగు చూసింది. కమిషన్ సిబ్బంది కొందరు వివిధ పరీక్షల ప్రశ్నపత్రాలు బయటకు లీక్ చేశారనే ఆరోపణలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సిట్ ఏర్పాటు చేసింది. సిట్ దర్యాప్తులో అక్రమాలు వెలుగు చూడడంతో టీఎస్‌పీఎస్సీ వరుసగా వివిధ పరీక్షలను రద్దు చేసింది. ఈ క్రమంలోనే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను సైతం రద్దు చేసింది. గత జూన్ 11వ తేదీన తిరిగి ప్రిలిమినరీ పరీక్షలను నిర్వహించింది. రెండోసారి పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరినీ అనుమతించింది. రెండోసారి 2,33,248 మంది అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్ష రాశారు. అయితే రెండోసారి నిర్వహించిన పరీక్షలను కమిషన్ అత్యంత లోపభూయిష్టంగా నిర్వహించిందంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి కమిషన్ నిర్లక్ష్యాన్ని తప్పుబట్టారు. పరీక్షను రద్దు చేస్తూ ఈనెల 23న తీర్పు ఇచ్చారు. దీంతో ఎంతకాలంగానో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొంది. కాగా దీనిపై టీఎస్‌పీఎస్సీ అప్పీల్‌కు వెళ్లింది. పరీక్ష నిర్వహణలో టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్య వైఖరి వల్లే గందరగోళం నెలకొందంటూ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం సైతం స్పష్టం చేస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సమర్థించింది. దీంతో అభ్యర్థులు మరింత ఆవేదనకు గురయ్యారు. అయితే దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించినట్లు సమాచారం.

మళ్లీ చిగురిస్తున్న ఆశలు

హైకోర్టు తీర్పు తుది కాపీ రాగానే వచ్చేవారంలో టీఎస్‌పీఎస్సీ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది. దీంతో ఉద్యోగాల కోసం ఎన్నాళ్లగానో ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. అయితే సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుంది, ఏ విధమైన తీర్పు వెలువడుతుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది. సర్వోన్నత న్యాయస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం తన వాదనలు బలంగా విన్పించాలని, మళ్లీ పరీక్ష నిర్వహించే పరిస్థితి తలెత్తకుండా జాగ్రత్త వహించాలని అభ్యర్థులు కోరుతున్నారు. గణేష్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ, ఆ తర్వాత గాంధీ జయంతి నేపథ్యంలో సుప్రీంకోర్టుకు వరుస సెలవులున్నాయి. కాగా సుప్రీంకోర్టు తీర్పుపైనే గ్రూప్–1 పరీక్ష భవితవ్యం ఆధారపడి ఉంది. ఇతర గ్రూప్ పరీక్షలు కూడా ఉన్న నేపథ్యంలో గ్రూప్–1 మళ్లీ నిర్వహణ ప్రభుత్వానికి కూడా సవాలుగానే మారే అవకాశం ఉంది.

గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దు సబబే

▶ మొదటి పేజీ తరువాయి

జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. టీఎస్‌పీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, అప్పీల్‌లో ప్రతివాదుల తరఫున సీనియర్ న్యాయవాది గిరిధర్‌రావు, నర్సింగ్, హసీనా సుల్తానా వాడీవేడిగా వాదనలు వినిపించారు.

బయోమెట్రిక్‌పై వాదన ఆమోద యోగ్యం కాదు

'గత ఏడాది అక్టోబర్‌లో తొలిసారి గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహించినప్పుడు 2.83 లక్షల మంది వరకు హాజరయ్యారని కమిషన్ చెబుతోంది. అప్పుడు సమర్థవంతంగా బయోమెట్రిక్ నిర్వహించిన కమిషన్.. 2.33 లక్షల మంది పాల్గొన్న జూన్‌లో మాత్రం భారీ సంఖ్య కారణంగా తీసుకోలేదని చెప్పడం ఆమోదయోగ్యం కాదు. కానిస్టేబుల్ పోస్టులు సహా ఇతర పలు పోస్టుల నియామక పరీక్షలకు బయోమెట్రిక్ తీసుకున్నప్పుడు గ్రూప్–1కు తీసుకోకపోవడాన్ని కమిషన్ సమర్థించుకోలేదు. ఇంకో వైపు 50 వేల మంది పరీక్షకు దూరం కావడం చిన్న విషయమేమీ కాదు. అభ్యర్థుల్లో కమిషన్ విశ్వసనీయత కోల్పోవడమే ఇందుకు కారణంగా కన్పిస్తోంది. నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం ఓఎంఆర్ షీట్లపై ఇద్దరు ఇన్విజిలేటర్ల సంతకాలు ఉండాలి. కానీ కొన్ని షీట్లపై ఒక్కరి సంతకమే ఉంది. దీనికి కమిషన్ సమాధానం సమంజసనీయంగా లేదు. గ్రూప్–1 కంటే ఎక్కువ మంది హాజరైన గ్రూప్–4కు ఓఎంఆర్ షీట్లపై ఫొటో ఇచ్చినప్పుడు గ్రూప్–1కు ఇవ్వకపోవడం అక్రమాలకు ఆస్కారం ఇచ్చేలా ఉంది..'అని ధర్మాసనం అభిప్రాయపడింది.

ప్రశ్నార్థకంగా ఆ 258 మంది భవిష్యత్ మారనుంది

'నోటిఫికేషన్ నిబంధనల్లో మార్పుచేర్పులు, సవరణలు చేసే అధికారం కమిషన్‌కు ఉంది. అయితే నోటిఫికేషన్ వెలువరించాక సవరణ చేయాలనుకుంటే ఆ మేరకు అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయాలి. గ్రూప్–4 పరీక్షలకు బయోమెట్రిక్ లేదంటూ అనుబంధ నోటిఫికేషన్ వెలువరించిన కమిషన్ గ్రూప్–1 విషయంలో అలా చేయకపోవడం సమర్థనీయం కాదు. జూన్ 11న గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ తర్వాత 2,33,248 మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పిన కమిషన్.. అనంతరం ఆ సంఖ్యను 2,33,506గా చెప్పింది. ఈ వ్యత్యాసం గ్రూప్–1 మొత్తం పోస్టుల్లో (503) సగం కంటే ఎక్కువ (258). ఒకవేళ నిజంగా అక్రమాలు చోటుచేసుకుని ఈ 258 మంది మెయిన్స్ పరీక్షకు ఎంపికైతే.. అంతమంది మెరిట్ అభ్యర్థులు అవకాశం కోల్పోతారు. వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇక ప్రిలిమ్స్ ప్రాథమిక పరీక్ష అని, పట్టించుకోనవసరం లేదన్న కమిషన్ వాదన కూడా ఆమోదయోగ్యంగా లేదు. ఇరుపక్షాల వాదనలను లోతుగా పరిశీలించాక సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఆస్కారం కనబడటం లేదు..' అని బెంచ్ స్పష్టం చేసింది.

ముగ్గురి వల్ల లక్షల మంది ఇబ్బందుల్లోకి..

'ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పరీక్షను రద్దు చేయాలని కోరారు. ముగ్గురి కోసం లక్షల మంది భవిష్యత్ ఇబ్బందుల్లో నెట్టడం సరికాదు. 2.33 లక్షల మంది అభ్యర్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అప్పీల్‌ను ఆమోదించాలి..' అని ఏజీ కోరారు. కాగా.. 'అభ్యర్థుల సంఖ్యలో తేడా అక్రమాలు తావిచ్చేదిగా ఉంది. పరీక్షల నిర్వహణలో కమిషన్‌కు చిత్తశుద్ధి లోపించింది. ఒకసారి పేపర్ లీక్ అయినప్పుడు కట్టుదిట్టమైన భద్రత మధ్య పరీక్ష నిర్వహించాల్సిన కమిషన్.. రెండోసారి కూడా విఫలమయ్యింది. కాబట్టి పరీక్షను రద్దు చేసి నోటిఫికేషన్‌లోని నిబంధనలకు అనుగుణంగా పరీక్ష నిర్వహించాలి..' అంటూ గిరిధర్‌రావు, నర్సింగ్ వాదించారు.

మీ నలుగురికి టికెట్లు బుక్ చేస్తాం.. వస్తారా?

- కర్ణాటకలో కాంగ్రెస్ పథకాలు అమలవుతున్నాయో లేదో చూసొద్దాం
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవితలకు సీఎల్పీ నేత భట్టి సవాల్
- బీఆర్‌ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- గాంధీభవన్‌లో టీపీసీసీ వార్ రూం ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: ''కాంగ్రెస్ నేతల మాటలు నమ్మి ఆగం కావద్దంటూ సీఎం కేసీఆర్ కాకమ్మ కబుర్లు చెప్తున్నారు. ఆయన మాటలు విని ప్రజలు ఆగం కావద్దు. సీఎం కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్, అల్లుడు హరీశ్‌రావు, కుమార్తె కవితలకు కలిపి వోల్వో బస్సులోగానీ, విమానంలో కానీ టికెట్లు బుక్ చేస్తాం. కర్ణాటకకు తీసుకెళ్తాం. అక్కడ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలవుతున్నాయా లేదా? చూసి వద్దాం.. వస్తారా?''అని కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) నేత మల్లు భట్టి విక్రమార్క సవాల్ చేశారు. బీఆర్‌ఎస్‌లా ఇంటికో ఉద్యోగం, దళిత ముఖ్యమంత్రి, కేజీ టు పీజీ, మూడెకరాల భూమి అంటూ హామీఇచ్చి మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి తెలియదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీ కార్డు స్కీంలను అమలు చేసి తీరుతామని ప్రకటించారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఎన్నికల వార్‌రూంను పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో కలసి భట్టి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ సర్కారులా సగం మందికి పింఛన్లు కోతవేసి, మిగతా సగం మందికే ఇవ్వడం సామాజిక బాధ్యత కాదని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ నేతలది తప్పుడు ప్రచారం

కాంగ్రెస్ ప్రకటించిన డిక్లరేషన్లను అమలు చేయదంటూ కొందరు బీఆర్‌ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భట్టి మండిపడ్డారు. రైతు, యూత్, దళిత డిక్లరేషన్లన్నింటినీ మేనిఫెస్టోలో పెడతామని, తుక్కుగూడలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పారు. ప్రజలు ఈ మూడు నెలలూ తామిచ్చిన గ్యారంటీ కార్డులను దాచిపెట్టుకోవాలన్నారు. ఒకటికి రెండుసార్లు ఆలోచించి లోతుగా అధ్యయనం చేశాకే గ్యారంటీ కార్డు స్కీంలు ప్రకటించామని భట్టి చెప్పారు. కర్ణాటకలో తామిచ్చిన హామీలను అమలు చేశామని, తెలంగాణలోనూ అధికారంలోకి రాగానే అమలు చేస్తామని చెప్పారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ వ్యాఖ్యలు బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని, ఆయన వ్యాఖ్యలను బట్టే ఆ ఆలోచనలను అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. వార్‌రూం ప్రారంభ కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకులు దీపాదాస్ మున్షీ, జ్యోతిమణి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి, మచ్చా వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖరారుకు ముందే తకరారు

▶ మొదటి పేజీ తరువాయి

గురువారం ఖర్గేను, వీలుంటే రాహుల్‌ను కలిసే అవకాశం ఉందని సమాచారం. అయితే టీపీసీసీ నాయకత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందా అన్న దానిపై బీసీ నేతలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. సర్వేలలో మంచి ఫలితాలు రావడం లేదన్న సాకు చూపి తమకు ఇవ్వాల్సిన టికెట్లను అగ్రవర్ణాలకు కేటాయించే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తున్నారు. అందుకే తొలి జాబితాలో బీసీ నేతల పేర్లు రాకుండా చేసి, వారిని టికెట్ ఒత్తిడిలో ఉంచి మిగతా వారి కోసం మాట్లాడకుండా చేయాలనే ప్రయత్నమని పేర్కొంటున్నారు. ఈసారి టికెట్ల కేటాయింపులో తేడా వస్తే సహించేది లేదని స్పష్టం చేస్తున్నారు. అయితే టికెట్లు ఆశిస్తున్న బీసీల్లో ఎక్కువ శాతం అగ్రవర్ణ నాయకులతోనే పోటీ పడుతుండటంతో.. తమను కాదని ఓసీ నేతలకు టికెట్లు ఇస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు.

మాకు మరో మూడు సీట్లివ్వండి

ఎస్టీ నేతలు కూడా తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని టీపీసీసీ పెద్దలను కోరుతున్నారు. 40–50 స్థానాల్లో ప్రభావితం చేయగల తమ సామాజిక వర్గానికి రిజర్వ్ అయిన 12 అసెంబ్లీ సీట్లకుతోడు కనీసం మరో 3 జనరల్ స్థానాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రిజర్వుడు నియోజకవర్గాల్లో కూడా లంబాడా, కోయ (ఆదివాసీ) సామాజిక వర్గాలకు ఏయే సీట్లు ఇవ్వాలనే విభజన కూడా చేస్తున్నారు. దేవరకొండ, వైరా, ఖానాపూర్, బోథ్, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు స్థానాలు లంబాడాలకు ఇవ్వాలని.. ఆసిఫాబాద్‌లో ఆదివాసీలకు, ములుగు, భద్రాచలం, అశ్వారావుపేట, పినపాక కోయ వర్గానికి ఇవ్వాలని కోరుతున్నారు. అంతేగాకుండా తెలంగాణలో 31 లక్షలకు పైగా ఎస్టీ జనాభా ఉందని.. జనాభా ప్రాతిపదికన మరో మూడు జనరల్ స్థానాల్లో కూడా ఎస్టీలకు అవకాశం ఇవ్వాలని అంటున్నారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరీ ఈ విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం తాము కూడా బీసీ నేతల తరహాలోనే ఢిల్లీ వెళ్లి పార్టీ అధిష్టానాన్ని కలుస్తామని కూడా పేర్కొనడం గమనార్హం.

బుజ్జగింపులు షురూ

అసమ్మతి కుంపట్లపై ఓ అంచనాకు వచ్చిన కాంగ్రెస్ అధిష్టానం.. పరిస్థితిని చక్కదిద్దేందుకు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేను రంగంలోకి దింపింది. స్క్రీనింగ్ కమిటీ సమావేశాలు ప్రారంభమవడానికి ముందే తన పని మొదలుపెట్టిన ఆయన ఇప్పుడు మరింత ముమ్మరం చేశారు. గాంధీభవన్, ఎమ్మెల్యే క్వార్టర్స్ వేదికగా మంతనాలు జరుపుతున్నారు. నేతలతో మాట్లాడుతూ.. పార్టీపై నమ్మకం ఉంచాలని, టికెట్ వచ్చినా, రాకపోయినా సహకరించాలని కోరుతున్నారు. మొత్తమ్మీద టికెట్ల ప్రకటన ఘట్టం కోసం కాంగ్రెస్ పార్టీ నేతలు అటు ఉత్కంఠతోనూ, ఇటు ఆందోళనతోనూ ఎదురుచూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

కొత్త మనోహర్‌రెడ్డిపై కాంగ్రెస్ సస్పెన్షన్ వేటు

క్రమశిక్షణ ఉల్లంఘించారంటూ చర్యలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్న కొత్త మనోహర్‌రెడ్డిపై ఆ పార్టీ వేటు వేసింది. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారంటూ సస్పెండ్ చేసింది. పీసీసీ ఉపాధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆదేశానుసారం కొత్త మనోహర్‌రెడ్డిపై చర్యలు తీసుకుంటున్నట్టు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి బుధవారం ప్రకటన విడుదల చేశారు. కొత్త మనోహర్‌రెడ్డి ఇటీవలే బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. మహేశ్వరం టికెట్ కోసం దరఖాస్తు కూడా చేసుకున్నారు. అయితే మూడు రోజుల క్రితం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. మహేశ్వరం టికెట్ కోసం ఓ అభ్యర్థి నుంచి ఐదెకరాల భూమి తీసుకున్నట్టు ఆరోపించారు. దీనిని అధిష్టానం సీరియస్‌గా తీసుకుని చర్యలకు ఆదేశించింది.



'నెట్'లో చిక్కుకున్న

చిన్నారులు

ఆన్‌లైన్ గేమ్స్, ఓటీటీల వీక్షణంలో 3 గంటలకుపైగా గడుపుతున్న చిన్నారులు	పిల్లల్లో పెరుగుతున్న అసహనం, కుంగుబాటు, దుందుడుకుతనం	లోకల్ సర్కిల్స్ సంస్థ సర్వేలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: వానల్లు కురవాలి వానదేవుడా/ వరిచేలు పండాలి వానదేవుడా/..వానా వానా వల్లప్ప...వాకిట తిరుగు చెల్లప్ప/ చెట్టుమీద దెయ్యం/ నాకేం భయ్యం / వీరి వీరి గుమ్మడిపండు వీరి పేరేమీ...ఇవన్నీ పల్లెటూళ్లలో చిన్నారులు ఆరుబయట ఆటలు ఆడుకుంటూ పాడుకునే పాటలు. బడి నుంచి ఇంటికొచ్చేసి వీధి కూడలిలోనో, ఇంటిముందో పిల్లలు చేరుకుని ఇలా కబడ్డీ, పైలా పచ్చీస్, ఖోఖో, దాగుడుమూతలు, కోతికొమ్మచ్చి వంటి ఆటలు ఆడుకుంటుంటే పెద్దవాళ్లు కూడా ఆ చిన్నారుల్ని చూసి ఆనందపడిపోయేవారు. అదంతా గతం..ఇప్పుడా ఆటల్లేవు పాటల్లేవు...ఆ ఆనందమూ లేదు. ఎందుకంటారా? ఇదిగో ప్రపంచాన్నే కుగ్రామంగా మార్చేసిన అంతర్జాలం(ఇంటర్‌నెట్)...ఈ మాయలో పడి నేటితరం పిల్లలు ఆటపాటలూ..ఆనందమూ అందులోనే వెతుక్కుంటున్నారు. నాటితరం ఆటలు శారీరక వ్యాయామానికి, మానసిక వికాసానికి దోహదపడితే నేటితరం ఆన్‌లైన్ ఆటలు పిల్లల్లో తీవ్ర ఒత్తిడిని, అసహనాన్ని పెంచుతున్నాయి.

సర్వేలో వెల్లడైన ఆసక్తికర విషయాలు

ఎంతమంది పిల్లలు ఆన్‌లైన్‌లో ఎంత సమయం గడుపుతున్నారు? ఎటువంటివి ఎక్కువగా చూస్తున్నారు? వంటి అంశాలపై 'లోకల్ సర్కిల్స్'అనే సంస్థ ఇటీవల ఓ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలోభాగంగా దేశవ్యాప్తంగా 46 వేలమంది తల్లిదండ్రుల నుంచి అభిప్రాయాలను సేకరించింది. తొమ్మిది నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న వారు ఆన్‌లైన్‌లో ఆటలు ఆడటం, టీవీ వీక్షణం, ఓటీటీలు చూడటం వంటి పనుల్లో రోజుకు మూడు గంటలకు పైగానే గడుపుతున్నారని 61% మంది పట్టణ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. దీంతోపాటు ఈ సర్వేలో పలు ఆసక్తికర అంశాలు కూడా వెల్లడయ్యాయి.

అంశాల వారీగా సర్వేలో వెల్లడైన అంశాలు ఇలా ఉన్నాయి

ఓటీటీలు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్ కోసం ఇంటర్‌నెట్‌పై రోజులో ఎంత సమయం గడుపుతున్నారు..?	ఎంత సమయం	ఎంత శాతం మంది
	ఆరు గంటలకుపైనే	15%
	మూడు నుంచి ఆరు గంటలు	46%
	గంట నుంచి మూడు గంటలపాటు	39%

9 నుంచి 17 ఏళ్ల వయసు వారు ఎక్కువ సమయం ఏం వీక్షిస్తున్నారు?

సోషల్ మీడియా (ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, స్నాప్‌చాట్, రీల్స్)	వీడియోలు, ఓటీటీలు (యూట్యూబ్, ప్రైమ్‌వీడియో, నెట్‌ఫ్లిక్స్, హాట్‌స్టార్..)	ఆన్‌లైన్ గేమ్స్	ఆన్‌లైన్‌లో ఇతర అంశాలు చూస్తున్నారు
35%	37%	33%	10%

మా పిల్లలు వేటికీ వ్యసనం కాలేదు 8% | ఏమీ చెప్పలేం 2%


18 ఏళ్లలోపు వారు సోషల్ మీడియా ఖాతాలు తెరవాలన్నా, ఆన్‌లైన్ గేమ్స్ ఆడాలన్నా తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి చేయాలన్న నిబంధనను తీసుకొస్తే మీరు సమర్థిస్తారా..?	సమర్థిస్తాం	లేదు.. కనీస వయసు 15 ఏళ్లు ఉన్నా చాలు..	లేదు, కనీస వయసు 13 ఏళ్లు ఉన్నా చాలు..	ఏమీ చెప్పలేం..
	73%	13%	9%	5%

ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడపడంతో మీ పిల్లల ప్రవర్తనలో గమనించిన మార్పులు ఏమిటి?

మార్పులు	శాతం మంది		
అసహనం పెరిగింది	37%	నీరసపడిపోవడం	27%
దుందుడుకు స్వభావం పెరిగింది	39%	ఇతర అనారోగ్యం	6%
కుంగుబాటు (డిప్రెషన్) పెరిగింది	22%	సంతోషంగా ఉన్నారు	8%
చలాకీతనం (హైపర్ యాక్టివ్)	25%	కలుపుగోలుతనం పెరిగింది	10%
		పైవేవీ కాదు	2%

(కొందరు తల్లిదండ్రులు ఒకటి కంటే ఎక్కువ అంశాలు గమనించినట్లు చెప్పారు)


డిజిటల్ ఎడిక్షన్ కాకుండా చూడాలి



ఆన్‌లైన్ తరగతుల కారణంగా పిల్లలకు స్మార్ట్ ఫోన్ల అలవాటు తప్పనిసరైంది. అయితే అది డిజిటల్ ఎడిక్షన్ కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. సైబర్ సెక్యూరిటీ అంశాలను వారికి తెలియజెప్పాలి. అవసరం మేరకు చైల్డ్ రిస్ట్రిక్షన్ ఆప్షన్లు ఎనేబుల్ చేసుకోవాలి

– డాక్టర్ ప్రజ్ఞా రష్మీ, మానసిక వైద్యురాలు

తల్లిదండ్రులు ఓ కన్నేయాలి



స్మార్ట్ ఫోన్లలో పిల్లలు ఏ వీడియోలు చూస్తున్నారు? ఎలాంటి గేమ్‌లు ఆడుతున్నారు? వంటి విషయాలపై తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతుండాలి. అవసరం మేరకు మాత్రమే పిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వడం ఉత్తమం.

– భాను పద్మజ, రిటైర్డ్ టీచర్

టెట్‌లో తగ్గిన రిజల్ట్

▶ మొదటి పేజీ తరువాయి

జరిగింది. దాదాపు 3.5 లక్షల మంది టెట్ అర్హులు రాష్ట్రంలో ఉన్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది టెట్ ఫలితాలు పడిపోయాయి. పేపర్–1లో 2022లో మినహా అంతకు ముందు రెండేళ్లలో 50 శాతానికిపైగా రిజల్ట్ వచ్చింది. పేపర్–2లో మొదట్నుంచీ రిజల్ట్ తగ్గుతున్నా ఈసారి అతితక్కువగా 15.30% నమోదైంది. గతేడాది వరుస నోటిఫికేషన్లు ఇవ్వడం, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేస్తామనే ప్రకటనతో అభ్యర్థులు కోచింగ్ కేంద్రాలకు వెళ్లి మరీ టెట్‌కు సన్నద్ధమయ్యారు. ఈసారి టీఆర్టీ నోటిఫికేషన్ విడుదల చేసినా పోస్టులు తక్కువగా ఉండటం, రోస్టర్ విధానం తర్వాత కొన్ని జిల్లాల్లో ఏమాత్రం ఖాళీలు లేకపోవడంతో ఎక్కువ మంది టెట్‌కు ప్రిపేర్ కాలేదు.

టీఆర్టీ దరఖాస్తుకు అర్హులు

తాజాగా టెట్ ఉత్తీర్ణులు ప్రస్తుతం ప్రభుత్వం నియమించే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి టెట్ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఫలితాలు వెల్లడవ్వడంతో ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాలు కూడా ఆలస్యం చేయకుండా ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. టీఆర్టీకి పెద్దగా దరఖాస్తులు రాలేదు. కొన్ని జిల్లాల్లో స్థానికత ఉన్నప్పటికీ పోస్టులు లేవని, పోస్టులు ఉన్న చోట నాన్–లోకల్ కోటాలో వెళ్లినా, ఆ కేటగిరీలో తక్కువ పోస్టులు ఉన్నాయని అభ్యర్థులు టీఆర్టీకి వెనకడుగు వేస్తున్నారు. తాజా టెట్ అర్హులు టీచర్ పోస్టులకు ఎక్కువగా దరఖాస్తు చేసే వీలుందని భావిస్తున్నారు.

	పేపర్		అభ్యర్థులు	ఉత్తీర్ణులు	శాతం
2016లో టెట్ ఉత్తీర్ణత	పేపర్–1		88,661	48,278	54.45
	పేపర్–2		2,51,906	63,079	25.04
2017లో టెట్ ఉత్తీర్ణత	పేపర్–1		98,848	56,708	57.37
	పేపర్–2 (సైన్స్)		1,11,018	20,233	18.22
	పేపర్–2 (సోషల్)		1,19,914	24,732	20.62
2022లో టెట్ ఉత్తీర్ణత	పేపర్–1		3,18,506	1,01,922	32.68
	పేపర్–2		2,51,070	1,04,078	49.64
2023లో టెట్ ఫలితాలు ఇలా	పేపర్		పరీక్ష రాసిన వారు	అర్హత పొందిన వారు	శాతం
	పేపర్–1		2,23,582	82,489	36.89
	పేపర్–2	మేథ్స్, సైన్స్	1,01,134	18,874	18.66
		సోషల్ స్టడీస్	88,913	10,199	11.47
		పేపర్–2 (మొత్తం)	1,90,047	29,073	15.30

క్లుప్తంగా...

నిరాశ, నిస్పృహల్లో కేసీఆర్ కుటుంబం: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతో తీవ్ర నిరాశ, నిస్పృహల్లో ఉన్న సీఎం కేసీఆర్ కుటుంబం ఏది పడితే అది మాట్లాడుతోందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ప్రధాని మోదీతో పాటు బీజేపీపై ఆ కుటుంబం విమర్శలు గుప్పిస్తోందన్నారు. తెలంగాణలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల కోసం పీఎం వస్తుంటే.. బీఆర్ఎస్ నాయకులకు ఉలికిపాటు ఎందుకని ఆయన ప్రశ్నించారు. బుధవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ సాధనలో 1,200 మంది బలిదానం అయితే గానీ కాంగ్రెస్ పార్టీలో చలనం రాలేదనీ, అలాంటి కాంగ్రెస్‌ను నిలదీస్తుంటే కేటీఆర్ తట్టుకోలేక పోతున్నారని ఆరోపించారు. బీజేపీ బీసీ వ్యతిరేక పార్టీ అని విమర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత.. అసలు బీఆర్ఎస్ నుంచి బీసీ ముఖ్యమంత్రి కాగలరా? కనీసం మీ పార్టీకి అధ్యక్షుడిని బీసీని చేయగలరా...?అని ప్రశ్నించారు.

ఓటర్ల తుదిజాబితా గడువు 20 రోజులు పొడిగించాలి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఓటర్ల తుది జాబితా విడుదల గడువును కనీసం 20 రోజులు పొడిగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులకు బీజేపీ నేత, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. పోలింగ్ బూత్‌ల మార్పు, చిరునామాలో మార్పు, ఓటును మరోచోటికి మార్చడం తదితర కరెక్షన్లకు సంబంధించి ఫామ్ 8 దరఖాస్తులు లక్షల్లో పెండింగ్‌లో ఉన్నాయని, క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్లకు గురువారం ఆఖరు తేదీ కావడంతో పాటు అక్టోబర్ 4న ఫైనల్ జాబితా వస్తుంది కాబట్టి దీనిని పొడిగించాలని కోరుతున్నామన్నారు. ఎన్నికల నిర్వహణ గడువు పెంచమని తాము కోరడం లేదని స్పష్టం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడు తూ, తప్పులతడకగా ఓటరు జాబితా తయారీ మంత్రి కేటీఆర్ కనుసన్నల్లో జరిగిందని ఆరోపించారు.

టీఎస్‌పీఎస్సీపై సీబీఐ దర్యాప్తునకు డిమాండ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అని ఓ వైపు చెబుతున్న ప్రభుత్వం .. ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణంలో సీబీఐ దర్యాప్తునకు ఎందుకు అంగీకరించడం లేదని భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్ఎస్‌యూఐ) రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్రావు ప్రశ్నించారు. వెంటనే సీబీఐ విచారణకు అంగీకరించాలని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగుల పక్షాన ఎన్ఎస్‌యూఐ మొదటి నుంచీ పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేంతవరకు విద్యార్థి, నిరుద్యోగ లోకానికి అందుబాటులో అండగా ఉంటామని వెంకట్ చెప్పారు.


నియంత పాలన ముగియబోతోంది

రాజగోపాల్‌రెడ్డి ట్వీట్



సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణలో నియంత పాలన ముగియబోతోంది. దొరల గడీలు బద్దలయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయి... మార్క్ మై వర్డ్స్...'అంటూ బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి బుధవారం సోషల్‌మీడియా ఎక్స్ (ట్విట్టర్)లో ట్వీట్ చేశారు. బీజేపీలో కొందరు అసంతృప్తనేతలు వరుస భేటీలు నిర్వహించడంతో పాటు కొన్ని అంశాలపై స్పష్టత నివ్వకపోతే పార్టీ మారేందుకు కూడా వెనుకాడబోమని అధిష్టానానికి అల్టిమేటమ్ కూడా ఇచ్చారని వార్తలు వెలువడిన నేపథ్యంలో ఆయన ఈ పోస్ట్ పెట్టినట్లు తెలుస్తోంది. రాజగోపాల్‌రెడ్డి కూడా బీజేపీకి రాజీనామా చేస్తారని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. బుధవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరిగిన పదాధికారుల భేటీకి హాజరైన సందర్భంగా జాతీయ కార్యవర్గసభ్యుడు జి.వివేక్ కూడా తాను పార్టీ మారబోవడం లేదంటూ స్పష్టం చేశారు.

మోదీని నిలదీసే దమ్ము కేసీఆర్‌కు లేదు: షర్మిల



సాక్షి, హైదరాబాద్: ప్రధాన మంత్రికి రాష్ట్రంలో అడుగు పెట్టే అర్హత లేదంటున్న సీఎం కేసీఆర్‌కు ఎదురెళ్లి మోదీని నిలదీసే దమ్ము మాత్రం లేదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. నిజంగా దొరకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమైతే ఈ ఐదేళ్లలో మోదీ వచ్చిన ప్రతీసారి మొహం ఎందుకు చాటేశారని ట్విట్టర్ వేదికగా ఆమె ప్రశ్నించారు. 'ఈయన అడగడు.. ఆయన ఇవ్వడు. 10 ఏళ్లుగా ఇదే తంతు'అని ఎద్దేవా చేశారు. విభజన హామీలు, తెలంగాణకు దక్కాల్సిన నిధుల గురించి ఎందుకు నిలదీయలేదన్నారు. కేంద్రం ఏటా బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి ఇస్తుంటే.. బీఆర్ ఎస్ ఎంపీలు చేతకాని దద్దమ్మల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేసుల నుంచి తప్పించుకునేందుకు సీఎం మోదీ వద్ద మోకరిల్లారని ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ వస్తే.. అంధకారమే

- సీల్డ్ కవర్‌లో సీఎంలను మార్చడం గ్యారెంటీ... వారెంటీ లేని ఆ పార్టీ గ్యారెంటీలు ఎలా ఇస్తుంది
- 65 ఏళ్లలో 11 సార్లు అవకాశం ఇస్తే ఏం చేసింది?
- కొందరు ఇతర రాష్ట్రాల్లో దోచుకున్న డబ్బులతో వస్తున్నారు.. జాగ్రత్త
- అందరి పైసలు తీసుకుని కేసీఆర్‌ను ఆశీర్వదించండి
- గంభీరావుపేట బహిరంగ సభలో మంత్రి కె.తారక రామారావు



గంభీరావుపేటలో ఓ డబుల్ బెడ్రూం ఇంటిని లబ్ధిదారుతో ప్రారంభోత్సవం చేయిస్తున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. అంధకారం గ్యారెంటీ అని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. బుధవారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో 378 డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలను లబ్దిదారులకు పంపిణీ చేశారు. అనంతరం బహిరంగసభలో మంత్రి మాట్లాడుతూ, 65 ఏళ్లలో 11 సార్లు కేంద్రంలో, రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే.. కేసీఆర్ ఇప్పుడు చేసిన వాటిల్లో ఒక్క పనికూడా చేయని వాళ్లు ఐదు గ్యారెంటీలు, ఆరు గ్యారెంటీలు.. అరవై గ్యారెంటీలు అంటూ మోసం చేసేందుకు వస్తున్నారని ధ్వజమెత్తారు. ఆ దిక్కుమాలిన రోజులు మళ్లీ రావాలనా..? అని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు, నీళ్లకోసం యుద్ధాలు గ్యారెంటీ, రైతులకు ఎరువులు, విత్తనాలు అందక చెప్పులను లైన్‌లో పెట్టుడు గ్యారెంటీ, సీల్డ్ కవర్లలో ఢిల్లీ నుంచి ఐదేళ్లలో ఐదుగురు సీఎంలను మార్చడం గ్యారెంటీ, పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి ఆగమవడం గ్యారెంటీ, విద్యా, వైద్యం వందశాతం వెనకకు పోవడం గ్యారెంటీ' అని ఎద్దేవా చేశారు. వారెంటీ లేని కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ ఇస్తుందట అని దుయ్యబట్టారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, కర్ణాటకలో రూ.4 వేలు పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కత్తి వాళ్లది కాదు.. నెత్తి వాళ్లది కాదు.. ఎన్ని హామీలైనా ఇస్తారని అన్నారు. కేసీఆర్ ఏది ఇస్తే.. దానికి డబుల్ ఇస్తామంటూ హామీలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు.

దోచుకున్న డబ్బులతో వస్తున్నారు..

ఇతర రాష్ట్రాల్లో దోచుకున్న డబ్బులతో కొందరు నాయకులు వస్తున్నారని, కానీ ప్రజలు ఆగం కావద్దని కేటీఆర్ అన్నారు. ఒక్కసారి మోస పోతే.. గోస పడ్తామన్నారు. 'కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఇచ్చే డబ్బులు తీసుకొని జేబులో పెట్టుకోండి.. మీకోసం పని చేసే కేసీఆర్‌ను ఆశీర్వదించండి'అని సూచించారు. దేశంలో డబ్బుల ప్రభావం ఎక్కువైందన్నారు. ఎన్నికలప్పుడు మందు, డబ్బులు ఇవ్వడం తన వల్ల కాదని మరోసారి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రెండు మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధి అంతా.. సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌లోనే చేస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు అంటుంటే.. ఇక సిరిసిల్లలో ఏం చేసిండు అని స్థానిక నాయకులు అంటున్నారని కేటీఆర్ అన్నారు. ఇందులో ఏది నిజమో ప్రజలే నిర్ణయించాలని కోరారు.

సిరిసిల్లకు రావడం తక్కువైంది

'నేను మంత్రిని అయ్యాక సిరిసిల్లకు రావడం తక్కువైంది. వేరే కాడికి వెళ్లడం.. చేసిన అభివృద్ధి గురించి చెప్పడం ఎక్కువైంది. కేటీఆర్ రావడం లేదని తిట్టుకోవద్దు'అని మంత్రి అన్నారు. కాగా, గంభీరావుపేట–లింగన్నపేట మధ్య మానేరు వాగుపై రూ.13.50 కోట్లతో నిర్మించే వంతెనకు కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి: తమ్మినేని

సాక్షి, హైదరాబాద్: ఇచ్చిన హామీ మేరకు కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. 2023–24 బడ్జెట్‌లో గీత కార్మికులకు కేటాయించిన నిధులు ఖర్చు చేయాలని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, అనేక కారణాలతో ఏడాదికి వందల మంది చనిపోతున్నారని, కాళ్లు, చేతులు విరిగి తమ జీవనాధారాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'పాలిటిక్స్‌లో కేటీఆర్ మోస్ట్ అన్‌ఫిట్ పర్సన్'

సాక్షి, హైదరాబాద్: మంత్రి కేటీఆర్ రాజకీయాల్లో మోస్ట్ అన్ ఫిట్ పర్సన్ అని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.ప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. టీఎస్‌పీఎస్సీలో ఒక్క గ్రూప్–1 ఎగ్జామ్‌ను కూడా నిర్వహించలేని అసమర్థుడు కేటీఆర్. ఆయనకు కేంద్రమంత్రిని, ప్రధాని మోదీని ప్రశ్నించే అర్హత లేదన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, టీఎస్‌పీఎస్సీ పరీక్షల విషయంలో సాంకేతికమైన లోటుపాట్లకు తావిచ్చిందే బీఆర్ఎస్ అని ఆరోపించారు. పరీక్ష నిర్వహణలో సర్కార్ అసమర్థతతో 30 లక్షల మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారని, కేటీఆర్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీ జనాభాకు అనుగుణంగా టికెట్లివ్వాలి

జాజుల శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ జనాభాకు అనుగుణంగా అసెంబ్లీ అభ్యర్థులను ఎంపిక చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. టీపీసీసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను బుధవారం ఆయన కలిశారు. కర్ణాటక తరహాలో తెలంగాణలో కూడా బీసీ సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న బీసీ జనాభాకు అనుగుణంగా ఇక్కడ 60 మంది బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని, ఉదయ్‌పూర్ డిక్లరేషన్ కచ్చితంగా అమలు చేయాలని కోరారు. దీనిపై ఠాక్రే సానుకూలంగా స్పందించినట్లు జాజుల తెలిపారు.

కాంగ్రెసోళ్లవి ఆపద మొక్కులు

- మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- వారి మాటలు నమ్మితే ఆగమైపోతాం
- కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమని ధీమా



తూప్రాన్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

తూప్రాన్: కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మితే మన భవిష్యత్ ఆగమైతదని ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. బుధవారం ఆయన మెదక్ జిల్లా తూప్రాన్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికలు దగ్గరపడే కొద్దీ కాంగ్రెస్ నాయకులు ఆపద మొక్కులు మొక్కుతూ, ఆచరణ సాధ్యంకాని హామీలు ఇస్తున్నారని మండిపడ్డారు. అలాంటి దొంగ కాంగ్రెస్ వాళ్లు కావాలా..? ప్రజల కష్టాలు తీర్చే కేసీఆర్ కావాలా.. ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. 50 ఏళ్ల పాటు కాంగ్రెస్ వాళ్లతో ఏగాం.. వీళ్ల సంగతి మనకు తెలియదా అని అన్నారు. 'కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ ఎప్పుడైనా గజ్వేల్‌కు వచ్చాడా.. ఏం అభివృద్ధి జరిగిందో నీ మొఖానికి ఏమి తెలుసు'అని ఎద్దేవా చేశారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్ నుంచి కామారెడ్డికి వెళ్లే సమయంలో ఒక్కసారైనా తూప్రాన్‌లో ఆగి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్న పాపాన పోలేదని విమర్శించారు. 'రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి మీ కళ్లకు కనిపించడంలేదా.. లేకుంటే కంటి వెలుగులో చూపించుకోండి'అని కాంగ్రెస్ నేతలకు సలహా ఇచ్చారు. రైతుబంధు, రైతుబీమా, ఇంటింటికీ తాగునీరు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం కేసీఆర్‌ను విమర్శించడమే కాంగ్రెస్ నాయకులు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని గిమ్మిక్కులు చేసినా కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

త్వరలో శుభవార్త వింటారు

తెలంగాణ ప్రజలు త్వరలో శుభవార్త వింటారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. తమ పార్టీ మేనిఫెస్టో అన్ని వర్గాలను ఆకట్టుకునే విధంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ పనిలోనే నిమగ్నమయ్యారని, సీఎంనోటి నుంచే తీపి కబురు వింటారని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

తెలంగాణకు ఎవరేం ఇచ్చారో తేల్చుకుందామా?

మంత్రి కేటీఆర్‌కు ఎంపీ బండి సంజయ్ సవాల్



కరీంనగర్ టౌన్: 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు ఎందుకు రాకూడదు? కేంద్రం గత 9 ఏళ్లలో 9 లక్షల కోట్ల రూపాయలిచ్చింది. మరి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసింది? ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదు? తెలంగాణకు ఎవరేం చేశారో బహిరంగ చర్చకు సిద్ధమా? నీలో తెలంగాణ రక్తమే ప్రవహిస్తే సవాల్‌ను స్వీకరించాలి'అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ బుధవారం మంత్రి కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ప్రధానిని విమర్శించే కనీస అర్హత కేసీఆర్ కొడుకుకు లేదని మండిపడ్డారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఆయన కరీంనగర్‌లోని కోతిరాంపూర్ చౌరస్తా వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ రాష్ట్రానికి చేసిన సేవలను ఆయన కొనియాడారు. నిజాం వ్యతిరేక ఉద్యమ నేత, తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. బాపూజీపట్ల నిజంగా ప్రేమ ఉంటే 9 ఏళ్లపాటు ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం ఎందుకు నిర్వహించలేదో కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. కేంద్రం నిధులిస్తుండగా రాష్ట్రాన్ని 6 లక్షల కోట్ల రూపాయల అప్పుల కుప్పగా ఎందుకు మార్చారని ప్రశ్నించారు. సొంత పార్టీ నేతలే కేటీఆర్ భాషను చూసి చీదరించుకుంటున్నరని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి కొలువులు ఇచ్చే దమ్ములేదని, ఉద్యోగ పరీక్షలు నిర్వహించలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో ఏ పార్టీకీ గెలిచే బలం లేదు

- గెలుపు బలం బీజేపీ పెంచుకోవాలనే దానిపైనే నా ప్రయత్నాలు
- నేను బీజేపీలోనే ఉంటా.. ఎక్కడికీ పోను
- మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీతో పాటు బీఆర్ఎస్, ఇతర పార్టీలకు కూడా ఏకపక్షంగా గెలిచే బలం లేదని బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కొందరు బీజేపీ చాలా బలంగా ఉందని అనుకుంటారని, అయితే ఇంకా చేయాల్సింది చేస్తేనే ఎన్నికల్లో గెలిచే బలం వస్తుందనేది తమ అభిప్రాయమని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీలోనే తాను ఉంటానని, మరే ఇతర పార్టీలోనూ చేరబోనని స్పష్టం చేశారు. బుధవారం కొండా విశ్వేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రెండు, మూడు రోజులుగా మీడియాలో తాను ఇతర పార్టీల్లో చేరుతున్నట్టు, నాయకులతో భేటీలు నిర్వహిస్తున్నట్టు కథనాలు రావడంతో పార్టీ నేతలు వివరణ నివ్వాలని సూచించారని చెప్పారు. తాను ఎలాంటి రహస్య సమావేశాలు నిర్వహించలేదని, ఎన్నికల నేపథ్యంలో పార్టీ బలోపేతానికి ఏం చేయాలనే దానిపైనే చర్చించామని చెప్పుకొచ్చారు.

కేసీఆర్‌పై వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకోకుంటే నష్టమే

కేసీఆర్ సర్కార్‌పై ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకతను ఉపయోగించుకుని బీజేపీ ఈ బలాన్ని పెంచుకోవాలనేదే తమ ప్రయత్నమని చెప్పారు. దీనిని సరిగా ఉపయోగించుకోలేకపోతే ఓడిపోయే అవకాశాలు కూడా చాలానే ఉన్నాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపై తమకున్న కొన్ని అనుమానాలపై స్పష్టతనివ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నామని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రపార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాష్ జవదేకర్‌తో ఆయా అంశాలపై మాట్లాడామని, త్వరలోనే కేంద్రహోం మంత్రి అమిత్ షాను కూడా కలుస్తామని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. కాగా, కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుటుంబం డబ్బుతో కాంగ్రెస్ పార్టీని సులభంగా కొనుగోలు చేసే అవకాశం ఉందంటూ విశ్వేశ్వర్‌రెడ్డి ట్వీట్ చేశారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నేతలు

చేసిన పనులకు సర్పంచ్‌లకు వెంటనే బిల్లులు ఇవ్వాలి: రఘునందన్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావుల సమక్షంలో దుబ్బాక నియోజకవర్గంలోని పలువురు బీఆర్ఎస్ నేతలు బీజేపీలో చేరారు. బుధవారం పార్టీకార్యాలయంలో జరిగిన చేరికల కార్యక్రమంలో కిషన్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ... సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. చేసిన పనులకు నెలాఖరులోగా బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు నిధులు, విధులు లేక ఆందోళన చెందుతున్నారన్నారు. గతంలోనూ పలువురు బీజేపీలో చేరారని, ఇంకా కొందరు చేరేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీజేపీలో చేరిన వారిలో రాయపోల్ మండలం వైస్ఎంపీపీ రాజిరెడ్డి, ఉమ్మడి దౌల్తాబాద్ మండలం మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు, కొత్తపల్లి సర్పంచ్ రంగమ్మ వారి కుమారుడు ఆంజనేయులు, ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు తూర్పు లక్ష్మణ్, పలువురు ఉపసర్పంచ్‌లు ఉన్నారు.

బహిరంగ సభలతో బీజేపీ

- ఎన్నికల నోటిఫికేషన్ నుంచి ప్రచార ముగింపు దాకా హోరెత్తించాలని ఆ పార్టీ నిర్ణయం
- అక్టోబర్ నెలలో 30 నుంచి 40 సభలతో 'కాషాయ కార్పెట్ బాంబింగ్'



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బహిరంగసభలతో హోరెత్తించేందుకు బీజేపీ సిద్ధమవుతోంది. వచ్చే అక్టోబర్ నెలలో 30 నుంచి 40 సభలు ఏర్పాటు చేసి పార్టీ అగ్ర నేతలు, కేంద్రమంత్రులు, పార్టీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొనేలా ప్రణాళిక రచించింది. ప్రధాని మోదీ తొమ్మిదేళ్లపాలనలో ప్రజల్లో పార్టీకి సానుకూలత పెరిగిందని, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగేందుకు సిద్ధమైంది. 17 లోక్‌సభ, 119 అసెంబ్లీ స్థానాల పరిధిలో సభల నిర్వహణ ద్వారా 'కార్పెట్ బాంబింగ్'చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ప్రజల మేలుకు తీసుకునే నిర్ణయాలు వివరించేందుకు సభల నిర్వహణకు శ్రీకారం చుడుతున్నట్టు ఇప్పటికే ఆ పార్టీ ప్రకటించింది. ఎన్నికల షెడ్యూల్, ఆ తర్వాత నోటిఫికేషన్ వెలువడ్డాక...ఒకటొకటిగా ఈ సభల నిర్వహణ వేగం పెంచి ఎన్నికల ప్రచారం ముగిసేనాటికి మొత్తం రాష్ట్రమంతా పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. ప్రధాని మోదీ అక్టోబర్1న మహబూబ్‌నగర్ జిల్లాలో, 3న నిజామాబాద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, బహిరంగసభల ద్వారా రాష్ట్రంలో బీజేపీ ఎన్నికల శంఖారావం పూరిస్తారు. అక్టోబర్ 6న బీజేపీ జాతీయఅధ్యక్షుడు జేపీ. నడ్డా రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. ఆ రోజున జరిగే విస్తృతస్థాయి రాష్ట్రకౌన్సిల్ సమావేశంలో పాల్గొని ఎన్నికల నేపథ్యంలో దిశానిర్దేశం చేస్తారు. అక్టోబర్ 7న ఆదిలాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభ ఉండే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల సమాచారం.

కిషన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం

కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం రాష్ట్ర పదాధికారులు సీనియర్ నేతల సమావేశంలో జరిగింది. ఓబీసీ మోర్చా జాతీయఅధ్యక్షుడు డా. కె.లక్ష్మణ్, జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లు ఇంద్రసేనారెడ్డి, వివేక్‌వెంకటస్వామి, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు, తమిళనాడు రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీలు రవీంద్రనాయక్, కొండావిశ్వేశ్వర్‌రెడ్డి, జి.విజయరామారావు పాల్గొన్నారు. సమావేశానంతరం రాష్ట్ర ప్రధానకార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బంగారు శ్రుతి, ప్రదీప్‌కుమార్, కాసం వెంకటేశ్వర్లు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాష మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి మోదీ ప్రభుత్వం ఇప్పటికే వేలకోట్ల నిధులు కేటాయించిందని, మరిన్ని అభివృద్ధి పనుల నిమిత్తం అక్టోబర్ 1న మధ్యాహ్నం 12 గంటలకు మహబూబ్‌నగర్‌లో బహిరంగసభ, అక్టోబరు 3న మధ్యాహ్నం నిజామాబాద్‌లోని గిరిరాజ్ కళాశాల మైదానంలో సభ ఉంటుందని చెప్పారు. ఈ పర్యటన సందర్భంగా మోదీ రాష్ట్రంలో ఇప్పటికే చేపట్టిన పనులతో పాటు ఇంకా ప్రారంభించాల్సిన పనులపై ప్రకటన చేస్తారన్నారు. రాష్ట్రాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో గుణాత్మకమైన మార్పుకు ప్రయత్నం జరుగుతోందన్నారు.



రుజువు లేకుండా స్థిరపరిచినదాన్ని, రుజువు లేకుండానే నిరాకరించవచ్చు.
– యూక్లిడ్

సాక్షి
గురువారం, 28 సెప్టెంబర్ 2023

పటిష్ఠతే పరమావధి!

అనుమానం పెనుభూతం! ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ గుర్తింపు కార్యక్రమమైన మన 'ఆధార్' విశ్వసనీయతపై ఏళ్ళు గడిచినా ఇప్పటికీ ఏవో అనుమానాలు వస్తూనే ఉన్నాయి. భారత సర్కార్ ఎప్పటికప్పుడు ఆ అనుమానాల్నీ, ఆరోపణల్నీ కొట్టిపారేస్తున్నా అవి మాత్రం ఆగడం లేదు. ప్రపంచశ్రేణి రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ తన తాజా నివేదికలో ఆధార్ భద్రత, వ్యక్తిగత గోప్యతలపై లేవనెత్తిన ప్రశ్నలతో ఈ అంశం మరోసారి తెర మీదకు వచ్చింది. ఎలాంటి సాక్ష్యాధారాలూ పేర్కొనకుండా, అర్థం లేని ఆందోళన వ్యక్తం చేస్తున్నారంటూ ప్రభుత్వం సహజంగానే ఈ నివేదికను కొట్టిపారేసింది. అయితే, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద శ్రామికులకు జరిపే చెల్లింపులు సహా సమస్తం ఇకపై ఆధార్‌తోనే జరపాలని ప్రభుత్వం ముమ్మరంగా ప్రయత్నిస్తున్న వేళ మూడీస్ నివేదికలోని మాటలు కొంత ఆందోళన రేపుతున్నాయి. సత్వరమే ఆ అనుమానాల్ని నివృత్తి చేసి, ఆధార్ సందేహాతీతమైనదని మరోసారి చాటాల్సిన అవసరం ఏర్పడింది.

న్యూయార్క్ కేంద్రంగా నడిచే రేటింగ్ ఏజెన్సీ మూడీస్ గురువారం విడుదల చేసిన పరిశోధనా నివేదిక ఆ మధ్య కొత్తగా రంగప్రవేశం చేసిన 'వరల్డ్ కాయిన్'తో మన ఆధార్‌ను పోల్చింది. విస్తృత పరిమాణం, సృజనాత్మక ఆలోచన రీత్యా రెండూ ప్రత్యేకంగా నిలిచాయని ప్రశంసించింది. అయితే, భద్రత, గోప్యతలే అసలు సమస్యలంటూ కొన్ని ప్రాథమికమైన ప్రశ్నలు వేసింది. ఉష్ణోగ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉండే చోట ఆధార్ లాంటి బయోమెట్రిక్ సాంకేతిక పరిజ్ఞానం ఏ మేరకు సమర్థంగా పనిచేస్తుందన్నది సదరు నివేదిక అనుమానం. ఆధార్ ధ్రువీకరణలో ఇబ్బందుల వల్ల పలుమార్లు సేవలు అందడం లేదనేది దాని వాదన. అన్నిటి కన్నా ముఖ్యంగా, ఆధార్ వ్యవస్థ సురక్షితమేనా, అందులోని వ్యక్తిగత సమాచారం గోప్యమేనా అన్నది మూడీ సంధిస్తున్న ప్రశ్న.

దేశంలో 120 కోట్లమందికి పైగా బయోమెట్రిక్, జనసంఖ్యా సంబంధ వివరాలను ఈ ఆధార్ బృహత్ యజ్ఞంలో నమోదు చేశారు. ఎవరికి వారికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించారు. వేలిముద్రలు, కనుపాపల స్కానింగ్, వన్‌టైమ్ పాస్‌వర్డ్ లాంటి పద్ధతుల్లో వ్యక్తులు తమ గుర్తింపును నిర్ధారించి, ప్రభుత్వ, ప్రైవేట్ సేవలను అందుకొనే వీలు కల్పించారు. మొదట కొంత తటపటాయింపు ఉన్నా, క్రమంగా ఆధార్ నమోదు, దాని వినియోగం విస్తరించింది. బలహీనవర్గాలకు అందించే ప్రభుత్వ సహాయాలకే కాదు... చివరకు బ్యాంకు ఖాతాల ఆరంభం, మొబైల్ కనెక్షన్, పన్నుల చెల్లింపు సహా అనేక రోజువారీ పనులకు సైతం ఆ నంబర్ తప్పనిసరైంది. దళారుల బాధ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమ పథకాల సాయం అందేలా ఆధార్ బాట వేసింది.

ఆధార్ వ్యవహారాలన్నీ చూసే కేంద్ర సంస్థగా 'భారత యునీక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ' (యూఐడీఏఐ) వ్యవహరిస్తోంది. చిత్రం ఏమిటంటే, సదరు సంస్థకు నాలుగేళ్ళుగా నాథుడు లేడు. ఎట్టకేలకు గత నెలలో ప్రభుత్వం ఓ తాత్కాలిక ఛీఫ్‌ను నియమించింది. ఇలాంటి చర్యలు ఆధార్ నిర్వహణ పట్ల పాలకుల చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అలాగే, ఈ సంస్థపై 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా' (కాగ్) నిరుడు విడుదల చేసిన నివేదిక సైతం ఆధార్ నమోదు ప్రక్రియలో లోపాలు, తప్పుడు బయోమెట్రిక్ లాంటి అనేక అంశాలను ఎత్తిచూపడం గమనార్హం. ఆధార్‌లో నమోదైన సమాచారపు భద్రత, వ్యక్తిగత గోప్యత గాలికి పోయే ప్రమాదాన్ని హెచ్చరించింది. ఇవాళ్టి మూడీస్ నివేదిక కన్నా చాలా ముందే మన 'కాగ్' వ్యక్తం చేసిన ఈ భయాలపై ప్రభుత్వం ఏ చర్య తీసుకున్నదీ సమాచారం లేదు.

కేంద్రంలో గడచిన 'ఐక్య ప్రగతిశీల కూటమి' (యూపీఏ) ప్రభుత్వ హయాంలో ఆరంభమైనప్పటి నుంచి ఆధార్‌పై భిన్న వాదనలు వస్తూనే ఉన్నాయి. ఆధార్‌కు అనేక సానుకూలతలు ఉన్నప్పటికీ ఈ ప్రక్రియ, వినియోగం నిర్దుష్టమైనదేమీ కాదని సర్కార్ నుంచి సామాన్యుల దాకా అందరికీ తెలుసు. ఇవాళ్టికీ గ్రామీణ భారతావనిలో డిజిటల్ గుర్తింపు చూపలేనివారికి రేషన్ అంద ట్లేదనీ, కొన్ని ఆకలి చావులకు అదీ ఒక కారణమనీ వార్తలొచ్చాయి. ఆధార్ లోపానికీ, ఆ చావులకూ కారణం లేదన్న ఖండనలూ విన్నాం. అయితే, అతిగా టెక్నాలజీపై ఆధారపడి, సాయం పొందా ల్సినవారిని తృణీకరించడం, అసలు లక్ష్యాన్ని విస్మరించడం అమానవీయతే! రోజూ పనిపాటలతో శ్రమించే వారి చేతిరేఖలు చెరిగిపోతే అది వారి పాపమా? కంటిపాపల స్కానింగ్, వన్‌టైమ్ పాస్‌వర్డ్ లాంటివి కూడా ఉన్నా నెట్ సౌకర్యం లేని సుదూర గ్రామీణ ప్రాంతాల్లో వాటి మీద పూర్తిగా ఆధారపడలేం.

అలాగే, అంచెలంచెల సైబర్ భద్రత ఉందని సర్కారు చెబుతున్నప్పటికీ, అనేక సందర్భాల్లో ఆధార్ సమాచారం గంపగుత్తగా లీకవడం చూశాం. ఈ సమాచార నిధి సైబర్ దొంగల చేతిలో పడితే పర్యవసానాలూ తీవ్రమే! అందుకే, లోపాలను ప్రస్తావించినవారిని నిందించే కన్నా, వాటిని సరిదిద్దడంపై దృష్టి పెట్టడం తక్షణ కర్తవ్యం. ముఖ్యంగా ప్రస్తుతం నడుస్తున్న కేంద్రీకృత విధానం బదులు సమాచార గోప్యత, రక్షణ కోసం మూడీస్ సూచించినట్లుగా ఆధార్‌కు వికేంద్రీకరణ విధానాన్ని అవలంబించడం మంచిదేమో చూడాలి. తద్వారా ఒక అంచెలో ఉల్లంఘన జరిగినప్పటికీ, అక్కడితో నష్టనివారణ చేయగలమని గుర్తించాలి. ఇటీవల జీ–20లోనూ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)లో అద్భుతమంటూ మనం చెప్పుకున్న ఆధార్ వ్యవస్థపై సమగ్ర సమీక్ష జరపాలి. పూర్తి లోపరహితంగా మార్చే పని మొదలుపెట్టాలి. ఓటర్ల జాబితా సహా సమస్తానికీ ఆధారంగా అనుసంధానించాలని అనుకుంటున్న వేళ అది మరింత అవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, తిథి: శు.చతుర్దశి సా.6.26 వరకు, తదుపరి పౌర్ణమి,
నక్షత్రం: పూర్వాభాద్ర రా.2.49 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర,
వర్జ్యం: ఉ.10.24 నుండి 11.53 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.53 నుండి 10.41 వరకు, తదుపరి ప.2.38 నుండి 3.26 వరకు,
అమృత ఘడియలు: రా.7.21 నుండి 8.51 వరకు, అనంతపద్మనాభ వ్రతం.

సూర్యోదయం : 5.53
సూర్యాస్తమయం : 5.51
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ఆచితూచి వ్యవహరించాల్సిందే!

విశ్లేషణ



శ్యామ్ శరణ్

కెనడాలోని ఒక సిక్కు నాయకుడి హత్యలో భారత్ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలు ఇరుదేశాల సంబంధాలను తీవ్రంగా దెబ్బతీశాయి. రాజకీయంగా తన ప్రాచుర్యం క్రమేపీ తగ్గిపోతున్న నేపథ్యంలో, ఖలిస్తాన్ అనుకూలురు ఉన్న 'ఎన్‌డీపీ' తన సంకీర్ణంలో కొనసాగేందుకు ట్రూడో ఈ పని చేసుండాలి. 2018 నాటి భారత పర్యటనలో తనను పట్టించుకోలేదన్న ట్రూడో అసంతృప్తి కూడా మరో కారణం కావొచ్చు. ఏమైనా ఈ వ్యవహార ప్రభావం అమెరికా, ఇతర జీ–7 దేశాల సంబంధాలపై పడకుండా చూసుకోవాలి. ముఖ్యంగా, ఖలిస్తాన్‌కు మద్దతునివ్వని ప్రపంచవ్యాప్త సిక్కుల మనోభావాలు దెబ్బతినకుండా జాగ్రత్త పడాలి.

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఈమధ్య పెద్ద దుమారమే లేపారు. ఈ ఏడాది జూన్ 18న కెనడాలోని గురుద్వారా వెలుపల జరిగిన కెనడా సిక్కు హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత ప్రభుత్వ ఏజెంట్ల ప్రమేయం ఉందనేందుకు తమ వద్ద విశ్వసనీయమైన సమాచారం ఉందన్న ట్రూడో ప్రకటన ఇరు దేశాల మధ్య వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. అయితే హర్‌దీప్ సింగ్ నిజ్జర్‌ను భారత ప్రభుత్వం చాలా కాలం క్రితమే ఉగ్రవాదిగా ప్రకటించింది. అతడి తలకు నగదు బహుమతి కూడా ప్రకటించింది. నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉండి ఉంటే అది అసాధారణమైన విషయమే అవుతుంది. కాకపోతే పరిస్థితులను గమనించినప్పుడు నిజ్జర్ హత్య పక్కా గ్యాంగ్ వార్‌ను పోలుతుంది. నిజ్జర్ పూర్వాపరాలను గమనించినా హత్యకు గ్యాంగ్ వారే కారణమని అనిపించడం ఖాయం. సత్యం ఏమైనప్పటికీ ట్రూడో ఆరోపణల పుణ్యమా అని ఇప్పుడు భారత్ పరువుకు కొంత భంగం కలిగింది. అది కూడా జీ–20 సమావేశాలను అధ్యక్ష స్థానంలో ఉంటూ విజయవంతంగా పూర్తి చేసిన వెంటనే ఈ ఘటన చోటు చేసుకోవడం మరింత ఇబ్బందికరమైంది. కామన్ వెల్త్ దేశమైన, భారతీయ సంతతివారు ఎక్కువ సంఖ్యలో ఉన్న, ఇండో–పసిఫిక్ వ్యూహంలో కీలకమైన కెనడాతో భారత్ సంబంధాలిప్పుడు అట్టడుగు స్థాయికి చేరాయి.

అయితే ఈ పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత్ కింది అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది:

చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టాలంటే భారత్ సాయం కచ్చితంగా అవసరమని అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, పశ్చిమ యూరప్, జపాన్ భావిస్తున్నాయి. ఈ భాగస్వామ్యానికి కొన్ని పరిమితులు లేకపోలేదు. అదే సమయంలో నాటో, జీ–7 దేశాల సభ్య దేశాలతో వ్యవహరించే సందర్భంలో వ్యవహారం మారిపోయేందుకు అవకాశాలెక్కువ. అమెరికా జాతీయ భద్రత సలహాదారు జేక్ సుల్లివాన్ చేసిన ప్రకటనతో ఈ విషయం స్పష్టమవుతుంది: ''ఇలాంటి చర్యలకు పాల్పడినప్పుడు ప్రత్యేకమైన మినహాయింపులు ఎవరికీ ఉండవు. దేశం ఏదైనా సరే, మా ప్రాథమిక నైతిక సిద్ధాంతాల రక్షణ కోసం నిలబడతాం. అలాగే దగ్గరి భాగస్వామి అయిన కెనడా లాంటి దేశాలతో సంప్రదింపులు జరిపి చట్టాన్ని పరిరక్షించేందుకు వారు చేసే ప్రయత్నాల్లోనూ, దౌత్యపరమైన ప్రక్రియల్లోనూ సహకరించుకుంటాం'' అన్నారు ఆయన.

తిరస్కరించిన భారత్

కెనడాలో ఓ సిక్కు నేత హత్య వెనుక ప్రభుత్వ ప్రమేయం ఉందన్న విషయాన్ని భారత్ నిర్ద్వంద్వంగా ఖండించింది. అర్థం లేని, దురుద్దేశపూరిత ఆరోపణలుగా కొట్టి పారేసింది. అయితే ఇంతటితో కథ ముగిసిపోయిందని అనుకునేందుకు వీల్లేదు. వట్టి తిరస్కారాలతోనో, ఉగ్రవాదంపై చర్యల విషయంలో ట్రూడో నిర్లక్ష్య వైఖరిని తప్పుపట్టడంతోనో సమస్య సమసిపోదు. కెనడాలోని కొంతమంది సిక్కులు ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొనడం వెనుక చాలా చరిత్రే ఉంది. అయితే ప్రస్తుతం నిజ్జర్ లాంటివాళ్లు చేస్తున్న క్రిమినల్ కార్యకలాపాలపై భారత్ ఎక్కువగా దృష్టి పెట్టాలి. నిజ్జర్ రాజకీయాలు, ఉగ్రవాద, హింసాత్మక కార్యక్రమాల్లో ఆయన ప్రమేయం వంటివి ఎత్తి చూపడం ఆయన హత్యను సమర్థించినట్లు కనిపించవచ్చు. మరీ ముఖ్యంగా మోదీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వర్గాల్లో ఈ రకమైన ఆలోచన బలపడవచ్చు. కానీ నిజ్జర్ కార్యకలాపాలపై ఉన్న సమాచారం మొత్తాన్ని భారతీయ నిఘా సంస్థలు కెనడా, ఇతర పాశ్చాత్య దేశాలతో పంచుకోవడం మేలు.



ట్రూడో ఆరోపణలను గట్టిగా తిరస్కరించడం ద్వారా భారత్ సరైన పనే చేసింది. భారతీయ దౌత్యవేత్తను కెనడా తిప్పి పంపడంతో భారత్ కూడా అదే పని చేయడమూ తగిన ప్రతిచర్యే. కానీ, పరిస్థితులు మరింత దిగజారకుండా ఉండటం ఇరు దేశాలతోపాటు భారత్‌తో మరింత ఎక్కువ సంబంధాలు కోరుకుంటున్న పాశ్చాత్య మిత్రులకూ అత్యవసరం. కెనడాతో మనకున్న సంబంధాలు కాస్తా అమెరికా, ఇతర పాశ్చాత్యదేశాల మైత్రిపై ప్రభావం చూపరాదు. అదే జరిగితే ఈ అంశాన్ని తమ ప్రయోజనాలకు అనుగుణంగా మలుచుకునేందుకు చైనా, పాకిస్తాన్ కాచుకు కూర్చున్నాయన్న విషయం మరవరాదు.

కెనడా రాజకీయాలూ చూడాలి...

ప్రస్తుత దౌత్య సమస్యకు కెనడాలోని స్థానిక రాజకీయ పరిస్థితులూ కారణం కావచ్చు. ట్రూడో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడం కోసం ఉగ్రవాదులను సమర్థిస్తున్నారన్న నెపంపై కెనడాలోని కొంత మంది సిక్కులపై విమర్శలు చేయడం కూడా తగదు. దీనివల్ల కెనడాలోని మెజారిటీ సిక్కులు, ఇతర దేశాల వారు, మరీ ముఖ్యంగా భారతీయ సిక్కులను దూరం పెట్టినట్టుగా ఉండకూడదు. ఖలిస్థాన్ డిమాండ్‌కు వీరందరూ దూరమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఖలిస్తాన్ భయాన్ని ఎత్తిచూపాలన్న ఉబలాటం ఉండొచ్చు, కానీ ఇది ఉద్దేశించని నష్టం కలిగించే ప్రమాదం ఉంది.

భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ట్రూడో విమర్శలకు దిగడం వెనుక ఆయనకున్న వ్యక్తిగత ఆసక్తి ఏమిటన్నది తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. కెనడా రాజకీయాల్లో విదేశాల ప్రమేయంపై ఇప్పటికే విచారణ సాగుతోంది. దేశంలో చైనా కార్యకలాపాలపై చెక్ పెట్టలేకపోయారన్న అంశం ట్రూడోకు ఇబ్బంది కలిగించవచ్చు. కాబట్టి, ఈ అంశం దాన్ని పక్కదోవ పట్టించగలదు. ట్రూడో ప్రభుత్వం మనుగడ కోసం సిక్కు రాజకీయ పార్టీ, ఖలిస్థాన్ ఉద్యమ అనుకూలురు ఎక్కువగా ఉన్న న్యూ డెమోక్రటిక్ పార్టీ (ఎన్‌డీపీ) మద్దతు అవసరం. ఇందుకోసమే ట్రూడో భారత్‌పై ఈ రకమైన విమర్శలకు దిగి ఉన్నా ఆశ్చర్యపోనవసరం లేదు.

సిక్కుల మనోభావాలు దెబ్బతినకుండా...

2018లో భారత పర్యటన సందర్భంగా తనను అంతగా పట్టించుకోలేదని ట్రూడో భావించడం కూడా ప్రస్తుత పరిస్థితికి ఒక కారణం కావచ్చు. 'అన్ని పర్యటనలను అంతం చేసే పర్యటన' అని ట్రూడో అప్పట్లోనే ప్రకటన చేసిన విషయాన్ని గుర్తు చేసుకోవాలి. వ్యక్తిగతమైన భారత వ్యతిరేక భావన ఇప్పుడు ఇలా అనాలోచిత తప్పుడు ఆరోపణలకు దారితీసి ఉండవచ్చు. వ్యక్తిగా ట్రూడోతో ఉన్న సంబంధాలు ఇరు దేశాల మధ్య సంబంధాలను నిర్ణయించే పరిస్థితి ఉండరాదు. రాజకీయంగా, వ్యూహాత్మకంగా, ఆర్థిక అంశాల పరంగానూ ఇరు దేశాల మధ్య సఖ్యత ఎంతో అవసరం.

భారత్ – కెనడా సంబంధాల ప్రభావం అమెరికా, ఇతర జీ–7 దేశాలతో మనకున్న సంబంధాలపై కూడా ఉండవచ్చు. ట్రూడోతో మన గొడవ కాస్తా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సిక్కుల మనోభావాలను దెబ్బతీయకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం కూడా ఉంది. పంజాబ్‌లో ఇప్పటికే ఈ అంశంపై అసంతృప్తి రగులుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ట్రూడో ప్రభుత్వంపై భారత్‌కు ఉన్న అసంతృప్తిని వెళ్లగక్కేందుకు సిక్కు కుటుంబాలు తమ స్వస్థలాలకు రావడాన్ని అడ్డుకోవడం మార్గం కాదు. ఏమైనా, ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత దిగజారకుండా ఉండాలని ఆశిద్దాం.

వ్యాసకర్త విదేశీ వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ధ్యాంక్యూ



హ్యాపీ ట్వంటీ ఫిఫ్త్ బర్త్ డే... గూగుల్! ఎప్పటికప్పుడు కొత్త మార్పులు చేసేలా మాకు సవాలు విసిరే మా ఉత్పత్తుల వినియోగదారులందరికీ, 'గూగులర్స్' అందరికీ ధన్యవాదాలు.
– సుందర్ పిచాయ్, గూగుల్ సీఈఓ

ఇదా మర్యాద?



భారత జెండాను (కెనడాలో) అవమానించినవాళ్లు సిక్కులు కాలేరు. వాళ్ల జెండా అటుండనీ, ఒక నిజమైన సిక్కు మరే జెండా పట్ల కూడా అవమానంగా ప్రవర్తించలేడు, ఆఖరికి అది తన శత్రువు జెండా అయినా!
– ఆర్.ఎస్. రాజేందర్, వ్యాఖ్యాత

కేరళ కోసం



మన గొప్ప కీర్తి ఎప్పుడూ పడిపోకుండా ఉండటంలో లేదు. పడిన ప్రతిసారీ లేవడంలో ఉంది. 2018లో అనూహ్య వరదల వల్ల కేరళ పడింది. కానీ కేరళీయులు ఏమిటో ప్రపంచం చూసింది. నన్ను ఆసియా ఉత్తమ నటుడిగా ఎంపిక చేసినందుకు సెప్టిమస్ అవార్డ్స్‌కు ధన్యవాదాలు. '2018' సినిమాలో నా నటనకు ఇది రావడం ఈ అంతర్జాతీయ గుర్తింపును ప్రత్యేకం చేస్తోంది.
– తొవినో థామస్, మలయాళ నటుడు

రోబో టీ!



గుజరాత్ సైన్స్ సిటీలో భారత ప్రధాని మోదీకి ఒక రోబో ఇవ్వాళ టీ కప్పు అందించింది. రోబోటిక్స్ రంగంలో ఇండియా విశేషమైన ఆసక్తినీ, ప్రగతినీ చూపుతోంది.
– సాద్ హఫీజ్, సౌదీ జర్నలిస్ట్

కఠిన వాస్తవం



ఇండియాకు సంబంధించి 1980ల నుంచి ఉన్న కొన్ని భద్రతా సమస్యలు... ముఖ్యంగా సిక్కు, తమిళ అతివాదులు, తీవ్రవాదుల ప్రమేయం ఉన్నవి... అట్టావా(కెనడా) ఆ రాడికల్స్‌కు ఆశ్రయం ఇవ్వడం వల్ల మరింత తీవ్రమైనాయి. ఇదే సత్యం. అట్టావా దాన్ని ఎదుర్కోవాలి, పరిష్కరించాలి.
– జాన్ పిండ్లర్, మిలిటరీ హిస్టారియన్

పెళ్లి బట్టలు



వధువుల వస్త్రధారణ గురించి చాలా చర్చ జరుగుతోంది. నేనైతే ఎర్ర కుర్తా, ఆకుపచ్చ పైజామా ధరించాను. నిజానికి అదో ఝోలా అనుకోవచ్చు. ఎందుకంటే సంప్రదాయం ప్రకారం కత్తెర వాడకూడదు (కత్తిరిస్తాం కాబట్టి కత్తెర కలహానికి సంకేతం), చేతులే ఉపయోగించాలి.
– రానా సఫ్వీ, రచయిత్రి

ఎక్కువ కనండి!



జనాభా మితిమీరింది అనడం మిథ్య. న్యూయార్క్ నగరంలోలా సాంద్రతతో ప్రతి ఒక్కరూ నివసిస్తే, ప్రపంచ మొత్తం 8 బిలియన్ల జనాభా ఒక్క టెక్సాస్ నగరంలోనే ఇమిడిపోతుంది. భయాన్నీ, పశ్చాత్తాపాన్నీ, కొరతనూ సాధారణ జనాల్లో వ్యాపించడానికే ఈ మితిమీరిన జనాభా వాదాన్ని తెస్తున్నారు. మరింత మంది పిల్లల్ని కనండి.
– షానన్ మైకేలా, ఆక్రోబాటిక్ ఆర్చర్

ఇన్ బాక్స్

సైబర్ మోసాలతో జాగ్రత్త!

ప్రతిరోజూ ఏదో ఒక చోట సైబర్ మోసాలు జరుగుతూనే ఉన్నాయి. సైబర్ క్రైమ్ అంటే కేవలం ఇంటర్నెట్ వేదికగా జరిగే ఆర్థికపరమైన నేరం మాత్రమే కాదు... దేశ భద్రత, వ్యక్తిగత సమాచార దోపిడీ, ఆన్‌లైన్ వేధింపులు వంటివన్నీ ఈ కోవకు చెందినవే. ఇటీవల దుబాయ్, చైనా కేంద్రంగా ఆన్‌లైన్ మోసానికి పాల్పడి రూ. 712 కోట్లు లూటీ చేసిన సైబరాసురులు హైదరాబాద్ పోలీసులకు పట్టుబడ్డారు. 'ఇండియన్ నేషనల్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్' విడుదల చేసిన నివేదికల ప్రకారం 2021లో 1.56 లక్షల కేసులు నమోదవగా, 2022 జూన్ నాటికి ఆ సంఖ్య 2.37 లక్షలకు ఎగబాకింది.

కరోనా కష్టకాలం తర్వాత భారత్ డిజిటల్ లావాదేవీలు దిశగా ముందుకు వెళ్తోంది. దేశంలో ఒక్క 2022–23 ఆర్థిక సంవత్సరంలోనే 9,192 కోట్ల డిజిటల్ లావాదేవీలు జరిగాయి. ఈ అవకాశాన్ని వరంగా మార్చుకున్న ఆర్థిక నేరగాళ్లు యూపీఐ, ఓటీపీ మోసాల దిశగా సొమ్మును కాజేస్తున్నారు. అయితే నియంత్రణ చర్యలు మాత్రం కరవవుతున్నాయి. ఇది సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకుని ఉన్న అంశం కావడంతో పోలీసు వ్యవస్థ సైతం కేసులను ఛేదించలేకపోతోంది.

సైబరాసురులకు చెక్ పెట్టాలంటే.. 'పెట్టుబడి తక్కువ లాభాలు ఎక్కువ', 'లక్షల రూపాయల విలువచేసే వస్తువులు వేలకే లభిస్తాయి' వంటి మాయమాటలను నమ్మకూడదు. అంతర్జాతీయ నంబర్ల నుంచి ఫోన్లు వచ్చినా, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారం, బ్యాంకు సమాచారం వంటివి అడిగినా చెప్పకుండా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. అనుమానాస్పద లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు. వీలున్న ప్రతి చోట రెండు కారకాల ప్రమాణీకరణ (టూ ఫాక్టర్ అథెంటికేషన్)ను క్రియాత్మకం (యాక్టివేట్) చేసుకోవాలి. ముఖ్యంగా ఈ–మెయిల్, బ్యాంకింగ్ వంటి వాటికి ఇది తప్పనిసరిగా ఉండాలి. ఏవైనా లావాదేవీలు చేసే ముందు ఒకటికి రెండు సార్లు నిర్ధారించుకోవాలి. అప్పుడే ఈ అదృశ్య నేర శక్తులను అడ్డుకోగలం.

– తాడేపల్లి విజయ్

అసమానతపై అక్షర యుద్ధం

సందర్భం



పి. విజయబాబు

కవిత్వాన్నే ఆయుధంగా చేసుకుని వర్ణ వ్యవస్థ పైన, సంకుచిత భావాల పైన సవ్యసాచిలా అక్షరాస్త్రాలను సంధించిన కవి వీరుడు, విశ్వనరుడు గుర్రం జాషువా. అవమానాలు ఎదురైన చోటే సన్మానాలు అందుకున్నారు. ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందారు. తెలుగు, సంస్కృత భాషలలో అపార పాండిత్యం సొంతం చేసుకున్న జాషువా ఆదిలో కవిత్రయం బాటలోనే అద్భుత కవిత్వాన్ని వెలయించారు. భావ కవిత్వ రీతులలో లోతులు తెలుసుకున్నారు. కానీ పలుగాకుల వెకిలి మనస్తత్వాన్ని గమనించి, తీవ్రంగా నొచ్చుకొని దాని నుంచి పక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం కోసమే తను కవిత్వాన్ని రాయవలసిన అవసరం గ్రహించారు.

'జీవితం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నాకు గురువులు ఇద్దరు. ఒకటి పేదరికం, రెండు కుల మత వివక్ష. ఒకటి నాకు సహనాన్ని నేర్పితే, రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచిందే కానీ, బానిసగా మాత్రం మార్చలేదు' అని నవ్వుతూ చెప్పేవారు. జాషువాలోని గొప్పతనం ఏమిటంటే తను ఎన్ని అవమానాలకు గురియైనా ఏనాడు దురాగ్రహం ప్రదర్శించలేదు. అక్షరాస్త్రాలతో ధర్మాగ్రహాన్ని ప్రదర్శించి తనకు సాటి వేరెవరూ లేరని నిరూపించుకున్నారు.

సమకాలీన కవిత్వ ఒరవడికి భిన్నంగా సంచలన కవిత్వాన్ని సృష్టించారు.

'ఆలయంబున నీవు వ్రేలాడు వేళ/ శివుని చెవి నీకు కొంత చేరువుగ నుండు/మౌని ఖగరాజ్ఞి పూజారి లేని వేళ/విన్న పింపుము నాదు జీవిత చరిత్ర' అంటూ గబ్బిలంలో తనబోటివారి అవస్థలనే గాక, సమాజ స్థితిగతులనూ సూటిగా చెప్పారు. కాళిదాసు భావనామయ ప్రపంచంలో మేఘుడి కంటే 'గబ్బిలం' కర్తవ్యం ఎంత గొప్పదో చెప్పకనే చెప్పారు. గబ్బిలం జాషువా కవితాశక్తికీ, ఆయన నిలువెత్తు సామాజిక స్పృహకూ అపూర్వ నిదర్శనం.



చిన్నతనం నుంచి జాషువాలో బొమ్మలు గీయటం, పాటలు పాడటంపై ఆసక్తి ఉండేది. ఆయన 36 గ్రంథాలూ, ఎన్నో కవితా ఖండికలనూ రాశారు. 1928 నుండి 1942 వరకు గుంటూరులోనే ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పని చేశారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ప్రచారకుడిగా కూడా పని చేశారు. 1957– 59 మధ్య కాలంలో మద్రాసు రేడియో కేంద్రంలో కార్యక్రమ నిర్మాతగా పని చేశారు. ఆయన ప్రతిభకు ఎన్నో సత్కారాలూ, బిరుదులూ లభించాయి. తిరుపతి వేంకటకవుల్లో ఒకరైన చెళ్లపిళ్ల వేంకటకవి ఆయన కాలికి గండపెండేరం తొడిగారు. విజయవాడలో ఏనుగు అంబారీపై ఎక్కించి ఊరేగించారు. 'కవితా విశారద', 'కవి కోకిల', 'కవి దిగ్గజ – నవయుగ కవిచక్రవర్తి', 'మధుర శ్రీనాథ', 'విశ్వకవి సమ్రాట్' వంటి బిరుదులు వరించాయి. పద్మ భూషణ్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, ఆంధ్ర విశ్వవిద్యాలయం వారి 'కళా ప్రపూర్ణ' వంటి పురస్కారాలను అందుకున్నారు.

1962 చైనా భారత దేశంపై దాడి చేసిన సమయంలో 'ముసాఫరులు' అన్న కావ్యంలో మాతృ దేశ రక్షణ కోసం చైనాతో పోరాడి అమరుడైన జీవుడు ఊర్ధ్వముఖంగా సూర్యమండలం మీదకి వెడుతూ మార్గమధ్యంలో చంద్రమండలంపై ఆగి సేద తీర్చుకుంటున్నాడంటూ... దేశ భక్తులకు ముక్తి లభిస్తుందంటూ దేశభక్తిని ప్రబోధించారు. జాషువా రచనలపై మరిన్ని పరిశోధనలు జరగాల్సి వుంది. 1971 జూలై 24న గుంటూరులో జాషువా తనువు చాలించారు.

రాజు మరణించె నొకతార రాలిపోయె
కవియు మరణించె నొకతార గగనమెక్కె
రాజు జీవించె రాతి విగ్రహములందు
సుకవి జీవించె ప్రజల నాలుకల యందు అన్న జాషువా కవితాక్షరాలకు ఆయనే నిదర్శనం.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు
(నేడు మహాకవి గుర్రం జాషువా జయంతి)

జనన మరణాలు

అభిమన్యుని అకాల మరణాన్ని గురించి పరితపిస్తున్న ధర్మరాజు దగ్గరికి ఒక రోజు వ్యాసమహాముని వచ్చి, ఉపశమనంగా మృత్యువుని గురించి వివరిస్తాడు.

మొదట్లో జీవులకు మృత్యువనేది లేదు. దాంతో బ్రహ్మదేవునిచే సృష్టించబడిన ప్రతిదీ అలాగే ఉండిపోవడంతో భూమిపై భారం పెరిగింది. భూమాత బ్రహ్మదేవునికి తన సమస్య విన్నవించింది.. పుట్టినవానిని చంపడ మొక్కటే భూ భారం తగ్గించడానికి మార్గంగా భావిస్తాడు బ్రహ్మ. ఆయన శరీరం నుండి ఒక స్త్రీ ఉద్భవిస్తుంది. ఆమె మృత్యువు. జీవులను మృత్యువు పాల్జేయడం ఆమె పనిగా బ్రహ్మదేవుడు నిర్దేశిస్తాడు. 'ఇదేమి పని నాకు స్వామీ?' అని ఆమె కన్నీరు కార్చగా, ఆ కన్నీటి బిందువులను బ్రహ్మ తన దోసిలిలోకే సేకరించుకుని, ఆమెను సమాధానపరిచే విధంగా, 'అలా చేయడంలో నీవు నా ఆజ్ఞనే నిర్వర్తిస్తున్నందు వలన, అందులో అధర్మము, పాపము అనేవి వుండవు. నీ కన్నీటి చుక్కలన్నీ రోగాలై జననాశనం చేస్తాయి' అని చెప్పడంతో ఆమె అంగీకరించింది. 'అయితే క్రోధ లోభాలు, అసూయలతో దేహాలనూ, అంతరంగాలనూ వికారం చేసి, కలుషితం చేసి అధర్మాన్ని పుట్టించండి. అవే వారి వినాశనానికి కారణం అవుతాయి' అని విన్నవించుకుంటుంది. బ్రహ్మ అంగీకరిస్తాడు. అలా మృత్యువు ప్రాణాలను హరించడం మొదలుపెట్టగా, ప్రాణం శరీరాన్ని విడిచి దైవత్వాన్ని పొందడం, తిరిగి మానవత్వాన్ని చేరుకోవడం ప్రారంభమైంది – అని చెబుతాడు వ్యాసుడు.



జ్యోతిర్మయం

తిక్కన ఆంధ్రమహాభారతం, ద్రోణపర్వంలో, 'అకంపనోపాఖ్యానం' పేరుతో ఉన్న కథకు అత్యంత సంక్షిప్త రూపం ఇది. ఈ కథ చెప్పి 'మృత్యువుతో మనుషులు అమరత్వాన్ని పొందుతారు, మళ్ళీ వారే మనుషులుగా జన్మిస్తారు. అందువలన, నీ కుమారుడు అభిమన్యుడు చనిపోయాడని విలపించడం దేనికి? అతని వీరత్వానికి సరిపోయిన సద్గతి సమకూరి ఉంది కదా!' అని అనునయిస్తాడు ధర్మరాజును వ్యాసులవారు. అనంతకోటి జీవరాశిలోని ఏ ఒక్క జీవి అనంత జీవన ప్రయాణంలో ఏ దశలోనూ మరణం కూడా దాని కదే ఒక ముగింపు కాదనీ, మరణాన్ని వగపుకు కారణంగా విధాత తలచలేదనీ, కనుక మరణానికి అతిగా విలపించడం వివేకవంతమైన పని కాదనీ చెప్పడం ఈ ఉపాఖ్యానం ముఖ్యోద్దేశంగా గ్రహించాలి.

– వెంకట్ భట్టు

సింగరేణిలో పోరు సైరన్



- అక్టోబర్ 28న పోలింగ్.. అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు
- గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల షెడ్యూల్ జారీ
- ఎన్నికల వాయిదాకు యాజమాన్యం విఫలయత్నం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రికొత్తగూడెం/కరీంనగర్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల షెడ్యూల్ ఖరారైంది. సింగరేణి కార్మిక సంఘాలు, యాజమాన్యం ప్రతినిధులతో కేంద్ర కార్మిక శాఖ సమావేశమైంది. తీవ్ర ఉత్కంఠల నడుమ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న డిప్యూటీ చీఫ్ లేబర్‌కమిషనర్ (సెంట్రల్) శ్రీనివాసులు షెడ్యూల్ ప్రకటించారు.

ఎన్నికల నిర్వహణ ఇలా: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు అక్టోబర్ 28న నిర్వహిస్తారు. పోలింగ్ ముగిసిన తర్వాత రాత్రి 7 గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ చేపట్టి విజేతలను ప్రకటిస్తారు. కాగా పోలింగ్ తేదీనాటికి సంస్థలో ఉద్యోగులు/కార్మికులుగా ఉన్నవారు ఈ ఓటింగ్‌లో పాల్గొనే హక్కు కలిగి ఉంటారు. ఓట్ల జాబితా ముసాయిదా ఈనెల 30న ప్రకటిస్తారు. అభ్యంతరాల స్వీకరణ, మార్పులుచేర్పుల తర్వాత తుది జాబితా అక్టోబర్ 5న విడుదల చేస్తారు. 6, 7 తేదీల్లో సాయంత్రం ఐదు గంటల వరకు హైదరాబాద్‌లోని డిప్యూటీ లేబర్ కమిషనర్ ఆఫీస్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. 9వ తేదీ సాయంత్రం ఐదు గంటలవరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. 10న గుర్తులు కేటాయిస్తారు. అనంతరం కార్మిక సంఘాల ప్రచారం, 28న సింగరేణి సంస్థ విస్తరించిన 11 ఏరియాలు, కార్పొరేట్‌లో పోలింగ్ జరుగుతుంది. సింగరేణిలో ప్రస్తుతం 42,390 మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు.

వాయిదాకు ససేమిరా:
హైకోర్టు తీర్పు అనుసరించి గుర్తింపు సంఘం ఎన్నికలపై బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో హైడ్రామా చోటు చేసుకుంది. మొత్తం 16 కార్మిక సంఘాలతో యాజమాన్యం చర్చలు జరిపింది. ఏఐటీయూసీ, బీఎంఎస్ కోర్టు తీర్పు ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని తమ అభిప్రాయం తెలిపాయి. టీబీజీకేఎస్‌తో పాటు మరికొన్ని సంఘాలు ఎన్నికలు వాయిదా వేయాలన్నాయి. కొందరు కార్మిక సంఘాల ప్రతినిధులు తటస్థంగా ఉన్నారు. దీంతో కార్మిక సంఘాల మధ్య ఏకాభిప్రాయం తీసుకొని ఎన్నికలు వాయిదా వేసేందుకు యాజమాన్యం తరఫున హాజరైన ప్రతినిధులు చర్చలు ప్రారంభించారు. వాయిదాపై ఏకాభిప్రాయం వస్తే కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేద్దామంటూ మంతనాలు సాగించారు. అయితే సమావేశం చివరివరకు కూడా ఎన్నికల వాయిదాకు ఏఐటీయూసీ, బీఎంఎస్‌లు అంగీకరించలేదు. ఎన్నికలు నిర్వహించాల్సిందేనని పట్టుబట్టాయి. దీంతో కోర్టు తీర్పు ప్రకారం ఎన్నికల షెడ్యూల్ జారీ చేయక తప్పని పరిస్థితి నెలకొంది.

ఎన్నికల నిర్వహణ సాధ్యమేనా?
త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లలో ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికార యంత్రాంగం పూర్తిగా తలమునకలై ఉంది. సింగరేణి ఎన్నికల నిర్వహణ కష్టమే అంటూ ఇదివరకే ఆ జిల్లాల పరిధిలోని అధికారులు చేతులెత్తేశారు. మెజారిటీ సంఘాలు కూడా ఎన్నికల వాయిదాకే పట్టుబట్టాయి. ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో మరో కేసు పెండింగ్‌లో ఉంది. రెండు దశాబ్దాల తర్వాత ప్రతిష్టాత్మక జాతీయస్థాయి రెస్క్యూ పోటీలు నిర్వహించే అవకాశం సింగరేణికి లభించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న 20కిపైగా బొగ్గుగనుల బృందాలు రానున్నాయి. ఇదే కాకుండా అతి కీలకమైన 54వ రక్షణ వారోత్సవాలకు సంస్థ సన్నద్ధమవుతోంది.

2017లో జరిగిన ఎన్నికల్లో వివిధ కార్మిక సంఘాలకు వచ్చిన ఓట్ల వివరాలు ఇలా..

కార్మిక సంఘం	పొందిన ఓట్లు	గెలుచుకున్న ఏరియాలు
టీబీజీకేఎస్	23,311	భూపాలపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, కొత్తగూడెం, రామగుండం–3
ఏఐటీయూసీ	16,724	ఇల్లెందు, బెల్లంపల్లి
ఐఎన్‌టీయూసీ	12,077	మణుగూరు, కొత్తగూడెం (కార్పొరేట్)
హెచ్ఎంఎస్	5,683	రామగుండం 1, 2
ఇతరులు	2,152	

ఊడిపోయిన యాదాద్రి గోపుర కలశం

- ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన
- శిల్పులతో తిరిగి బిగించిన అధికారులు



దక్షిణ రాజగోపురంపై కలశాన్ని బిగిస్తున్న సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయ ఉద్ఘాటన సమయంలో దక్షిణ రాజగోపురంపై ప్రతిష్ఠించిన బంగారు కలశాల్లో ఒకటి ఊడిపోయి కింద పడిపోయింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనపై స్థానిక భక్తులు, పలువురు అధికారులు తెలిపిన వివరాలివి. యాదాద్రి ఆలయ దక్షిణ రాజగోపురంపై బిగించిన బంగారు కలశాల్లో ఒకటి మంగళవారం సాయంత్రం సమయంలో కింద పడిపోయింది. దీంతో అప్రమత్తమైన ఆలయాధికారులు ఈ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. దక్షిణ రాజగోపురంపై బుధవారం ఉదయం సంప్రోక్షణ పూజలు నిర్వహించిన అనంతరం శిల్పులు తిరిగి బిగించారు. దీనిపై ఆలయ డీఈవో దోర్బల భాస్కర్‌శర్మను ప్రస్తావించగా.. గోపురంపై కలశాలు బిగించే టప్పుడు కింద పడకుండా చెక్కలను ఏర్పాటు చేశారని తెలిపారు. అవి వదులై పోవడంతో పాటు కోతులు వాటిపైకి ఎక్కి ఆడటంతో ఊడిపోయాయని పేర్కొన్నారు. వెంటనే గోపురం వద్ద పూజలు జరిపించి, శిల్పులతో బిగించామని వెల్లడించారు.

రోడ్డు సౌకర్యం లేక బాలింత ఇక్కట్లు

- మధ్యలోనే దించి వెళ్లిన ‘అమ్మ ఒడి’
- రోడ్డు వేయాలని కోరుకుంటున్న గ్రామస్తులు



రోడ్డుపై బాలింత

బూర్గంపాడు (భద్రాద్రి కొత్తగూడెం): బురదమయంగా ఉన్న ఆ గ్రామ రహదారిపై వాహనం వెళ్లే పరిస్థితి లేక మూడు రోజుల బాలింతను రోడ్డుపైనే దింపి 102 వాహనం వెళ్లిపోయిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో చోటుచేసుకుంది. సారపాక సమీపంలోని శ్రీరాంపురం ఎస్టీ కాలనీకి చెందిన పార్వతి మూడు రోజుల క్రితం భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో పాపకు జన్మనిచ్చింది. బుధవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసి అమ్మ ఒడి వాహనంలో ఇంటికి పంపించారు. అయితే ఆ వాహనం గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సరిగా లేకపోవడంతో డ్రైవర్ శ్రీరాంపురం రహదారిపై దించేశాడు. దీంతో పార్వతి చంటిబిడ్డతో రెండు కిలోమీటర్ల దూరం నడిచి ఇంటికి చేరుకుంది. గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఓ మహిళ పాము కాటుకు గురి కాగా, వాహన సౌకర్యం లేక మోసుకుంటూ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మరణించింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

సింగరేణి ప్రైవేటీకరణకు సీఎం కేసీఆర్ అడ్డుకట్ట: ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థను ప్రైవేటు పరం చేయాలనే కేంద్రం కుటిల యత్నాలను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అడ్డుకుని కార్మికుల పక్షపాతిగా నిలిచారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన సింగరేణి కార్మికులకు ప్రయోజనాల కోసం సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. దేశంలో కార్మికులకు అత్యధిక బోనస్‌ను ప్రకటించిన ఏకైక రాష్ట్రం తెలంగాణయే అన్నారు. సింగరేణి సంస్థ లాభాల్లో 32% వాటాను కార్మికులకు పంచాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో బుధవారం తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కవితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీలో టీబీజీకేఎస్ సాధారణ కార్యదర్శి మిరియాల రాజిరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు కెంగర్ల మల్లయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

టైఫాయిడ్‌లోనూ వైద్య సేవలందిస్తూ..

- మణుగూరు వందపడకల ఆస్పత్రిలో వైద్యురాలు కృష్ణశ్రీ



సెలైన్‌తో పేషంట్ల రిపోర్టు పరిశీలిస్తున్న డాక్టర్ కృష్ణశ్రీ

మణుగూరు టౌన్(భద్రాద్రి కొత్తగూడెం): టైఫాయిడ్ జ్వరంతో బాధ పడుతూ చేతికి సెలైన్‌తోనే విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచారు వైద్యురాలు కృష్ణశ్రీ. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు 100 పడకల ప్రభుత్వాస్పత్రిలో వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్న కృష్ణశ్రీ కొద్దిరోజులుగా టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నారు. మంగళవారం అయితే చేతికి సెలైన్ కూడా పెట్టుకున్నారు. అంత అనారోగ్యంలో కూడా మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకూ 24 గంటలపాటు నిర్విరామంగా విధులు నిర్వర్తించారు. ఇన్ పేషంట్ల ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తూ వారి రికార్డులను పరిశీలించారు. కృష్ణశ్రీ గతంలో వరదల సమయంలో కూడా పేషంట్లకు విశేషమైన సేవలందించి ఆదర్శంగా నిలుస్తున్నారు.

వరి ఆల్ టైం రికార్డ్

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. వానాకాలం పంటల పరిస్థితి, రబీ సాగుకు సన్నద్ధం, రుణమాఫీ అమలు, ఆయిల్ పామ్ సాగుపై సచివాలయంలో బుధవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడారు. 12 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు... 1.93 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరిగిందన్నారు. యాసంగి సాగుకు రైతులను సన్నద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత ఏడాది యాసంగిలో 74 లక్షల ఎకరాల్లో సాగు జరిగిందని, ఈసారి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

యాసంగికి అడిగినంత యూరియా
ఈ యాసంగికి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. సుమారు 75 నుండి 80 లక్షల ఎకరాల్లో రబీ పంటలు సాగవుతాయని అంచనా వేశామని చెప్పారు. యాసంగి పంటల సాగుకోసం అన్ని రకాల ఎరువులు కలిపి 18.64 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించామని వివరించారు. యాసంగి సాగు కోసం 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని కేంద్రానికి నివేదిక ఇచ్చామని, 9.2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వం కోరిన మేరకు 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్రానికి లేఖ రాశామని మంత్రి వెల్లడించారు.

రుణమాఫీపై సందేహాల నివృత్తికి 040– 23243667
ఇప్పటి వరకు 21,34,949 రైతులకు చెందిన రూ.11,812.14 కోట్లు రుణమాఫీ జరిగిందని నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇంకా రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ పూర్తి చేస్తామని తెలిపారు. రుణమాఫీపై సందేహాల నివృత్తి కోసం రాష్ట్రస్థాయిలో 040–23243667 నంబరులో సంప్రదించాలని సూచించారు. ఇప్పటి వరకు పెండింగులో ఉన్న రైతుబీమా క్లెయిములన్నీ వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ప్రత్యేక కమిషనర్ హన్మంతు కొండిబ, అదనపు సంచాలకులు విజయ్ కుమార్, అగ్రోస్ ఎండీ రాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఎన్టీపీసీ ‘కొత్త’ వెలుగులు

▶ మొదటి పేజీ తరువాయి

సింక్రనైజేషన్ కూడా పూర్తిచేశారు. త్వరలో ట్రయల్ రన్ నిర్వహించి, వాణిజ్యపరంగా ఉత్పత్తి చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మొదటి, రెండో యూనిట్లలో ఉత్పత్తయ్యే 1,600 మెగావాట్లలో తెలంగాణ రాష్ట్రానికే 85శాతం విద్యుత్‌ను సరఫరా చేస్తారు.

స్టేజీ–2లో మరో మూడు యూనిట్లు
ఈ ప్లాంట్‌లో స్టేజీ–2 కింద 800 మెగావాట్ల చొప్పున మరో మూడు యూనిట్లను నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం పూర్తయిన రెండు యూనిట్లతో 1,600 మెగావాట్లు, స్టేజీ–2లో 2,400 మెగావాట్లు కలిపి మొత్తం 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. అల్ట్రా సూపర్ క్రిటికల్ సాంకేతికతతో నిర్మిస్తున్న ఈ విద్యుత్ ప్లాంట్‌కు సింగరేణి నుంచి బొగ్గును, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. సరికొత్త సాంకేతికత కావడంతో బొగ్గు వినియోగం తక్కువగా ఉంటుందని, కాలుష్యం కూడా తక్కువగా వెలువడుతుందని అధికారులు చెప్తున్నారు.

మావోయిస్టులారా...మా గ్రామాల్లోకి రావొద్దు!

చర్ల మండలంలో ఆదివాసీల ర్యాలీ



తహసీల్దార్ రంగు రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీలు

చర్ల: ‘మావోయిస్టులారా..మా ఊర్లలోకి రాకండి..అభివృద్ధికి అడ్డుపడకండి’...అంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో ఆదివాసీలు వేడుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం వివిధ గ్రామాల నుంచి చర్లకు చేరుకుని ర్యాలీ నిర్వహించారు. ‘తీవ్రవాదం వద్దు – అభివృద్ధే ముద్దు’, ‘మావోయిస్టుల జనతన సర్కార్ మాకొద్దు..తెలంగాణ సర్కారే ముద్దు’, ‘బుల్లెట్ సంస్కృతి వద్దు – బ్యాలెట్ సంస్కృతి ముద్దు’ అంటూ రాసిన ఫ్లెక్సీలు, ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీలు మాట్లాడుతూ...మావోయిస్టుల వల్ల తమ గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, వారి తీరుతో అన్ని విధాలుగా నష్టపోతున్న తమను తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రంగు రమేశ్‌కు ఆదివాసీలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం చర్ల మండలంలోని పలు గ్రామాల ఆదివాసీలు పాల్గొన్నారు.

ఎన్నికలే లక్ష్యంగా మావోయిస్టుల కుట్ర

- తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో సమావేశం
- పోలీసులను చూసి తప్పించుకున్న వైనం
- ములుగు ఎస్పీ గౌస్ ఆలం వెల్లడి



సమావేశ ప్రాంతంలో లభించిన సామగ్రి

ములుగు/వాజేడు: రానున్న ఎన్నికలే లక్ష్యంగా మావోయిస్టులు చేస్తున్న కుట్రను గ్రే హౌండ్స్, స్పెషల్ పార్టీ పోలీసులు తిప్పికొట్టారని బుధవారం ములుగు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఓఎస్డీ అశోక్‌కుమార్ తెలిపారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు కర్రె గుట్టల్లో 30 నుంచి 40 మంది సాయుధ మావోయిస్టులు పెద్ద నాయకులతో కలసి ఉన్నట్లు సమాచారం వచ్చిందని చెప్పారు. సాంబయ్య అలియాస్ గోపన్న, కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్, ఎగోలపు మల్లయ్య, భద్రు అలియాస్ పాపన్న, ముచ్చకి ఉంగల్ అలియాస్ రఘు, మడకం మంగ అలియాస్ మాసా ఇతర దళ సభ్యులు కర్రె గుట్ట ప్రాంతంలో ఉన్నారని.. తెలంగాణలో భారీ విధ్వంసానికి పాల్పడేందుకు పథకం వేస్తున్నారని సమాచారం రాగా బుధవారం కూంబింగ్ ఆపరేషన్ చేపట్టినట్లు చెప్పారు. ఆ సమయంలో మావోయిస్టులు పోలీసు పార్టీలను చూసి తమ వస్తువులను అక్కడే వదిలి దట్టమైన అటవీ ప్రాంతంలోకి వెళ్లి తప్పించుకున్నట్లు పేర్కొన్నారు. వారిని వెంబడించినప్పటికీ దొరకలేదని, అనంతరం ఆ ప్రాంతాన్ని పరిశీలించగా కిట్ బ్యాగుల్లో ఆలివ్‌రంగు డ్రెస్‌లు, ఇతర వస్తువులు, సుతిలి బాంబు, రేడియోలు, సోలార్ ప్లేట్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, పాత్రలు, కిరాణా వస్తువులు, దోమ తెరలు, మావోయిస్టు సాహిత్యం, మందులు, నీటి డబ్బాలు, సీసాలు, గొడుగులు, కూరగాయలు, తాళ్లు దొరికాయని తెలిపారు. కర్రె గుట్ట ప్రాంతంలో ఇంకా సోదాలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

కవిత పోరాటంతోనే మహిళా బిల్లుకు ఆమోదం

- బీఆర్ఎస్ ఎన్నారైల బృందం అభినందన

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ కవిత పోరాటం వల్లే సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందిందని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐల ప్రతినిధి బృందం అభినందించింది. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం సమన్వయకర్త మహేశ్ బిగాలా ఆధ్వర్యంలో బుధవారం వివిధ దేశాలకు చెందిన ప్రవాస తెలంగాణవాసులు కవితతో బుధవారం భేటీ అయ్యారు. అమెరికా నుంచి మహేశ్ తన్నీరు, చందు తల్లా, హరీశ్‌రెడ్డి, సురేశ్ ఎమ్మెల్సీ కవితను అభినందించడంతో పాటు వివిధ అంశాలపై చర్చించారు.

క్లుప్తంగా...

శుక్రయాన్‌కు పేలోడ్లు సిద్ధం



న్యూఢిల్లీ: చంద్రయాన్ ప్రయోగం విజయవంతం అయింది. ఆదిత్య యానం కొనసాగుతోంది. ఇక శుక్ర గ్రహంపై జెండా పాతేందుకు భారత్ సిద్ధమవుతోంది. శుక్ర యాత్రకు ఏర్పాట్లన్నీ శరవేగంగా పూర్తవుతున్నట్టు ఇస్రో చీఫ్ ఎస్.సోమనాథ్ తెలిపారు. దానికి సంబంధించిన పేలోడ్లు ఇప్పటికే సిద్ధమైనట్టు ఆయన బుధవారం వివరించారు. శుక్రుని అధ్యయనం భూగోళం భవితవ్యానికి సంబంధించి కీలక సమాచారం అందజేస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. ఈ ప్రయోగానికి ఇంకా ఒకట్రెండేళ్లు పట్టవచ్చు. అమెరికా, యూరోపియన్ యూనియన్ ఇప్పటికే శుక్రయానాలకు తెర తీశాయి.

కబేళాలకు ఇస్కాన్ గోవులు

బీజేపీ నేత మేనకా గాంధీ ఆరోపణలు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం గోశాలల్లోని ఆవులు కబేళాలకు తరలిపోతున్నాయని బీజేపీ ఎంపీ మేనకా గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. 'గోశాలలకు భూమి తదితర రూపాల్లో ప్రభుత్వాల నుంచి ఇస్కాన్ ఎంతో లబ్ధి పొందుతోంది. చివరికి గోవులను కోతకు అమ్ముకుంటోంది' అన్నారు. ఈ మేరకు ఆమె చెబుతున్న వీడియో వైరల్‌గా మారింది. అయితే ఈ ఆరోపణలను ఇస్కాన్ తీవ్రంగా ఖండించింది. ''భారత్‌లో ఇస్కాన్ 60కి పైగా గోశాలలు నడుపుతోంది. వదిలేసిన, గాయపడ్డ, కబేళాలకు తరలిస్తున్న వేలాది గోవులు, ఎద్దులను కాపాడుతోంది'' అని వివరించింది.

ఇమేజింగ్ శాటిలైట్ విజయవంతం

దుబాయ్: ఇరాన్ మొట్టమొదటిసారిగా ఛాయా చిత్రాలను తీసే ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించినట్టుగా బుధవారం ప్రకటించింది. నూర్-3 అనే ఉపగ్రహాన్ని భూ ఉపరితలం నుంచి 450 కి.మీ. ఎత్తులో అంతరిక్షంలోకి పంపినట్టుగా ఇరాన్ సమాచార శాఖ మంత్రి ఇసా జరేపూర్ వెల్లడించినట్టు ఆ దేశ అధికారిక మీడియా ఐఆర్‌ఎన్‌ఏ వెల్లడించింది. అయితే ఆ ఉపగ్రహాన్ని ఎప్పుడు ప్రయోగించిందో ఇరాన్ వెల్లడించలేదు.

బిధూరీకి ఎన్నికల బాధ్యతలు

జైపూర్: ఇటీవల పార్లమెంటులో ముస్లిం ఎంపీ దానిష్ అలీపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన తమ ఎంపీ రమేశ్ బిధూరీకి రాజస్తాన్‌లోని టోంక్ నియోజకవర్గ బాధ్యతలను బీజేపీ అప్పగించింది. అక్కడి నుంచి కాంగ్రెస్ అసమ్మతి నేత సచిన్ పైలట్ పోటీ చేస్తారని సమాచారం.

కనిపించని 8వ ఖండం దొరికిందోచ్!

ఖండాలు ఎన్నీ అంటే ఠక్కున చెప్పే సమాధానం? ఏడు అని. కదా. ఇకనుంచి దాన్ని మార్చి, ఎనిమిది అని చెప్పుకోవాలి! కనిపించని ఆ ఎనిమిదో 'జల ఖండమే'... జిలాండియా.! భూమిపై ఇప్పటిదాకా మన కంటికి కనిపించకుండా దాక్కున్న ఎనిమిదో ఖండాన్ని సైంటిస్టులు తాజాగా కనుగొన్నారు. దీన్ని జిలాండియా, లేదా టిరియూ అమవొయ్ అని పిలుస్తున్నారు. అంటే మావోరీ భాషలో మవొయ్‌కు చెందిన కొండలు, లోయలు, మైదానాలు అని అర్థం! భూ భౌతిక శాస్త్రవేత్తలు, భూకంప నిపుణులతో కూడిన బృందం ఈ విషయమై లోతుగా పరిశోధించింది. అధ్యయన ఫలితాలను ఫిజిక్స్ ఓఆర్‌జీలో ప్రచురించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఖండమని ఇలా నిర్ధారణ...

- అపారమైన విస్తీర్ణం. జిలాండియా వైశాల్యం దాదాపు 49 లక్షల చదరపు కిలోమీటర్లు.
- ఇది ఆస్ట్రేలియా దేశం కంటే విస్తీర్ణంలో చాలా చిన్నది. ఇందులో చాలా వరకు నీటి మునిగింది.
- దాని సమీపంలో సముద్రంలో నుంచి సేకరించిన శిలలను లోతుగా పరిశీలించారు.
- అంతేగాక భూ ఉపరితలం (క్రస్ట్) మందం, సాంద్రత వంటి పలు అంశాలను లోతుగా పరిశీలించిన మీదట దేనికి ఒక ఖండానికి ఉండాల్సిన లక్షణాలన్నీ ఉన్నట్టు సైంటిస్టులు నిర్ధారణకు వచ్చారు.



అన్నీ రికార్డులే...

ఈ కొత్త ఖండం అన్ని రికార్డులూ బద్దలు కొట్టడం మరో విశేషం...

- ప్రపంచంలో అతి చిన్న ఖండం ఇదే.
- అతి సన్ననిదీ, కొత్తగా రూపుదాల్చింది కూడా ఇదే.
- ఇది 94 శాతం మేర మునిగి, దాదాపు న్యూజిలాండ్ మాదిరిగా కొన్ని ద్వీపాల సమూహంగా ఉంది.
- ఇది తొలుత 55 కోట్ల ఏళ్ల కింద ఏర్పడ్డ పాంజియాగా పేర్కొనే అఖండ భూరాశిలో భాగంగానే ఉండేదట. తర్వాత విడిపోయింది.

ఎక్కడుంది?

- దక్షిణ పసిఫిక్ మహా సముద్రంలో. న్యూ కాలెడోనియాతో పాటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలోని పలు భూభాగాలు దీని పరిధిలోకి వస్తాయి. మిగతాదంతా అపర పసిఫిక్ జల రాశే!. పరిమాణంలో ఇది ఆస్ట్రేలియా కంటే చిన్నది.
- దీని వయసు భూ భౌతిక శాస్త్రవేత్తలు తొలుత భావించిన దానికంటే కనీసం రెట్టింపు, అంటే దాదాపు 100 కోట్ల ఏళ్లని తాజాగా నిర్ధారించారు.
- సుమారు 2.3 కోట్ల ఏళ్ల కింద ఈ ఖండం పసిఫిక్ లో దాదాపుగా, అంటే 94 శాతం పూర్తిగా నీట మునిగిందట.
- ఇలాంటి ఒక ఖండం ఉందని బ్రూస్ లుయెండిక్ 1995లో మొదట ప్రతిపాదించాడు. దానికి జిలాండియా అని ఆయనే పేరు పెట్టాడు.



ఫ్లాష్ లూటీ...

ఫ్లాష్ మాబ్ ముసుగులో చోరీలు • అమెరికాలో పలు స్టోర్లలో ఘటన

ఫిలడెల్ఫియా: నిత్యం నిఘా నీడన ఉండే అమెరికాలో దొంగల ముఠా పేట్రేగిపోయింది. చూడ్డానికి.. షాపింగ్‌మాల్స్‌లో ఫ్లాష్‌మాబ్ పేరిట డ్యాన్స్‌లు, అవగాహన కార్యక్రమాలు చేసే బృందంలా కనిపిస్తూ ఒక్కసారిగా దుకాణాలపై తెగబడి అందిన కాడికి దోచేశారు. అమెరికాలోని ఫిలడెల్ఫియా నగరం ఈ చోరీల ఘటనకు వేదికైంది. ఒక్కటి కాదు చాలా స్టోర్స్‌లో టీనేజర్లు ఇలా ఒకే తరహాలో దొంగతనాలకు పాల్పడ్డారు. మంగళవారం రోజు జరిగిన ఈ చోరీల తాలూకు వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అత్యంత ఖరీదైన ఐఫోన్లుసహా యాపిల్ కంపెనీకి చెందిన పలు ఎలక్ట్రానిక్ ఉపకరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. మాస్కులు, హూడీలు ధరించిన దాదాపు 100కుపైగా టీనేజర్లు యాపిల్ స్టోర్, ఫుట్‌లాకర్, లూలూలెమెన్ స్టోర్లలో చొరబడి బ్యాగుల నిండా వస్తువులను తీసుకెళ్లారు. విషయం తెల్సుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించి 20 మందికిపైగా టీనేజర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కొన్ని ఆయుధాలనూ స్వాధీనం చేసుకున్నారు. అయితే, వస్తువును దొంగిలించినా వాడుకోలేని(యాంటీ-థెఫ్ట్) ఫీచర్ ఉన్న కొన్ని యాపిల్ సంస్థ వస్తువులను దొంగలు అక్కడే వదిలేసివెళ్లారని ఫాక్స్ న్యూస్ వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది. గత నెలలో డ్రైవర్ ఎడ్డీ ఐరీజెర్రీని ఫిలడెల్ఫియా పోలీస్ అధికారి కాల్చిచంపిన కేసులో రిటెన్‌హౌజ్ స్క్వేర్ వద్ద శాంతియుత ర్యాలీ జరిగిన కొద్దిసేపటికే అక్కడా ఇలా రిటైల్‌స్టోర్‌పై దాడి జరిగింది. అయితే ఆ నిరసనకారులతో ఈ ఘటనకు ఎలాంటి సంబంధం లేదని ఫిలడెల్ఫియా పోలీసులు స్పష్టంచేశారు.

నిజ్జర్ హత్య వెనుక ఐఎస్ఐ!

నిఘా వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ: కెనడాలో ఖలిస్తానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ హస్తం ఉందని తెలుస్తోంది. కెనడా, భారత్ మధ్య సంబంధాలను దెబ్బ తీయడానికే ఐఎస్ఐ ఈ ఘాతుకానికి ఒడిగట్టిందని నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నిజ్జర్‌ను హత్య చెయ్యడానికి ఐఎస్ఐ కిరాయి హంతకుల్ని నియమించిందని ఆ వర్గాలు తెలిపాయి. ఖలిస్తాన్ టైగర్స్ ఫోర్స్ చీఫ్ నిజ్జర్ హత్య వెనుకాల భారత్ ప్రమేయం ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.

నిజ్జర్‌తో పాక్‌కు వైరం

కెనడాలో నిజ్జర్‌కు పాకిస్తాన్ ఐఎస్ఐ ఏజెంట్లతో కూడా సంబంధాలు ఉండేవి. కెనడాకు వచ్చే పాక్ గ్యాంగ్‌స్టర్లకు మద్దతునివ్వాలని ఐఎస్ఐ నిజ్జర్‌పై ఒత్తిడి తీసుకువచ్చింది. అయినప్పటికీ నిజ్జర్ ఖలిస్తాన్ సానుభూతిపరులతో కలిసి పని చేసేవాడు. దీంతో అతనిపై ఆగ్రహించిన ఐఎస్ఐ కిరాయి మూకలతో నిజ్జర్‌ను అంతమొందించినట్టుగా నిఘా వర్గాలకు సమాచారం అందింది.

ఆధారాలేవి ? కెనడాకు జైశంకర్ సూటి ప్రశ్న

ఖలిస్తాన్ ఉగ్రవాది నిజ్జర్ హత్య వెనుక భారత్ ఏజెంట్ల ప్రమేయం ఉందంటూ కెనడా చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు లేవని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. ఈ కేసు విషయంలో కచ్చితమైన సమాచారం ఉంటే ఇవ్వాలని కెనడాకు ఇప్పటికే చెప్పామన్నారు. న్యూయార్క్‌లోని ఫారెన్ రిలేషన్స్ కౌన్సిల్ సమావేశంలో మంగళవారం జై శంకర్ మాట్లాడారు. ''ఇలా హత్యలు చేయించడం మా విధానం కాదు. ఈ విషయాన్ని కెనడాకి కచ్చితంగా చెప్పాం. భారత్ ప్రమేయం ఉందనడానికి ఆధారాలుంటే ఇవ్వాలని అడిగాం. అప్పుడే ఆ అంశాన్ని పరిశీలిస్తాం'' అని జైశంకర్ వెల్లడించారు.

ఖలిస్తానీ గ్యాంగ్‌స్టర్లపై ఎన్ఐఏ దాడులు

భారత్, కెనడా మధ్య చిచ్చు రగిల్చిన ఖలిస్తాన్ నెట్‌వర్క్‌పై భారత జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దృష్టి సారించింది. ఖలిస్తాన్ సానుభూతిపరులు, గ్యాంగ్‌స్టర్ల మధ్య సంబంధాలను బట్టబయలు చేయడానికి ఆరు రాష్ట్రాల్లోని 53 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు జరిపింది. భారత్‌లోని ఖలిస్తానీ వేర్పాటువాదులకు హవాలా మార్గాల ద్వారా డబ్బు చేరుతుంటే వారు డ్రగ్స్, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నారని ఎన్ఐఏ వర్గాలు వెల్లడించాయి. పంజాబ్, రాజస్తాన్, హరియాణా, ఉత్తరాఖండ్, ఢిల్లీ, యూపీలో ఎన్ఐఏ సోదాలు నిర్వహించింది. పంజాబ్‌లో ఫిరోజ్‌పూర్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ అర్షదల్లాకు అనుచరులు, మరి కొందరు గ్యాంగ్‌స్టర్‌లపై పెట్టిన కేసులకు సంబంధించి ఈ దాడుల్ని నిర్వహించింది. ఈ దాడుల్లో భారీ సంఖ్యలో పిస్టల్స్, మారణాయుధాలు, డిజిటల్ డివైజెస్, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకుంది. పాకిస్తాన్, యూఏఈ, కెనడా, పోర్చుగల్ దేశాల నుంచి ఉగ్రవాద సంస్థలు, డ్రగ్ స్మగ్లర్లతో సంబంధాలు నెరుపుతూ కలిసి పని చేస్తున్న వారిని లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు జరిగాయని ఎన్ఐఏ అధికారులు చెప్పారు.

మణిపూర్‌లో సాయుధ చట్టం... మరో ఆర్నెల్లు

ఇంఫాల్: మణిపూర్‌లో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ)ను మరో ఆర్నెల్ల పాటు పొడిగించారు. ప్రస్తుత కల్లోల పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో ఏఎఫ్ఎస్‌పీఏను అక్టోబర్ 1 నుంచి ఆరు నెలల పాటు పొడిగిస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారని పేర్కొంటూ అధికారిక ప్రకటన వెలువడింది. ఇంఫాల్ లోయ, అసోం సరిహద్దు ప్రాంతాల్లోని 19 పోలీస్ స్టేషన్లను మాత్రం దీని పరిధి నుంచి మినహాయించారు. అక్కడ చట్టాన్ని అమలు చేయాలంటే సంబంధిత పోలీస్ స్టేషన్ అనుమతి తప్పనిసరి. లేదంటే సైన్యం, అస్సాం రైఫిల్స్‌ను అక్కడ నియోగించడానికి వీల్లేదు. దీనిపై భద్రతా దళాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలోని నిషేధిత ఉగ్ర గ్రూపులు లోయలో తలదాచుకుని సవకు విసురుతున్నట్టు చెబుతున్నాయి. మణిపూర్ పోలీసు ఆయుధాగారం నుంచి దోచుకెళ్లిన మొత్తం 4,537 ఆయుధాలు, 6.32 లక్షల రౌండ్ల మందుగుండు వాటి చేతిలో పడ్డాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


త్వరలో ప్రపంచ ఆర్థిక శక్తి కేంద్రంగా భారత్

- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం ఖాయం
- ఇండియాను గ్లోబల్ గ్లోత్ ఇంజన్‌గా మార్చడమే లక్ష్యం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- 'వైబ్రంట్ గుజరాత్' తొలి సదస్సుకు 20 ఏళ్లు

అహ్మదాబాద్/బొడేలీ: భారత్‌ను ప్రపంచ గ్రోత్ ఇంజన్‌గా మార్చాలన్నదే తన లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. మన దేశం త్వరలోనే ప్రపంచ ఆర్థిక శక్తి కేంద్రంగా అవతరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'వైబ్రంట్ గుజరాత్' తొలి శిఖరాగ్ర సదస్సుకు 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. 20 సంవత్సరాల క్రితం వైబ్రంట్ గుజరాత్ అనే చిన్న విత్తనం నాటామని, ఇప్పుడు అది మహా వృక్షంగా ఎదిగిందని ఆనందం వ్యకం చేశారు. అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం గుజరాత్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వలేదని, అలాంటి సమయంలోనూ వైబ్రంట్ గుజరాత్ సదస్సు విజయవంతమైందని చెప్పారు. గుజరాత్‌ను భారత్ గ్రోత్ ఇంజన్‌గా తీర్చిదిద్దడానికి ఈ సదస్సు నిర్వహించామని తెలియజేశారు. ఆనాటి కల వాస్తవ రూపం దాల్చిందన్నారు. 2014లో తనకు దేశసేవ చేసే అవకాశం వచ్చినప్పుడు భారత్‌ను గ్లోబల్ గ్రోత్ ఇంజన్‌గా మార్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నానని వెల్లడించారు. భారత్ త్వరలో గ్లోబల్ ఎకనామిక్ పవర్‌హౌజ్‌గా మారే దశలో ప్రస్తుతం మనం ఉన్నామని పేర్కొన్నారు. అంతర్జాతీయ సంస్థలతోపాటు నిపుణులు ఇదే మాట చెబుతున్నారని గుర్తుచేశారు. మరికొన్ని సంవత్సరాల్లో మన దేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు.

గుజరాత్‌ను అప్రతిష్టపాలు చేసే కుట్రలు

వైబ్రంట్ గుజరాత్ మొదటి సదస్సు జరిగాక ఇలాంటి కార్యక్రమాలు దేశంలో సంస్థాగతం మారిపోయాయని, చాలా రాష్ట్రాలు పెట్టుబడిదారుల సదస్సులు నిర్వహించాయని, ఇప్పటికీ నిర్వహిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. వైబ్రంట్ గుజరాత్ సదస్సులో వచ్చిన సత్ఫలితాలను ఇప్పుడు కళ్లారా చూస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. వాస్తవానికి ఈ సదస్సుకు ఎన్నో ఇబ్బందులు, సవాళ్లు ఎదురయ్యాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం లభించలేదని చెప్పారు. విదేశీ పెట్టుబడిదారులకు అనాటి కేంద్ర మంత్రుల నుంచి బెదిరింపులు వచ్చాయన్నారు. అయినప్పటికీ విదేశీ పెట్టుబడిదారులు ధైర్యంగా సదస్సులో పాల్గొన్నారని ప్రశంసించారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నో అవరోధాలు ఎదురయ్యాయని, ప్రకృతి విపత్తులు సంభవించామని, గోద్రా ఉదంతం, ఆ తర్వాత అల్లర్లు జరిగాయని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ పరిణామాలతో గుజరాత్ కుప్పకూలుతుందని, దేశానికి పెద్ద భారంగా మారిపోతోందని చాలా మంది అంచనా వేశారని తెలిపారు. అంతర్జాతీయంగా గుజరాత్‌ను అప్రతిష్టపాలు చేసే కుట్రలు సైతం జరిగాయన్నారు. అన్నింటినీ తట్టుకొని గుజరాత్ అద్భుతమైన అభివృద్ధి సాధించిందని వ్యాఖ్యానించారు. 21వ శతాబ్దంలో గుజరాత్ రాష్ట్రం వ్యవసాయ ఆర్థిక శక్తిగా, ఆర్థిక హబ్‌గా మారిందని ప్రధానమంత్రి కితాబిచ్చారు. తన పేరిట ఒక్క ఇల్లు కూడా లేదని, కానీ, తమ ప్రభుత్వం లక్షలాది మంది ఆడబిడ్డలను ఇంటి యజమానులుగా మార్చిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రభుత్వ పథకాల కింద సొంత ఇళ్లు నిర్మించి ఇచ్చామని, వాటితో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఆడబిడ్డలు లక్షాధికారులు అయ్యారని ఆనందం వ్యక్తం చేశారు. గుజరాత్ రాష్ట్రం చోటాదేపూర్ జిల్లా బొడేలీ పట్టణంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు.



అహ్మదాబాద్ సైన్స్‌సిటీలోని రోబోటిక్స్ గ్యాలరీలో రోబో అందించిన టీ సేవిస్తున్న మోదీ

బ్యాంకులకు డొనాల్డ్ ట్రంప్ టోకరా



న్యూయార్క్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కష్టాలు వెంటాడుతున్నాయి. ఆయన మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి అవకాశాలు తగ్గిపోతున్నాయి. ట్రంప్ ఆర్థిక సంస్థలను, బ్యాంకులను మోసగించారని, తప్పుడు మార్గాల్లో భారీ రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్మించుకున్నారని న్యూయార్క్ కోర్టు న్యాయమూర్తి ఆర్థర్ ఎంగోరాన్ తేల్చిచెప్పారు. న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటీటియా జేమ్స్ దాఖలు చేసిన సివిల్ వ్యాజ్యంపై న్యాయమూర్తి విచారణ జరిపారు. మంగళవారం తీర్పు వెలువరించారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో ఒప్పందాలు, తద్వారా రుణాల కోసం ట్రంప్, ఆయన కంపెనీ అవకతవకలకు పాల్పడ్డారని తీర్పులో ప్రస్తావించారు. ఆస్తుల విలువను కాగితాలపై ఎక్కువ చేసి చూపించారని, లేని ఆస్తులు ఉన్నట్లు నమ్మించారని పేర్కొన్నారు. ఆయా నేరాలకు గాను శిక్ష కింద ట్రంప్‌నకు చెందిన కొన్ని బిజినెస్ లైసెన్స్‌లను రద్దు చేయాలని జడ్జి ఎంగోరాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆండ్రాయిడ్ ఫోన్లలో భూకంప హెచ్చరికలు!

న్యూఢిల్లీ: తమ వినియోగదారులకు వారు ఉంటున్న ప్రాంతంలో సంభవించబోయే భూకంపానికి సంబంధించిన తక్షణ సమాచారాన్ని అలర్ట్‌ల రూపంలో గూగుల్ అందించనుంది. ఇందుకోసం ఆండ్రాయిడ్ ఫోన్లలో త్వరలో 'ఎర్త్‌క్వేక్ అలర్ట్' సందేశ సేవలను ప్రారంభించనుంది. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ(ఎన్‌డీఎంఏ), జాతీయ భూకంప కేంద్రాల సమన్వయంతో కొత్తగా 'ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్స్ సిస్టమ్'ను భారత్‌లో మొదలుపెట్టనుంది. 'యూజర్లు ఉంటున్న ప్రాంతంలో ఒకచోట భూకంపం వస్తే దానికి పసిగట్టి వెంటనే ఆ ప్రాంతం, చుట్టుపక్కల ప్రాంతాల ఆండ్రాయిడ్ ఫోన్ యూజర్లు అందరికీ అలర్ట్‌లు మెరుపువేగంతో వెళతాయి' అని గూగుల్ బుధవారం ఒక బ్లాగ్‌లో పేర్కొంది. ఆండ్రాయిడ్ 5, ఆపై అప్‌డేటెడ్ వెర్షన్ ఆపరేటింగ్ సిస్టమ్‌లు ఇన్‌స్టాల్ అయిన ఫోన్లలోనే ఈ సదుపాయం అందుబాటులోకి రానుంది.

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అధికార నివాసం నిర్మాణంలో అవకతవకలు..

సీబీఐ ప్రాథమిక దర్యాప్తు ప్రారంభం

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కోసం చేపట్టిన నూతన అధికారిక నివాసం నిర్మాణంలో భారీగా అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై సీబీఐ ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించింది. ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన గుర్తుతెలియని అధికారులపై ఈ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఈ విషయాన్ని సీబీఐ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆరోపణలకు తగిన ఆధారాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలితే పూర్తిస్థాయి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. సీఎం కొత్త ఇంటి నిర్మాణానికి సంబంధించిన రికార్డులన్నీ తమకు అందజేయాలని సీబీఐ సోమవారం ఢిల్లీ ప్రజా పనుల విభాగానికి లేఖ రాసింది. కేజ్రీవాల్ కొత్త ఇంటి నిర్మాణం కోసం ఢిల్లీ ప్రభుత్వం రూ.43.70 కోట్లు కేటాయించింది. కానీ, రూ.44.78 కోట్లు ఖర్చు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.. 2020 సెప్టెంబర్ 9 నుంచి 2022 జూన్ దాకా ఈ సొమ్ము ఖర్చు చేశారు.

ఆ ఐఏఎస్ అధికారితో నిర్బంధ పదవీ విరమణ

న్యూఢిల్లీ: న్యూఢిల్లీలోని ప్రభుత్వ స్టేడియంలో తన కుక్కతో కలిసి వాకింగ్ చేయడం కోసం క్రీడాకారుల్ని ముందస్తుగా ఖాళీ చేసిన ఘటనకు సంబంధించి ఐఏఎస్ అధికారిపై వేటు పడింది. 1994 అరుణాచల్‌ప్రదేశ్-గోవా-మిజోరం కేడర్ ఆఫీసర్ అయిన రింకు దుగ్గాను కేంద్ర ప్రభుత్వం నిర్బంధంగా పదవీ విరమణ చేయించినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రింకు దుగ్గా, ఆమె భర్త, ఐఏఎస్ అధికారి అయిన సంజీవ్ ఖిర్వార్‌లు ఢిల్లీలో త్యాగరాజ్ స్టేడియానికి తమ కుక్కని తీసుకొని తీరిగ్గా వాకింగ్‌కు వెళ్లేవారు. ఆ స్టేడియంలో అథ్లెట్లకు రాత్రి 7 గంటలవరకు ప్రాక్టీస్ చేసుకోవడానికి అనుమతి ఉన్నప్పటికీ నిర్వాహకులపై ఒత్తిడి తెచ్చి సాయంత్రమే ఖాళీ చేయించేవారు. ఇది వెలుగులోకి వచ్చాక తొలుత ఆ అధికారుల్ని అరుణాచల్ ప్రదేశ్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం సంజీవ్ ఖిర్వార్ లద్దాఖ్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

పెళ్లి వేడుకలో అగ్ని ప్రమాదం

- ఇరాక్‌లో 114 మంది మృతి, 150 మందికి పైగా గాయాలు
- బాణాసంచా కాల్చడంతో జరిగిన దారుణం
- వధూవరులకు తీవ్ర గాయాలు

మోసల్ (ఇరాక్): ఇరాక్‌లోని ఒక పెళ్లి వేడుకల్లో అగ్ని ప్రమాదం సంభవించడంతో తీవ్ర విషాదం నెలకొంది. అతిథులతో కిక్కిరిసిపోయిన హాలులో వధూవరులు డ్యాన్స్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి 114 మంది మరణించారు. మరో 150 మంది వరకు గాయపడ్డారు. ఆస్పత్రితో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇరాక్‌లోని నినెవెహ్ ప్రావిన్స్ ఖరఖోష్ పట్టణంలో పెళ్లి వేడుకలో హాలులో బాణాసంచా కాల్చడంతో ఒక్కసారి డెకరేషన్‌కు మంటలు అంటుకొని వ్యాపించాయి. ఆ హాలు నిర్మాణంలో ఉపయోగించిన సామాగ్రి, పెళ్లి కోసం చేసిన డెకరేషన్ కూడా మండించే స్వభావాన్ని కలిగి ఉండడంతో అగ్ని కీలలు త్వరితగతిన విస్తరించాయి. కళ్ల ముందే షాండ్లియర్లు, సీలింగ్ నుంచి పెచ్చులు కింద పడడంతో పెళ్లికి హాజరైన అతిథులు అటూ ఇటూ వెళ్లడానికి వీల్లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో వధూవరులు తీవ్రంగా గాయపడినా వారి ప్రాణాలకు ప్రమాదం లేదని స్థానిక మీడియా వెల్లడించింది. పెళ్లి వేడుకలు అంబరాన్నంటుతున్న సమయంలో ఆనందంతో కేరింతలు కొడుతున్న అతిథులు ఒక్కసారిగా మంటలు చుట్టుముట్టడంతో హాహాకారాలు చేశారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం పెళ్లి వేడుకలు జరిగే మండపం అంతా ప్లాస్టిక్‌తో డెకరేషన్ చేశారు. వధూవరులు డ్యాన్స్ చేస్తుండగా హాలులోనే బాణాసంచా కాల్చారు. అవి నేరుగా రూఫ్‌కి తాకాయి. సీలింగ్‌కి మంటలు అంటుకోవడంతో అవి విస్తృతంగా వ్యాపించాయి. ఆ ఫంక్షన్ హాలుని శాండ్‌విచ్ ప్యానెల్స్, వినిల్ షీట్స్, ఫ్యాబ్రిక్‌తో నిర్మించడంతో మంటలు ఎగిసెగిసి పడ్డాయి. దీంతో పై నుంచి డెకరేషన్ సామాగ్రి కింద పడి ఎవరూ కదలడానికి వీల్లేకుండా పోయింది. అతిథుల సంఖ్య భారీ స్థాయిలో 1,000 నుంచి 1100 మంది ఉండడంతో అటూ ఇటూ వెళ్లడానికి దారి లేక అందరూ అక్కడే చిక్కుకుపోయి మంటలకి ఆహుతైపోయారు.



అగ్నిప్రమాదం జరిగిన ఫంక్షన్ హాల్ (ఇన్‌సెట్‌లో) కాలి బూడిదైన వేదిక, కుర్చీలు

అర్ధనగ్నంగా రక్తమోడుతూ

ఉజ్జయిని వీధుల్లో అత్యాచారానికి గురై సాయం కోరిన 12 ఏళ్ల బాలిక

మధ్యప్రదేశ్‌లో వెలుగులోకి వచ్చిన దారుణం

ఉజ్జయిని: మానవత్వానికే మాయని మచ్చగా నిలిచిన ఘటన ఇది. ఒక చిన్నతల్లికి పెద్ద కష్టం వచ్చి వీధుల్లో తిరుగుతూ సాయం కోరినా ఎవరూ ముందుకు రాని దారుణమైన పరిస్థితి ఇది. మధ్యప్రదేశ్‌లో అత్యాచారానికి గురైన పన్నెండేళ్ల బాలిక అర్ధనగ్నంగా, రక్తమోడుతూ ఉజ్జయిని వీధుల్లో సాయం కోరుతూ తిరిగిన వీడియో అందరినీ కంటతడి పెట్టిస్తోంది. చిన్నారికి వచ్చిన ఆ కష్టాన్ని చూసిన వారు దిగ్భ్రాంతికి లోనయ్యారే తప్ప సాయం చెయ్యడానికి ముందుకు రాలేదు. కొందరు పొమ్మంటూ సంజ్ఞలు కూడా చేయడం కూడా కనిపించింది. చివరికి ఆ బాలిక ఒక ఆశ్రమం ఎదుట స్పృహ తప్పి పడిపోగా ఆశ్రమవాసులు ఆమెను ఆస్పత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ బయటకు రావడంతో అందరికీ ఈ దారుణం గురించి తెలిసింది. ఆ బాలికపై అత్యాచారం జరిగిందని వైద్య పరీక్షల్లో తేలడంతో వెంటనే ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసి విచారణ చేపట్టింది. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. ప్రస్తుతం ఆ బాలికకు ఇండోర్ ఆస్పత్రిలో చికిత్స నిర్వహిస్తున్నామని, ఆమె ప్రాణానికి ప్రమాదం లేదని మధ్యప్రదేశ్ హోంమంత్రి నరోత్తమ్ మిశ్రా చెప్పారు. ఆ బాలిక ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చినట్టుగా పోలీసులు చెబుతున్నారు. అత్యాచారానికి గురి కావడంతో తీవ్రమైన షాక్‌లో ఉన్న ఆ బాలిక తను ఎక్కడ నుంచి వచ్చిందో, తల్లిదండ్రులు ఎవరో ఇంకా చెప్పలేకపోతోందని సూపరిండెంట్ ఆఫ్ పోలీసు సచిన్ శర్మ చెప్పారు. ఆ బాలికను నిరంతరం వైద్యులు, మానసిక నిపుణులు పరీక్షిస్తున్నారని కౌన్సెలింగ్ ఇస్తున్నారని చెప్పారు. మరోవైపు ఈ ఘటన మానవత్వానికే మచ్చగా మిగిలిందని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ కమల్‌నాథ్ అన్నారు. ఆ బాలిక అలా ఉజ్జయిని రోడ్లపై సాయం కోసం తిరిగిన వీడియో చూసి సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. ఆమె భవిష్యత్ కోసం కోటి రూపాయలు ఆర్థిక సాయం చేయాలని, రేపిస్టుకి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

సాక్షి కరీంనగర్

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023


టవర్ సర్కిల్‌లో వినాయకునికి హారతి ఇస్తున్న మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ బండి సంజయ్


నెత్తిన గణపతితో యువతి




కరీంనగర్ టవర్ సర్కిల్‌లో వినాయకుల శోభాయాత్ర


వినాయకునితో యువతి.. నృత్యం చేస్తున్న యువతి డప్పు వాయిస్తున్న చిన్నారి



బొజ్జ గణపయ్యా.. వెళ్లిరావయ్యా!

ఘనంగా నిమజ్జనోత్సవం

తొమ్మిది రోజులపాటు విశేష పూజలందుకున్న పార్వతీపుత్రుడు గంగమ్మ ఒడికి చేరాడు. బుధవారం జిల్లా వ్యాప్తంగా వినాయకుడి శోభాయాత్ర కనులపండువగా సాగింది. కరీంనగర్ సిటీలో చిన్నాపెద్ద తేడాలేకుండా ఏకదంతుడి నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. డప్పుచప్పుళ్లు..నృత్యాలు..ఆటపాటలు.. భక్తిగీతాలతో నగరమంతా మార్మోగింది. పాతబజార్ నంబర్‌వన్ గణనాథుడి శోభాయాత్రను మంత్రి గంగుల కమలాకర్ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. టవర్ సర్కిల్ వద్ద విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికల వద్ద మంత్రి గంగుల కమలాకర్, ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ కుమార్, కలెక్టర్ గోపి, సీపీ సుబ్బారాయుడు, మేయర్ సునీల్‌రావు గణనాథులకు స్వాగతం పలికారు. విగ్రహాలను మానకొండూర్, కొత్తపల్లి చెరువులు, చింతకుంట కెనాల్ వద్దకు తరలించారు. భారీ క్రేన్లతో నిమజ్జనం చేశారు.– కరీంనగర్ కల్చరల్/విద్యానగర్/కొత్తపల్లి


బందంపల్లి చెరువులో నిమజ్జనం


శోభాయాత్రలో మంత్రి గంగుల, మేయర్ సునీల్ రావు, సీపీ సుబ్బారాయుడు


తెప్పపై వినాయకులను తీసుకెళ్తూ..


మోటార్ సైకిల్‌పై..


కమాన్‌వద్ద నగర ప్రజలు


కారు డిక్కీలో వినాయకుడిని తీసుకెళ్తూ..


ఊరేగింపులో ఆల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి


శోభాయాత్రలో బ్యాండ్ మేళా


నగరంలో యువత నృత్యాలు


వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న ఎంపీ బండి


కలెక్టరేట్‌లో పూజలు చేస్తున్న కలెక్టర్ గోపి


మంగళహారతులతో మహిళలు..


కోలాటం ఆడుతున్న మహిళలు


శోభాయాత్రలో మహిళల కేరింతలు

లక్షల్లో పలికిన గణనాథుని లడ్డూ

కొత్తపల్లి/కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌లోని సూర్యనగర్ లడ్డూ వేలం పాట ఏటా ప్రత్యేకంగానే సాగుతోంది. గణేశ్‌నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విశేష పూజలు అందుకున్న తులసిగద్దె వినాయకుడి లడ్డూను రూ.1,30,131కు ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కొత్త సతీశ్‌రెడ్డి వేలంలో సొంతం చేసుకున్నారు. సూర్యనగర్ రోడ్డు నంబరు 5లోని లడ్డూను రూ.18,116కు నిర్మల– సత్యనారాయణరెడ్డి దక్కించుకున్నారు.

ఖిల్లీ లడ్డూ రూ.13 వేలు

కొత్తపల్లి మున్సిపల్‌లోని బాపూజీ యూత్ క్లబ్ ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి ఖిల్లీ లడ్డూను రూ.13 వేలకు గుర్రం అనిల్‌కుమార్ గౌడ్ దక్కించుకున్నారు. మహారాష్ట్ర మాహోర్ ఎల్లమ్మ ఆలయం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన ఈ పాన్(తాంబూలం) లడ్డూకు నిర్వహించిన వేలం ఆసక్తి రేకెత్తించింది. బాపూజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు పొన్నం సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జన వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా, వినాయకుని లడ్డూను రూ.6,600కు నమిలికొండ రఘుపతి దక్కించుకున్నారు.

కోతిరాంపూర్ లడ్డూ వేలం

కోతిరాంపూర్ లడ్డూకు వేలం నిర్వహించగా రూ.90 వేలు పలికింది. సూర్యనగర్ లడ్డూ రూ.18 వేలు పలుకగా, జ్యోతినగర్ గణేశ్ యూత్ అసోసియేషన్ లడ్డూను మధుసూదన్ రూ.37,516కు వేలంలో దక్కించుకున్నారు.


ఖిల్లీ లడ్డూను అందజేస్తున్న బాపూజీ యూత్ సభ్యులు


సూర్యనగర్ లడ్డూతో సతీశ్‌రెడ్డి కుటుంబ సభ్యులు


లడ్డూతో సత్యనారాయణరెడ్డి దంపతులు

బడుగుల ఆశాజ్యోతి కొండాలక్ష్మణ్ బాపూజీ

కరీంనగర్: తెలంగాణ స్వాతంత్య్ర సమరయయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు భావితరాలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని కరీంనగర్ ఉజ్వలపార్కు ఎక్స్‌రోడ్డు వద్ద ఆయన విగ్రహానికి కలెక్టర్ గోపి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి పూలమాలవేసి నివాళి అర్పించారు. పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి అధికారికంగా నిర్వహించుకోవడం గొప్పవిషయమన్నారు. రాష్ట్రం కోసం పోరాడిన మహనీయుల జయంతి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. 91ఏళ్ల వయస్సులో కూడా ఢిల్లీలో చలిలో వణుకుతూ కొండా లక్ష్మణ్ తెలంగాణ కోసం పోరాటం చేశారని మంత్రి గుర్తుచేశారు. సముచిత గౌరవాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతో జిల్లా కేంద్రం ముఖద్వారం వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈకేవైసీని ప్రతీ పదిసంవత్సరాలకు అప్‌డేట్ చేయాల్సి ఉంటుందని.. ప్రవాస భారతీయులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వై.సునీల్ రావు, కరీంనగర్ ఆర్డీవో కె.మహేశ్వర్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాశ్, చేనేత జౌళీశాఖ ఏడీ సంపత్, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు వాసాల రమేశ్, అధ్యక్షుడు మెతకు సత్యం, కార్పొరేటర్లు ఐలందర్ యాదవ్, ఎడ్ల సరిత, ఎల్.స్వప్న, కొశెట్టి శ్రీనివాస్, పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వర్గం మల్లేశం, బీసీ సంఘ నాయకులు పి.సత్యనారాయణ, గడ్డం శ్రీరాములు, రుద్రరాజు, వేముల చంద్రశేఖర్, నర్సయ్య, గున్నాల రమేశ్, ఎ.భూమయ్య, గడ్డం వెంకటేశం, దీకొండ లక్ష్మీనారాయణ, మల్లికార్జున్, తాడిచర్ల రాజు, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మణ్ బాపూజీకి నివాళి అర్పిస్తున్న మంత్రి


మేయర్ సునీల్ రావు


కలెక్టర్ గోపి..


సీపీ సుబ్బారాయుడు

సీపీ నివాళి..

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఘనంగా నిర్వహించారు. సీపీ సుబ్బరాయుడు బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. స్వాతంత్ర సమరయోధులు తెలంగాణ పోరాటంలో కీలకపాత్ర పోషించారని సీపీ అన్నారు. ఆయన జీవిత చరిత్ర ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు సి. రాజు(పరిపాలన), ఎ.లక్ష్మీనారాయణ (శాంతిభద్రతలు), ఏవో మునిరామయ్య, ఏసీపీలు జి. విజయ్ కుమార్ (సీసీఆర్‌బీ), సి.ప్రతాప్ (ఏఆర్), సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ ఇన్‌స్పెక్టర్, ఐటీ సెల్ ఇన్‌చార్జి జె.సరిలాల్, ఆర్ఐలు సురేశ్, రజినీకాంత్, కుమారస్వామి, శేఖర్ బాబు, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కులరహిత సమాజం కోసం ఉద్యమించాలి


మాట్లాడుతున్న రత్నం రమేశ్

కరీంనగర్: భారతదేశంలో నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ నిర్మూలనకై ఉద్యమించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్ అన్నారు. బుధవారం నగరంలో నిర్వహించిన సత్యశోధక్ 150వ కుల నిర్మూలన సదస్సులో పాల్గొని మాట్లాడారు. 1873లో మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలేలు కులం పోవాలని సత్యశోధక్ సమాజాన్ని స్థాపించారన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కుల వ్యవస్థ భారతదేశాన్ని పట్టి పీడిస్తోందని, దీంతో ప్రజల మధ్య సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అసమానతలతో పాటు మనస్సుల మధ్య వ్యత్యాసాలు పెరుగుతున్నాయని తెలిపారు. కుల వ్యవస్థ నిర్మూలనకు అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. నాయకులు సంపత్, నవీన్ అఖిల్, శ్రీనాథ్, సాయికుమార్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జీవిత చరిత్ర నేటి యువతకు ఆదర్శం


నివాళి అర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కరీంనగర్: భగత్‌సింగ్ జీవితచరిత్ర నేటి యువతకు ఆదర్శమని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా నగరంలోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అతి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు శివ, ఇషాక్, రాకేశ్ శ్రీరామ్, కుమార్, నరేశ్, విఘ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



కరీంనగర్: జాతీయ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడిగా రామడుగు మండలం వెలిచాలకు చెందిన సీనియర్ దళిత ఉద్యమ నాయకులు కాడె శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తిమ్మాపూర్ మండలం రేణికుంటకు చెందిన ఎలుక ఆంజనేయులును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ బుధవారం నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూడ కనుకయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి తాళ్ల వెంకటేశ్, పొలిట్ బ్యూరో సభ్యులు జీవన్, దామెర సత్యం, వెన్న రాజులు పాల్గొన్నారు.

శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు



ఇల్లందకుంట(హుజూరాబాద్): అపరభద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం హుండీల ఆదాయం బుధవారం లెక్కించారు. కరీంనగర్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో మొట్లపల్లి శ్రీలలితా మాత సేవా సమితి సభ్యులు ఐదునెలలకు సంబంధించి 20 హుండీల ద్వారా రూ.7,66,870 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి కె.సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శేషం రామాచార్యులు, శేషం వంశీధరాచార్యులు, సిబ్బంది రాజయ్య, మోహన్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ఎంబీబీఎస్ విద్యార్థులు



కరీంనగర్‌టౌన్: కొత్తపల్లిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థులు బుధవారం జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఓరియంటేషన్‌లో భాగంగా విద్యార్థులు ఆస్పత్రిని సందర్శించినట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్ తెలిపారు. ఆసుపత్రిలో అడ్మిట్ అయిన పేషెంట్లు, వారికి అందించే వైద్యంపై అవగాహన పెంచుకోవడం కోసం ఆసుపత్రికి వచ్చినట్లు తెలిపారు.

గణేశ్ నిమజ్జనంలో భారీ పోలీసు బందోబస్తు


మంత్రి గంగుల కమలాకర్‌తో చర్చిస్తున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: నగరంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీపీ సుబ్బారాయుడు టవర్‌సర్కిల్, మార్కెట్ ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాలు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకునేందుకు కిందిస్థాయి అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. కరీంనగర్‌లో మొత్తం 488 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయగా వన్‌టౌన్ పరిధిలో 169, టూటౌన్ పరిధిలో 204, త్రీటౌన్ పరిధిలో 115 వినాయగవిగ్రహాలు ఏర్పాటు చేశారు. 320 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు కరీంనగర్‌కు ప్రవేశించే ఎన్టీఆర్ చౌరస్తా వద్ద వాహనాలు బైపాస్ నుండి వెళ్లేలా చర్యలు చేపట్టారు.

టవర్‌సర్కిల్ సందర్శన

టవర్‌సర్కిల్‌లో పలు వినాయక మండపాలు, దుకాణాలను మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావులతో సీపీ సుబ్బారాయుడు సందర్శించారు. భద్రత విషయంలో ఇబ్బందులు కలుగకుండ మంత్రి సీపీతో పలు విషయాలు చర్చించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వినాయకుని పూజ చేసి ఇంటికి వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో పూజారి మృతి


పాపయ్యశాస్త్రి(ఫైల్)

కరీంనగర్‌రూరల్: ఎనిమిది రోజులపాటు వినాయకుడికి నిష్టతో రెండుపూటల పూజలు చేసిన ఓ పూజారి నిమజ్జనోత్సవం బుధవారం రాత్రి చివరిపూజచేసి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికులు, రూరల్ పోలీసుల కథనం ప్రకారం...కరీంనగర్ మండలం ఇరుకుల్లకు చెందిన తిరువరంగం పాపయ్యశాస్త్రి(45) పూజారిగా పనిచేస్తున్నాడు. గణపతి నవరాత్రుల్లో భాగంగా చెర్లభూత్కూర్‌లోని వినాయక మండపాల వద్ద పూజలు నిర్వహిస్తున్నాడు. చివరిరోజు బుధవారం రాత్రి వినాయకుడి పూజలు పూర్తి చేసుకుని ద్విచక్రవాహనంపై ఇరుకుల్లకు బయల్దేరాడు. చెర్లభూత్కూర్ నుంచి మొగ్దుంపూర్ రోడ్డుపైకి వచ్చిన ఆయన వెహికిల్‌ను పెద్దపల్లి జిల్లా గోదావరిఖని నుంచి కరీంనగర్ వైపు వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య వనజ, కుమారుడు భరద్వాజ్, కూతురు హోత్రి ఉన్నారు.

ఎస్సారార్‌లో రంగవల్లుల పోటీలు


రంగవల్లులు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

కరీంనగర్ సిటీ: నగరంలోని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలలో సూక్ష్మ జీవశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో శాస్త్ర సాంకేతిక రంగోళి అంశంపై ముగ్గుల పోటీలు నిర్వహించారు. సూక్ష్మజీవులు, అవి కలిగించే వ్యాధులపై చక్కటి రంగవల్లులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతతో అద్భుతాలు సృష్టిస్తారని, సూక్ష్మజీవులపై వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయని, చక్కటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చాయని తెలిపారు. విద్యార్థులు, సూక్ష్మ జీవశాస్త్ర అధ్యాపకులను ప్రిన్సిపాల్ అభినందించారు. సూక్ష్మజీవ శాస్త్ర శాఖ అధిపతి డాక్టర్ పుప్పాల ముత్తన్న, జీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, జంతుశాస్త్ర శాఖ అధిపతి పర్లపల్లి రాజు, మహేశ్, తిరుపతి, జీవ సాంకేతిక శాస్త్ర విభాగ్యపతి కిశోర్‌కుమార్, సూక్ష్మజీవ శాస్త్ర శాఖ అధ్యాపకులు లతా, మృదుల, జంతుశాస్త్ర అధ్యాపకురాలు సమతతో పాటు డిగ్రీ, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీఎంబీ సందర్శన



కరీంనగర్: సీసీఎంబీ ఓపెన్ డే సందర్భంగా హైదరాబాద్ హబ్సిగూడలోని సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మోలెకులర్ బయాలజీ(సీసీఎంబీ)ని బుధవారం కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు సందర్శించినట్లు ఆ విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు తెలిపారు. ఆధునిక జీవశాస్త్రం, జీవ ప్రపంచం వాస్తవాలు, పరిరక్షణ, జన్యుశాస్త్రం, ప్రత్యక్ష ప్రయోగాలు, వివిధ రకాల వ్యాధులు వాటి నివారణ, పరిశోధలనపై అడిగి తెలుసుకున్నారన్నారు. ఈ సందర్శనలో వృక్షశాస్త్ర విభాగాధిపతి మహేశ్, అధ్యాపకులు సంపత్‌కుమార్, ప్రణయ, మహేశ్వరి, స్నేహ, దీపిక, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక లడ్డూ వేలం



కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలోని పాతబజార్ నంబర్ వన్‌లో నెలకొల్పిన వినాయకుడి చేతిలోని లడ్డూకు బుధవారం వేలం వేశారు. రూ.22వేలకు హౌసింగ్ బోర్డులోని కరాటే అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ వసంత్‌కుమార్ దంపతులు దక్కించుకున్నారు. తొమ్మిదేళ్ల నుంచి తాను వేలంలో లడ్డూను దక్కించుకుంటున్నానని, గణనాథుడు తనకు ఇచ్చిన వరంగా భావిస్తున్నట్లు వసంత్‌కుమార్ తెలిపారు.

సమ్మె చేస్తున్న వారిపై ఒత్తిడి మానుకోవాలి

కరీంనగర్‌టౌన్: ఫిక్స్‌డ్ వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె చేస్తున్న ఆశా కార్యకర్తలపై ఒత్తిడి పెంచడం మానుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆశా కార్యకర్తలు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నా శిబిరం వద్దకు డీఎంహెచ్‌వో లలితాదేవి వచ్చి మాట్లాడారు. ఇలాంటి ఘటనలు రిపీట్ కాకుండా చూసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఆశా కార్యకర్తలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత, జిల్లా అధ్యక్షుడు శారద, నాయకురాళ్లు పద్మ, శోభ, విజయలక్ష్మి, రాజమణి, లలిత, శైలజ, శ్యామల, పద్మ, శోభ, శంకరమ్మ, పరిమిత, లత తదితర ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం

- తాటిపెల్లిలో విషాదం





జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామ శివారు రైల్వే బ్రిడ్జి వద్ద జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారి పై గురువారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో ఇదే మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. తాటిపెల్లికి చెందిన జెట్టి కార్తీక్ (18), అతని స్నేహితుడు మేకర్తి రవితేజ (17) కలిసి పని నిమిత్తం రాత్రి సమయంలో జగిత్యాలకు వస్తున్నారు. చల్‌గల్ రైల్వే బ్రిడ్జి సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో కార్తీక్ అక్కడిక్కడే మృతి చెందాడు. రవితేజను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకుని కార్తీక్ మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి.

పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో చోరీ

మల్లాపూర్: మండలంలోని వాల్గొండలో పెద్దమ్మ, రేణుక ఎల్లమ్మ ఆలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలిసింది. ఆలయాల్లో కొంతకాలం క్రితం ఉత్సవాలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు తమ కానుకలు హుండీలో వేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. బుధవారం ఆ ఆలయాల్లోకి స్థానికులు వెళ్లగా అమ్మవారల ముక్కు పుడకలు, పుస్తెలు (రెండున్నర తులాలు), ఏడు తులాల వెండి ఆభరణాలు (కడియం, మెడలో చైన్) కనిపించలేదు. గ్రామస్తులు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆలయానికి చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎస్సై నవీన్‌కుమార్‌కు సమాచారం అందించారు.

జూనియర్ అథ్లెటిక్స్ స్టేట్ చాంపియన్‌షిప్ ట్రోఫీల ఆవిష్కరణ



కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలో ఈనెల 30, అక్టోబర్ 1వ తేదీన జరిగే తొమ్మిదవ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు బుధవారం ఆవిష్కరించారు. ఈ ట్రోఫీలను గెలుపొందిన విజేతలకు అందించనున్నట్లు అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి రాజవీరు, అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, సీనియర్ క్రీడాకారులు బెజ్జంకి రాజగోపాలాచారి, సర్దార్ బీసన్ సింగ్, సత్యానంద్, సుమన్ కళ్యాణ్, హరికిషన్, మర్రి చంద్రశేఖర్, సత్తినేని రమేశ్ పాల్గొన్నారు.

అక్రమ వసూళ్ల నియంత్రణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్‌అర్బన్: ఆధార్ అప్‌డేట్ క్రమంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పక్కా చర్యలు చేపట్టాలని కలెక్టర్ బి.గోపి అధికారులను ఆదేశించారు. ఈనెల 26న 'సాక్షి'లో 'ఆధార్.. ఫ్రస్టేషన్'' శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. రెవెన్యూ, ఎన్ఐసీ అధికారులు ఆధార్ కేంద్రాలను తనిఖీ చేయాలని నిర్దేశించినట్లు సమాచారం. నిర్ణీత రుసుం కంటే ఎక్కువగా వసూలు చేసినా, ఉచితంగా సేవలందించాల్సిన వాటికి రుసుము వసూలు చేసినా గుర్తింపును రద్దు చేయాలని ఆదేశించారు.

డీడీఎన్ అర్చకులకు శిక్షణ తరగతులు

కరీంనగర్ కల్చరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ధూపదీప నైవేద్య పథకం కింద పనిచేస్తున్న అర్చకులకు అక్టోబర్ 1, 2, 3 తేదీల్లో వేములవాడలోని ఓపెన్ ప్లాట్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కమిషనర్ ఆకునూరి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 1న ఉదయం పాంచరాత్రాగమం, మధ్యాహ్నం వీరశైవాగమం, 2, ఉదయం చాత్తాద శ్రీవైష్ణవాగమం, మధ్యాహ్నం వైఖానసాగమం, గ్రామదేవతాగమం, తంత్ర సార ఆగమం, 3న శైవాగమం. మధ్యాహ్నం వైదిక స్మార్త ఆగమం వారికి తరగతులుంటాయని పేర్కొన్నారు.

'పెంచిన నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి'

కరీంనగర్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక నిత్యవసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెంచుతూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నారని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశభక్తులం, భరతమాత ముద్దుబిడ్డలం అని గొప్పలు చెప్పుకుంటూనే దేశంలో ఉన్న మహిళలపై దాడులకు దిగుతున్నారని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలైన మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించారని, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో మహిళలపై లైంగిక దాడులు, అరాచకాలు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని, సమాజంలో మహిళలకు రక్షణ కల్పించాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 5న ఢిల్లీలో జరిగే మహా ధర్నాలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

30న ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ అడ్మిషన్ల చివరి గడువు

కరీంనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2023–24 సంవత్సరానికి ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు ఈనెల 30వ తేదీ చివరి గడువు అని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ పీవీ శ్రీహరి, డీఈవో సీహెచ్.జనార్దన్‌రావు, ఓపెన్ స్కూల్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్ రావులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని డాక్యుమెంట్లను సంబంధిత సెంటర్‌లో అందజేయాలని పేర్కొన్నారు.

నేషనల్ హైవే పనులు ముమ్మరం

- మొదటిదశలో అండర్‌పాస్ బ్రిడ్జిల నిర్మాణం
- ఇరుకుల్ల, మానేరు వాగుపై వంతెన పనులు ప్రారంభం


చేగుర్తిలో జరుగుతున్న వంతెన పనులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–563) నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం భారత మాల పరియోజన కింద రూ.2146కోట్ల అంచనా వ్యయంతో 68కిలోమీటర్ల మేరకు ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణానికి మొత్తం 325.125 హెక్టార్ల భూసేకరణ పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణపు పనులు కాంట్రాక్టు పొందిన నిర్మాణ సంస్థ కొన్నిరోజుల నుంచి కరీంనగర్–వరంగల్ జిల్లాల మధ్య ఉన్న 30గ్రామాల్లో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా మొత్తం 28 వెహికల్ అండర్‌పాస్ బ్రిడ్జిలు, ఇరుకుల్ల, మానేరు తదితర వాగులపై మొత్తం 9 మేజర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. ప్రస్తుతం ఇరుకుల్ల వాగుపై 250 మీటర్లు, మానేరు వాగుపై 562 మీటర్ల పొడవుతో మేజర్ బ్రిడ్జిల పనులు ప్రారంభించారు. అదే విధంగా 28 వెహికల్ అండర్‌పాస్ బ్రిడ్జిల్లో 21 బ్రిడ్జిలు పెద్దవి, 7 చిన్న బ్రిడ్జిలున్నాయి. మొత్తం కల్వర్టులు 112 ఉండగా ప్రస్తుతం 25 కల్వర్టుల నిర్మాణ పనులు నడుస్తున్నాయి. కొన్ని రోజుల నుంచి దుర్శేడ్–చేగుర్తి రహదారిలో వెహికల్ అండర్‌పాస్ బ్రిడ్జి, రోడ్డుకు ఇరువైపుల పిల్లర్లను నిర్మించే పనులు నడుస్తున్నాయి. భూ సేకరణ సమస్య లేని ప్రాంతాల్లో బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు నిర్మాణ సంస్థ సైట్ ఇన్‌చార్జి నరేందర్ తెలిపారు. అధికారుల పర్యవేక్షణలో నిర్ణీత వ్యవధిలో రోడ్డు పనులను పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

30న ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన దీక్ష


మాట్లాడుతున్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు

కరీంనగర్: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న హైదరాబాద్‌లో ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన దీక్ష చేపడుతున్నట్లు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చందా రాజు, శివనాథుని శ్రీనివాస్, పట్టణ కన్వీనర్ తొడుపునూరి కరుణాకర్‌లు తెలిపారు. బుధవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్యవైశ్యుల్లోని పేదలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల టీఆర్ఎస్ పార్టీ మెనిఫెస్టోలో పేర్కొన్న సీఎం కేసీఆర్ ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. పలు సందర్భాల్లో హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరినప్పటికీ స్పందించలేదన్నారు. వైశ్యుల్లోని ఎంతో మంది పేద కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేద వైశ్యులకు అండగా నిలిచేందుకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన దీక్షకు రాజకీయాలకతీతంగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అదనపు కార్యదర్శి ఉప్పల రమేశ్, కరీంనగర్ డివిజన్ చైర్మన్ వెంకటేశం, అభ్యుదయ సంఘాల అధ్యక్షులు భద్రయ్య, ఆంజనేయులు, ప్రతినిధులు గంగాధర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లను తిరస్కరించాలి


మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

కరీంనగర్: బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలను మార్చాల్సిన అవసరం ఉందని ప్రజామిత్ర ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. బుధవారం ప్రజామిత్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో స్కాంలు జరిగాయని, దేశంలో బీజేపీ అధికారంలోకి వస్తే నీతివంతమైన పాలన అందిస్తామని అప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీని ప్రధాన మంత్రి అభ్యర్థిగా బీజేపీ ప్రకటించిందని తెలిపారు. అధికారంలో వచ్చిన నరేంద్ర మోదీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో నరేంద్ర మోదీ వైఫల్యం చెందారని విమర్శించారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబ ప్రభుత్వాన్ని మార్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ దేశానికి ఇండియా కూటమి అవసరం ఉందన్నారు. కూటమికి మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ నాయకత్వంలో ముందుకు పోతుందని తెలిపారు. కరీంనగర్‌లో తాను ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా పోటీ చేస్తానన్నారు. ఈ సమావేశంలో నాయకులు కడపల విజయ్‌కుమార్, సిగిరి శ్రీధర్, చంద్రశేఖర్, లింగమూర్తి, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఆదాయం పెంచడమే కిసాన్ గ్రామీణ మేళా లక్ష్యం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుగుణాకర్‌రావు

కరీంనగర్‌టౌన్: రైతు ఆదాయం పెంచడమే కిసాన్ మేళా లక్ష్యమని కిసాన్ జాగరణ్ అధ్యక్షుడు, బీజేపీ జాతీయ నాయకుడు పొల్సాని సుగుణాకర్‌రావు అన్నారు. బుధవారం చైతన్యపురిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత దేశ జనాభాలో 70 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉన్నారని, అందులో 50 శాతానికి పైగా వ్యవసాయమే జీవనాధారంగా బ్రతుకుతున్నారని అన్నారు. రైతు ఆదాయం పెరగనిదే దేశ సమగ్ర అభివృద్ధి జరగదనే భావనతో రైతు, గ్రామీణ ప్రజల ఆర్థిక ప్రగతికై కిసాన్ గ్రామీణ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 9, 10, 11 తేదీల్లో కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపం ఆవరణలో నిర్వహిస్తున్న కిసాన్ గ్రామీణ మేళాలో రైతుల ఆర్థిక అభివృద్ధికై అధిక పంట పండే విత్తనాలు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, నిష్ణాతులతో కొత్తకొత్త పద్ధతులు లాంటి అనేక విషయాలు రైతులకు తెలపనున్నామని అన్నారు. సాంప్రదాయ పంటలతో పాటు పాడి, చేపలు, గొర్రెల పెంపకం లాంటి కొత్త పద్ధతులతో రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉందని, ఇలాంటి అనేక విషయాలపై నిష్ణాతులతో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కిసాన్ గ్రామీణ మేళా పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో కన్నబోయిన ఓదెలు, గడ్డం నాగరాజు, బేతి మహేందర్‌రెడ్డి, ఆనంద్, బ్రహ్మం, మొలుగూరి కిశోర్, కామరపు నరహరి, జితేందర్, శ్రీనివాస్, ప్రదీప్, జేడి భగవాన్, తిరుపతి, రమేశ్, శ్రీరాములు, మోహన్, సంపత్ పాల్గొన్నారు.

విద్యార్థిని పట్ల లెక్చరర్ అసభ్య ప్రవర్తన

- కళాశాలలో చితకబాదిన విద్యార్థిని తల్లిదండ్రులు
- వివరణ ఇవ్వాలని లెక్చరర్‌కు ప్రిన్సిపాల్ నోటీసు


విద్యార్థిని కాళ్లు మొక్కుతున్న అధ్యాపకుడు

జగిత్యాలక్రైం: జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న శ్రీనివాస్ అదే కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు తెలపడంతో విద్యార్థిని తల్లి కళాశాలకు చేరుకుని అధ్యాపకుడిని చితకబాదిన ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకోగా.. ఆలస్యంగా వెలుగు చూసింది. చివరకు అధ్యాపకుడు విద్యార్థిని కాళ్లు పట్టుకుని క్షమాపణ కోరాడు. సంఘటనపై ప్రిన్సిపల్ సదరు అధ్యాపకుడికి వివరణ ఇవ్వాలని నోటీసు జారీ చేశారు.


ప్రిన్సిపాల్ జారీ చేసిన నోటీసు








వినాయక.. వీడ్కోలిక

• సంబరంగా గణేశ్ నిమజ్జనం • బ్యాండ్ మేళాలు, కోలాటంతో హోరెత్తిన వీధులు • కేరింతలు, నృత్యాలతో యువత సందడి

కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు భక్తుల విశేష పూజలందుకున్న గణనాథుడిని బుధవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ప్రతీ వీధిలో డీజే పాటలు, డప్పుచప్పుళ్లు, భజనలు, కోలాటం, ఒగ్గుడోలు నృత్యాలు, డ్యాన్సులతో సందడి నెలకొంది. బ్యాండు మేళాలకు అనుగుణంగా యువతీ యువకుల నృత్యాలు అలరించాయి. నిమజ్జనం సందర్భంగా నగరంలోని టవర్‌సర్కిల్ ప్రాంతం కిక్కిరిసిపోయింది. గణేశుడి నిమజ్జనోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు పలు సంస్థలు సౌకర్యాలు కల్పించి తమ ఔదార్యాన్ని చాటుకున్నాయి. కొత్తపల్లి చెరువు, చింతకుంట ఎస్సారెస్పీ కాలువ, మానేరు వాగు, మానకొండూర్ చెరువుల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం జోరు వానలో ప్రశాంతంగా జరిగింది.

- కరీంనగర్‌కల్చరల్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి


కిసాన్‌నగర్‌లో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుని‌కి ఆలయ ప్రాంగణంలో నిమజ్జనోత్సవం


భక్తులకు ప్రసాదం అందజేస్తున్న ఎంపీ బండి సంజయ్


మట్టి గణపతితో చిన్నారి




జమ్ జమ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, సీపీ సుబ్బారాయుడు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్


డప్పు చప్పుళ్లు


యువతుల కేరింతలు





శోభాయాత్రలో విభిన్న వినాయకులు




మంత్రి గంగుల కమలాకర్ పూజలు


వీడ్కోలు పూజ నిర్వహిస్తున్న ఎంపీపీ


వేడుకల్లో సాన్వీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్, ప్రిన్సిపాల్


దుర్శేడ్‌లో నిమజ్జనోత్సవంలో పాల్గొన్న యువకులు


కొత్తపల్లిలో యువతుల సందడి


వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న కుటుంబసభ్యులు


దుర్శేడ్‌లో మట్టి వినాయక విగ్రహాలతో చిన్నారుల సందడి

ఘనంగా గణపతి మోదక హోమం



విద్యానగర్: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయ ప్రాంగణంలో గల లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం గణపతి మోదక హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నమోదు చేసుకున్న భక్తుల పేర్లు, గోత్రనామాలతో ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ ప్రత్యేక అర్చనలు చేశారు. పూజల్లో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు.

'పారమిత' విద్యార్థులకు సన్మానం



కొత్తపల్లి: అంతర్జాతీయ, జాతీయ పోటీల్లో అవార్డు పొందిన పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్ విద్యార్థులను బుధవారం పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు సన్మానించారు. నేషనల్ స్కిల్ ఎక్స్‌పోలో అగ్రికల్చరల్ ఎకో ఫ్రెండ్లీ ఆగ్రో మెషిన్‌ను ప్రదర్శించిన విద్యార్థులు శుభశ్రీ, సాహు, శ్రీయాస్, అమెరికాలో నిర్వహించిన విద్య మంజరి సంగీత పోటీల్లో అంతర్జాతీయస్థాయి మొదటి బహుమతి పొందిన పదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్ గంధం, హైదరాబాద్‌లోని మెలూహా మున్-2023 సదస్సులో అవార్డులు గెలుచుకున్న ఆర్.శైలేందర్‌పటేల్, విహాన్ కబ్రా, వి.రిత్విక్‌లు అవార్డులు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రాకేశ్, వీయూయం. ప్రసాద్, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు రితేష్ మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు రాము, పాత్రో, హరిప్రియ, సరిత, ఉపాధ్యాయులు లలిత్ మోహన్ సాహు, శివ రామకృష్ణ, శ్రేయ బెనర్జీ, జితుమణి శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి


నివాళి అర్పిస్తున్న మేయర్ సునీల్‌రావు


నివాళి అర్పిస్తున్న ఏఐఎఫ్‌బీ నాయకులు

కరీంనగర్/కరీంనగర్‌కార్పొరేషన్/కరీంనగర్‌రూరల్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 108వ జయంతిని కరీంనగర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత కొండ లక్ష్మణ్ బాపూజీ నిఖార్సైన తెలంగాణ వాది అని అన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం తన మంత్రి పదవికి రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నారని కొనియాడారు.

• నగరంలోని ఎన్టీఆర్ బైపాస్ వద్ద ఉన్న లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి మేయర్ సునీల్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, శానిటరీ సూపర్‌వైజర్ రాజమనోహర్, ఆర్‌వో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

• ఉజ్వల పార్క్ ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు గవ్వ వంశీధర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రజక విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంపల శ్రీనివాస్, తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ పెంట అజయ్, దాచుపల్లి వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయంలో..

• కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ చిత్రపటానికి ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, ఎంపీటీసీ వెంగల్‌దాసు శ్రీనివాస్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జువ్వాడి రాజేశ్వర్‌రావు, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్ సంపత్‌కుమార్, పీఆర్ ఏఈ రమణారెడ్డి, ఏపీవో శోభ, పీహెచ్‌సీ వైద్యురాలు ఇందు తదితరులు పాల్గొన్నారు.

బాలరాజు మృతి సీపీఐకి తీరని లోటు

కరీంనగర్: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) సీనియర్ నాయకుడు, రిటైర్డ్ ఆర్టీసీ టీఐ బండిపెల్లి బాలరాజు అకాల మరణం పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. బుధవారం తెల్లవారుజామున బాలరాజు మృతి చెందడంతో ఆయన మృతదేహంపై సీపీఐ జెండా కప్పి నివాళి అర్పించారు. బాలరాజు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని బెజ్జంకి గ్రామపంచాయతీ పరిధిలోని పాపన్నపల్లెకు చెందిన వారని, సీపీఐలో చేరినప్పటి నుంచి పేద ప్రజల కోసం పనిచేశారని అన్నారు. దేశిని చినమల్లయ్య, చాడ వెంకటరెడ్డిలు సీపీఐ అభ్యర్థులుగా శాసనసభకు పోటీ చేసినప్పుడు పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారని తెలిపారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పానగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు సృజన్ కుమార్, అశోక్, సురేందర్‌రెడ్డి, గూడెం లక్ష్మీ, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాజు, తిరుపతి, సదాశివ, రాజుతో పాటు బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, వివిధ పార్టీల నాయకులు గూడెల్లి తిరుపతి, మహేందర్‌రెడ్డి, అజయ్‌వర్మ పాల్గొన్నారు.

ఆర్‌పీల గౌరవ వేతనం పెంపు

కరీంనగర్ కార్పొరేషన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలో పనిచేస్తున్న రిసోర్స్‌పర్సన్స్ (ఆర్‌పీ)ల గౌరవ వేతనం పెరిగింది. గౌరవ వేతనం పెంచాలనే మెప్మా ప్రతిపాదనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్‌టీ నం.164, తేదీ:26.09.2023 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఆర్‌పీల గౌరవ వేతనం రూ.4వేలు ఉండగా, ఇక నుంచి రూ.6వేలు అందుకోనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో నగరపాలక సంస్థ పరిధిలో 154 మంది రిసోర్స్‌పర్సన్లు లబ్ధి పొందనున్నారు. మహిళా సమైఖ్యలకు సంబంధించిన లెక్కల నిర్వహణను (బుక్ కీపింగ్)ను ఆర్‌పీలు చేపడుతారు. కాగా తమ గౌరవ వేతనం రూ.6 వేలకు పెంచడంపై ఆర్‌పీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీతకు డాక్టరేట్


డాక్టరేట్ స్వీకరిస్తున్న సునీత

కరీంనగర్‌సిటీ: మహిళా డిగ్రీ, పీజీ కళాశాల బాటనీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రేగుల సునీతకు డాక్టరేట్ లభించింది. రామానంద్ తీర్థ్ మరాట్వాడ విశ్వవిద్యాలయం నాందేడ్‌లో స్టడీస్ ఆన్ ఇన్విట్రో కన్సర్వేషన్ అండ్ ప్రొపగేషన్ ఆఫ్ సెలెక్టెడ్ రేర్, ఎండెంజర్డ్ ప్లాంట్స్ ఫ్రం మరాట్వాడ రీజియన్ అంశంలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా సునీతను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. సునీత హుజూరాబాద్ ఆర్డీవో సోలిపేట రాజు సతీమణి కాగా కలెక్టరేట్ అధికారులు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

కూతురే కన్న కొడుకై తండ్రికి అంత్యక్రియలు


కొండయ్య(ఫైల్)


దుర్శేడ్‌లో తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కూతురు

కరీంనగర్‌రూరల్:కూతురే కన్న కొడుకుగా మారి తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన దృశ్యం గ్రామస్తులను కంటతడి పెట్టించింది. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉండటంతో పెద్ద కూతురు ముందుకొచ్చి అంత్యక్రియలు చేయడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కరీంనగర్ మండలం దుర్శేడ్‌కు చెందిన మడ్డి కొండయ్య(45) ఆటో నడిపిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. భార్య రేణుకతో పాటు ఇద్దరు కూతుర్లు అర్చన, అఖిల ఉన్నారు. పెద్ద కూతురు డిగ్రీ పూర్తి చేయగా మరో కూతురు డిగ్రీ చివరి సంవత్సరం చదువుతోంది. బుధవారం తెల్లవారుజామున కొండయ్యకు గుండెపోటు రావడంతో ఆకస్మికంగా మృతి చెందాడు. కొడుకులు లేకపోవడంతో పెద్ద కూతురు అర్చన తండ్రికి అంత్యక్రియలు నిర్వహించింది. ఇద్దరు కూతుర్లకు వివాహం చేయాల్సిన సమయంలో తండ్రి మృతిచెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. కుటుంబపెద్ద మృతితో దిక్కుతోచని స్థితిలో ఉన్న నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు.

చికిత్సపొందుతూ వాహనదారుడు మృతి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్ధుంపూర్ స్టేజీ వద్ద పదిహేనురోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ద్విచక్రవాహనదారుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కరీంనగర్‌రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కదంబాపూర్‌కు చెందిన కోడం అనిల్(29) కరీంనగర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ సోదరి సంగీత వద్ద ఉంటున్నాడు. ఈనెల 10న అనిల్ కరీంనగర్ నుంచి కదంబాపూర్‌కు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యలో మొగ్ధుంపూర్ స్టేజీ వద్ద రోడ్డుపై నిలిచి ఉన్న ఆటోను అనిల్ వెనుక నుంచి ఢీకొట్టి కిందపడి పోవడంతో తలకు తీవ్రగాయమైంది. చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. తలకు ఆపరేషన్ చేసినప్పటికీ ఆరోగ్య పరిస్థితి విషమించి బుధవారం తెలవారుజామున మృతి చెందాడు. నిర్లక్ష్యంగా రోడ్డుపై ఆటో నిలిపి ఉంచడంతోనే ప్రమాదం జరిగిందని, ఆటో డ్రైవర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని మృతుడి సోదరి సంగీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐఎంఎఫ్‌లో ఏపీ విద్యార్థినికి
అరుదైన గౌరవం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని రాజేశ్వరికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చైర్ ఆఫర్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులుగా ఐక్యరాజ్యసమితి (యూఎన్) సదస్సుకు వెళ్లిన ఏపీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంగళ వారం వాషింగ్టన్‌లోని ఇంటర్నేషనల్ మానిట రింగ్ ఫండ్ (ఐఎంఎఫ్) ప్రధాన కార్యాల యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణమూర్తి వి.సుబ్రమణ్యన్ విద్యార్థుల బృందంతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన నంద్యాలకు చెందిన లారీ డ్రైవర్ కుమార్తె చాకలి రాజేశ్వరికి తన చైర్ ఆఫర్ చేసి అందులో కూర్చోబెట్టారు. సుమారు 1.20 గం టల పాటు జరిగిన ఈ సమావేశంలో రాజేశ్వరి అదే చైర్‌లో కూర్చుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సుబ్రమణ్యన్ చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. 'నేను నా కార్యాలయంలో ఏపీ నుంచి వచ్చిన తెలివైన విద్యార్థులను కలు సుకోవడం చాలా ఆనందంగా ఉంది. వారం తా అత్యంత నిరాడంబరమైన నేపథ్యాల నుం చి వచ్చినవారు కావడం వల్ల భారతీయుడిగా గర్వపడుతున్నాను. విద్య ప్రాముఖ్యత ప్రతి భారతీయ కుటుంబం మనసులోకి ప్రవేశిం చింది'అంటూ సుబ్రమణ్యన్ ట్వీట్ చేశారు. దీనిపై సీఎం జగన్ స్పందిస్తూ 'వారిని ప్రోత్స హిస్తున్నందుకు ధన్యవాదాలు సుబ్రమణ్య న్‌గారూ! మిమ్మల్ని కలవడం, మీతో సంభా షించడం మన పిల్లలకు, ఆంధ్రప్రదేశ్ పిల్లలం దరికీ అపురూపమైన గౌరవం. మన పిల్లలు మన రాష్ట్రాన్ని, మన విద్యా విధానం సారాం శాన్ని ప్రపంచం మొత్తం చాటిచెప్పడాన్ని చూసి నేను గర్వపడుతున్నాను'అంటూ రీట్వీట్ చేశారు. ఐఎంఎఫ్ ఫస్ట్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గీతాగోపీనాథ్‌కు కూడా సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఐఎంఎఫ్ కార్యాలయంలో విద్యార్థులు గీతాగోపీనాథ్‌తో సమావేశమైన సందర్భంగా ఆమె 'ఐఎంఎఫ్‌కి ఏపీ విద్యార్థులను స్వాగతించడం నిజంగా ఆనందంగా ఉంది. వారి యూఎన్, యూఎస్ పర్యటనలో భాగంగా ఐఎంఎఫ్ ప్రధాన కార్యాలయానికి రావడం సంతోషిస్తున్నాను' అంటూ ఏపీ సీఎంను ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. దీనిపై స్పందించిన సీఎం జగన్.. 'మా పిల్లలను కలిసినందుకు, వారిని ఇంత ఆప్యాయంగా చూస్తున్నందుకు ధన్యవాదాలు' అంటూ గీతా గోపీనాథ్‌కు రీట్వీట్ చేశారు.

‘రింగ్’ అంతా లోకేశ్‌దే



- అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో లోకేశ్ కుట్ర సుస్పష్టం
- కోర్టులో దాఖలు చేసిన మెమోలో సిట్ వెల్లడి
- లోకేశ్ పాత్రను స్పష్టం చేస్తున్న 129 ఆధారాలు
- ఈ ఆధారాలను జప్తు చేసిన సిట్ అధికారులు
- అప్పటి అధికారులు, అలైన్‌మెంట్‌లో పాల్గొన్న సంస్థల వాంగ్మూలాలూ నమోదు

సాక్షి, అమరావతి

టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) అలైన్‌మెంట్ ఖరారు పేరిట జరిగిన భూ దోపిడీలో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుమారుడు లోకేశ్ కీలక పాత్ర పోషించినట్లు సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వెల్లడించింది. ఈమేరకు ఈ కేసులో లోకేశ్‌ను ఏ–14గా చేర్చినట్లు న్యాయస్థానానికి సమర్పించిన మెమోలో పేర్కొంది. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ పేరిట చంద్రబాబు, లోకేశ్ క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారని, తద్వారా తమ కుటుంబానికే చెందిన హెరిటేజ్ ఫుడ్స్‌కు, లింగమనేని కుటుంబానికి చెందిన భూముల విలువ అమాంతం పెరిగేలా అక్రమాలకు పాల్పడ్డారని నిర్ధారించింది.

129 ఆధారాలతో దొరికిన లోకేశ్

ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్పుల ద్వారా భారీ అక్ర మాలకు పాల్పడిన కేసులో సిట్ అధికారులు లోకేశ్ పాత్రకు సంబంధించి కీలకమైన 129 ఆధారాలను గుర్తించి, జప్తు చేయడం ప్రాధాన్యతను సంతరించు కుంది. వాటిలో సీఆర్‌డీఏ, మున్సిపల్, రెవెన్యూ శాఖలకు చెందిన కీలక పత్రాలు, ఈమెయిల్ సం దేశాలు, మ్యాపులతోపాటు మరికొన్ని కీలక ఆధారాలు ఉన్నాయి. అంతేకాదు.. టీడీపీ ప్రభుత్వం లో పని చేసిన అధికారులు, ప్రైవేటు ఏజెన్సీల ప్రతి నిధుల వాంగ్మూలాలను కూడా సిట్ అధికారులు నమోదు చేశారు. వారిలో కొందరు కీలక అధికారులు సంబంధిత నోట్ ఫైళ్లలో తాము లిఖితపూర్వకంగా తెలిపిన అభ్యంతరాలను బేఖాతరు చేసి మరీ ఐఆర్ ఆర్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారని పేర్కొనడం గమనార్హం. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌లో కీలక పాత్ర పోషించిన ప్రైవేటు ఏజెన్సీలు కూడా ఇదే విష యాన్ని తెలిపాయి. నిబంధనలకు విరుద్ధంగానే ఐఆర్ ఆర్ ఎలైన్‌మెంట్‌ను నిర్ధారించారని సిట్ అధికా రులకు ఈమెయిళ్లు పంపాయి. ఐఆర్ఆర్ అలైన్‌మెం ట్ కోసం నిర్వహించిన సర్వే నివేదికను కూడా సిట్ అధికారులు జప్తు చేశారు. వీటన్నింటిలో లోకేశ్‌దే కీలక పాత్ర అని సిట్ సేకరించిన ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి.

లింగమనేనితో క్విడ్ ప్రోకో.. హెరిటేజ్‌కు భూములు

టీడీపీ ప్రభుత్వంలో సీఎంగా ఉన్న చంద్రబాబు అధి కారిక నివాసంలోనే లోకేశ్ కూడా నివసించారు. రాజధాని ఎక్కడ నిర్మిస్తారన్నది ముందుగానే తెలియడంతో తాడేపల్లి, తుళ్లూరు, మంగళగిరి మం డలాల్లో ముందుగానే భూముల కొనుగోలు పేరిట దక్కించుకున్నారు. ఇక లింగమనేని రమేశ్ కుటుం బంతో క్విడ్‌ప్రోకోకు పాల్పడ్డారు. అందులో భాగం గా అమరావతిలో భూములు పొందారు. 2014 జులై 1న 7.21 ఎకరాలను కొనుగోలు చేస్తూ హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం 2014 జులై 7న ఆ భూములు రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం లింగమనేని రమేశ్ కుటుంబ సభ్యుల నుంచి 4.55 ఎకరాలు కొనుగోలు పేరిట దక్కించుకున్నారు. ఆ విషయం బయటకు పొక్కడంతో ఆ 4.55 ఎకరాలకు సేల్ అగ్రి మెంట్‌ను రద్దు చేసుకున్నారు. అనంతరం అధికారు లపై ఒత్తిడి తెచ్చి లింగమనేని, హెరిటేజ్ ఫుడ్స్ భూములకు దూరంగా వెళుతున్న ఐఆర్ఆర్ అలైన్ మెంట్‌ను మార్పించారు. లింగమనేని రమేశ్ కుటుం బానికి చెందిన 355 ఎకరాలు, హెరిటేజ్ ఫుడ్స్ భూములను ఆనుకొని ఐఆర్ఆర్ వెళ్లేలా అలైన్‌మెం ట్‌ను ఖరారు చేశారు. దాంతోపాటు చంద్రబాబు బినామీల పేరిట భారీగా కొల్లగొట్టిన భూములు, ఆయన ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న నారాయణ కుటుంబ సభ్యులు, బినామీల పేరిట కొల్లగొట్టిన 148 ఎకరాల విలువ అమాంతంగా పెరిగేలా కుట్రకు పాల్పడ్డారు. క్విడ్‌ప్రోకో కింద లింగమనేని రమేశ్ కృ ష్ణా నది కరకట్ట మీద ఉన్న బంగ్లాను చంద్రబాబుకు ఇచ్చారు. ఈ వివరాలన్నింటినీ పేర్కొంటూ సిట్ అధికారులు సమగ్రంగా దర్యాప్తు నిర్వహించి పూర్తి ఆధారాలతో న్యాయస్థానంలో మెమో దాఖలు చేశారు. దాంతో ఈ కేసులో తదుపరి పరిణామాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

హెరిటేజ్ అంటేనే నారా కుటుంబం

హెరిటేజ్ ఫుడ్స్ అంటే నారా చంద్రబాబు కుటుంబం.. చంద్రబాబు కుటుంబం అంటే హెరిటేజ్ ఫుడ్స్ అనేది బహిరంగ రహస్యం. అందుకే చంద్రబాబు సీఎంగా ఉన్న కాలంలో హెరిటేజ్ ఫుడ్స్‌కు అనేక ప్రయోజనాలు కలిగించారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చడం ద్వారా హెరిటేజ్ ఫుడ్స్‌కు అడ్డగో లుగా కల్పించిన ప్రయోజనం పెద్ద కుం భకోణమే. అందుకే ఈ కేసులో హెరిటేజ్ ఫుడ్స్‌ను ఏ–6గా సీఐడీ పేర్కొంది. ఈ కేసులో ఏ–1 చంద్రబాబు సతీమణి అయిన నారా భువనేశ్వరి హెరిటేజ్ ఫుడ్స్‌కు వైస్ చైర్ పర్సన్, ఎండీగా ఉండగా, ఏ–14గా ఉన్న లోకేశ్ భార్య బ్రాహ్మణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా ఉన్నారు. వారి ద్వారా హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీ వ్యవహారాలను పూర్తిగా చం ద్రబాబు, లోకేశే నిర్వహిస్తున్నారు. 56 శాతా నికిపైగా షేర్లు ఉండటంతో ఆ సంస్థ డైరెక్టర్ల బోర్డు అంతా ఆ కుటుంబం ఆధిపత్యంలోనే ఉంది. 23,66,400 షేర్లతో 10.20 శాతం వాటా లోకేశ్ పేరునే ఉంది. ఇక హెరిటేజ్ ఫుడ్స్ వైస్ చైర్‌పర్సన్ నారా భువనేశ్వరి 53,30,826 షేర్లతో 22.98 శాతం వాటా కలిగి ఉన్నారు. లోకేశ్ భార్య బ్రాహ్మణి పేరిట 1,01,00 షేర్లు, నందమూరి బాలకృష్ణ పేరిట 6,820 షేర్లు ఉన్నాయి. వారి సమీప బంధు వులు వి.గంగరాజు నాయుడుకు 0.25 శాతం , ఆయన భార్య వి.సుధా శారదకు 5.28 శాతం, మెగాడిడ్ కంపెనీకి 5.28 శాతం, నిర్వాణ హోల్డింగ్స్‌కు 11.09 శాతం వాటా ఉన్నాయి. సంస్థ డైరెక్టర్ల బోర్డులో సభ్యులుగా ఉన్న నారా భువనేశ్వరి, బ్రాహ్మణి, తుమ్మల వెంకటేశ్వరరావు మెగాడిడ్, నిర్వాణ హోల్డిం గ్స్‌లోనూ డైరెక్టర్లుగా ఉండటం గమనార్హం. ఇలా హెరిటేజ్ ఫుడ్స్ మొత్తం చంద్రబాబు కుటుంబం చేతిలోనే ఉంది.

- 25 ఏళ్లలోపు గ్రాడ్యుయేట్లలో 42శాతం మంది నిరుద్యోగులే
- కోవిడ్ తర్వాత నిరుద్యోగిత తగ్గినా.. కొత్తవారికి చాన్స్ తక్కువే
- మొత్తం వర్క్‌ఫోర్సులో ఎస్సీ,ఎస్టీ వర్కర్ల శాతం చాలా తక్కువే..మహిళలకు స్వల్పంగా పెరిగిన ఉద్యోగ అవకాశాలు
- అజీజ్ ప్రేమ్‌జీ వర్సిటీ నివేదికలో వెల్లడి..



పాతికేళ్లలోపు వారికి.. ఉద్యోగాల్లేవ్!

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ, ఇంజనీరింగ్ వంటివి పూర్తికాగానే ఏదో ఓ ఉద్యోగం కోసం వెతుకులాట తప్పదు. కొందరు పైచదువులకు వెళ్లినా చాలా మంది ఉద్యోగం కోసం చూస్తుంటారు. కానీ ఉద్యో గాలు దొరకని పరిస్థితి. దేశంలో పాతికేళ్ల వయ సులోపు పట్టభద్రుల్లో 42శాతం మంది ఇలా ఉద్యో గాల కోసం ఎదురుచూస్తున్నవారే. 25 ఏళ్లు దాటిన వారిలోనూ 15శాతం మంది నిరుద్యోగులే. కోవిడ్ నాటి పరిస్థితులు దాదాపు చక్కబడినా, భారత్ ఆర్థిక వృద్ధి వేగవంతమైందన్న అంచనాలున్నా.. కొత్తగా ఉద్యోగాల్లో చేరే గ్రాడ్యుయేట్లలో నిరుద్యో గిత శాతం ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగి స్తోందని నిపుణులు అంటున్నారు. అదే 35ఏళ్లు పైబడిన గ్రాడ్యుయేట్లలో 5 శాతమే నిరుద్యోగం ఉందని అంటున్నారు. ''స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇం డియా 2023: సోషల్ ఐడెంటీస్ అండ్ లేబర్ మార్కెట్ ఔట్ కమ్స్''పేరిట అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం తాజాగా విడుదల చేసిన నివేది కలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 'జాతీయ గణాం క సంస్థ, జాతీయ ఆర్థిక, కుటుంబ ఆరోగ్య సర్వేలు, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే, స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా, ఎంప్లాయ్‌మెంట్–అన్ ఎంప్లాయ్‌మెంట్ తదితర నివేదికల ఆధారంగా ఈ అధ్యయనం చేసి నట్టు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

ప్రేమ్‌జీ వర్సిటీ నివేదికలో ఏముందంటే..

- అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ అధ్యయన నివేదికలో పలు కీలక అంశాలు వెల్లడ య్యాయి. నివేదిక ప్రకారం.. దీర్ఘకాలికంగా చూస్తే భారత్‌లో జీడీపీ వృద్ధికి–ఉద్యోగాల వృద్ధికి సంబంధం లేకుండా పోయింది. వేగంగా జీడీపీ వృద్ధి సాధించేందుకు అనుసరించే విధానాలు వేగంగా ఉద్యోగాల కల్పనకు తోడ్పడటం లేదు.
- కరోనా సమయంలో చాలా మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోవడంతో.. జీవనం గడిపేందుకు మళ్లీ వ్యవసాయం, స్వయం ఉపాధి వైపు మళ్లారు. దీనితో ఈ రెండు రంగాల్లో 2020 ఏప్రిల్–జూన్ మధ్య ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఆ తర్వాత పురుషులకు సంబంధించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోవిడ్ ముందటి కాలానికి చేరు కోగా.. మహిళలకు కొంత మేర మాత్రమే అవకాశాలు వచ్చాయి.
- వ్యవస్థీకృత మార్పుల ప్రభావంతో.. కరోనా అనంతర కాలంలో వ్యవసాయం నుంచి పురుషులు వైదొలిగినా, నిర్మాణ రంగంలో అవకాశాలు వచ్చాయి. కానీ మహిళలు మాత్రం వర్క్‌ఫోర్స్ నుంచి వైదొలగాల్సి వచ్చింది. అయితే 2004 నుంచీ స్తంభించిపోయిన మహిళా ఉద్యోగిత శాతం.. 2019 తర్వాతి నుంచి కొంతమేర పెరిగింది.
- 2004లో క్యాజువల్ వేజ్ వర్కర్లతోపాటు వారి వారసులలో 80శాతం మంది అదే ఉపాధిలో ఉండగా.. 2019 నాటికి చాలా వరకు మార్పు వచ్చింది. కానీ ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో మాత్రం అలాగే కొనసాగుతోంది. అంతేకాదు 20 మందికిపైగా ఉద్యోగులున్న సంస్థల యజమానుల్లో ఎస్సీ, ఎస్టీలు చాలా తక్కువగా ఉన్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి..



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కూడా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. చాలా రంగాల్లో ఇప్పటికే పనిచేస్తున్న అనుభవజ్ఞులైన ఉద్యోగులనే కొనసాగిస్తున్నారు. చాలా దేశాల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు కూడా పెంచుతు న్నారు. సంస్థల మూసివేతలు పెరుగుతున్నాయి. యువకు లకు శిక్షణనిచ్చి, వారి నుం చి ఉత్పాదక పెంచే సేవలు అందుకోవడానికి జాప్య మయ్యే పరిస్థితిలో నైపుణ్యా లున్న పాతవారినే కొనసాగిస్తు న్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ, కోవిడ్ మహమ్మారి ప్రభావం చిన్న, మధ్యతరహా సంస్థలపై తీవ్రంగా పడింది. వాటిలో ఎస్సీ,ఎస్టీ వర్గాలకు చెందినవారు ఎక్కువగా ఉపాధి కోల్పోవడంతో ఆ వర్గాల్లో నిరు ద్యోగం పెరిగింది.

– డి.పాపారావు, ఆర్థిక, సామాజిక రంగాల విశ్లేషకులు

నైపుణ్యాల కొరతతోనూ సమస్య



దేశంలోని గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఇంగ్లి ష్‌లో తగిన ప్రావీణ్యం లేక ఇబ్బందులు పడుతు న్నారు. చదువుకుంటూ ఉద్యోగం చేసే అవకాశం, నైపుణ్యాలను పెంచుకునే అవకాశం వారికి తక్కువ. చిన్నదైనా ప్రభుత్వ ఉద్యోగం కావాలని కోరుకుం టున్నారు. పట్టణ ప్రాంతాల్లో నైపుణ్యాలను పెంపొందిం చుకునేందుకు, డిగ్రీ వం టివి పూర్తికాగానే డెలివరీ బాయ్స్, కాల్ సెంటర్ ఉద్యోగాలు వంటివి చేసేం దుకు అవకాశాలు ఉన్నాయి. కానీ చదు వుకు తగ్గ ఉద్యోగం కోసం ఎదురుచూడక తప్పడం లేదు. యువతలో నైపుణ్యాల కల్పనతోపాటు బీకామ్, బీఎస్సీ, బీఏ వంటి కోర్సులు చదివిన వారికి కూడా ప్రైవేట్ పరిశ్రమలు, సంస్థలు ఉద్యో గాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి.

– రమణ భూపతి, క్వాలిటీ థాట్‌గ్రూప్ చైర్మన్ –ఎడ్‌టెక్ కంపెనీ

చంద్రబాబుకు నో రిలీఫ్..!

▶ మొదటి పేజీ తరువాయి

సోమవారం జాబితా చేయాలని హరీశ్ సాల్వే అభ్యర్థించారు. అది సాధ్యం కాదని, వచ్చే వారం జాబితా చేస్తామని, ప్రాసెస్‌కు కొంత సమయం పడుతుందని జస్టిస్ ఖన్నా స్పష్టం చేశారు. జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి లేని ధర్మాసనంలో అక్టోబరు 3న ప్రారంభయ్యే వారంలో కేసును జాబితా చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

అలాంటి ఆదేశాలు ఇవ్వలేం.. ట్రయల్ కోర్టు జడ్జిని నియంత్రించలేం: సీజేఐ

చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను విచారించేందుకు జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి నిరాకరించారని, దీనిపై వెం టనే విచారణ జరిగేలా చూడాలని అనంతరం సీజేఐ ధర్మాసనం ఎదుట సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూత్రా అభ్యర్థించారు. అయితే ఈ అంశం లో లోతైన విచారణ చేయాల్సిన అవసరం ఉందని, వెంటనే విచారణ వద్దని సీఐడీ తరపు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ విన్నవించారు. ఈ దశలో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ జోక్యం చేసుకుంటూ.. 'అసలు మీకేం కావాలి? సెక్షన్ 17ఏతో బెయిలు కావాలని కోరుతున్నారా?' అని ప్రశ్నించడంతో చంద్రబాబు ఎస్సెల్పీపై విచారణ జరపాలని లూత్రా కోరారు. అయితే బెయిలు కావాలని దరఖాస్తు చేసుకోవచ్చుగా? అని సీజేఐ సూచించారు. దీనిపై లూత్రా స్పందిస్తూ ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండా చంద్రబాబును అరెస్టు చేశారని, 17 ఏ సెక్షన్ ప్రకారం గవర్నర్ అనుమతి కూడా తీసుకోలేదని చెప్పారు. దీంతో అక్టోబరు 3న విచారణ జాబితాలో చేర్చుతామని సీజేఐ తెలిపారు. సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను ట్రయల్ కోర్టు విచారిస్తోందని, చంద్రబాబును వారి కస్టడీకి ఇవ్వకుండా ఆదేశాలు ఇవ్వాలని లూత్రా కోరారు. ఇప్పటికే పోలీసు కస్టడీ పూర్తయిం దని, మరో 15 రోజులు పోలీసు కస్టడీ కోరుతున్నారని ఎన్నికల నేపథ్యంలో పదే పదే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారని లూత్రా ఆరోపించారు. తొలుత జ్యుడీషియల్ కస్టడీ తర్వాత పోలీసు కస్టడీకి ఇచ్చారన్నారు. ఈ క్రమంలో లూత్రా పదేపదే విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ, ఈ దశలో అలాంటి ఆదేశాలను ఇవ్వలేమని, ట్రయల్ కోర్టు జడ్జిని నియంత్రించలేమని, అక్టోబరు 3నే విచారణ జాబితాలో చేర్చుతామని సీజేఐ తేల్చి చెప్పారు.

దర్యాప్తు కొనసాగేలా చూడాలి

ఇదే సమయంలో సీఐడీ తరపు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ స్పందిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.కోట్లలో కుంభకోణం జరిగిందని సీజేఐ దృష్టికి తెచ్చారు. రూ.3,330 కోట్ల ప్రాజెక్టులో ప్రభుత్వం పది శాతం మాత్రమే వెచ్చిస్తుందంటూ నిధులు విడుదల చేశారన్నారు. ప్రైవేట్ సంస్థ 90 శాతం నిధులను ఇవ్వకుండానే ప్రభుత్వ వాటా పది శాతం నిధులు చేతులు మారిపోయాయన్నారు. సొమ్ములు స్వాహా అయినట్లు జీఎస్టీ అధికారులు కూడా గుర్తిం చారన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ కేసు నమోదు చేయడంతో గత ప్రభుత్వం ఫైళ్లు మాయం చేసిం దన్నారు. ముందస్తుగా గవర్నర్ అనుమతి తీసుకోవాలని పిటిషనర్ వాదించడం సరి కాదన్నారు. ఆ చట్ట సవరణ కన్నా ముందుగానే ఈ కుంభకోణం జరిగిందన్నారు. దర్యాప్తు కొనసాగేలా చూడాలని అభ్యర్థించారు.

కుండపోత వర్షం.. ఐదు గంటల నరకం

హైదరాబాద్‌లో రోడ్లు జలమయం.. భారీగా ట్రాఫిక్ జామ్



సాక్షి, హైదరాబాద్: నగరంలో సరిగ్గా అరగంట కుండపోత వర్షానికి..ఐదు గంటల పాటు నగర వాసులు నరకయాతన పడ్డారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత పలు ప్రాంతాల్లో ఈదురుగాలు లతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమై, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. ప్రధాన రోడ్లపై ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపో యాయి. కిలోమీటరు ప్రయాణానికి గంటల కొద్ది సమయం పట్టింది.బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, షేక్‌పేట, మెహిదీపట్నం, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి, యూసఫ్ గూడ, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, రాజేంద్రనగర్, మల్కాజిగిరి, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట తదితర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్యాంకుబండ్‌కు నిమజ్జనానికి వచ్చే వాహనాలకు మరింత ఆటంకం కలిగింది. ఇక గోల్కొండలో అత్యధికంగా 9.4 సెం టీమీటర్లు, రాజేంద్రనగర్‌లో 7.2, జూబ్లీహిల్స్‌లో 6.1, నాంపల్లిలో 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

చింతల్‌బస్తీ నాలాలో మొసలి పిల్ల

ఖైరతాబాద్: చింతల్‌బస్తీలో మొసలి కలకలం సృ ష్టించింది. బల్కాపూర్‌నాలా నుంచి మొసలి పిల్ల ఒడ్డుపైకి రావడంతో స్థానికులు భయాందోళన లకు గురయ్యారు. స్థానికులు ఫారెస్ట్ అధికారు లకు సమాచారం ఇవ్వగా..వారు ఘటనా స్థలికి చేరుకున్నారు. సుమారు నాలుగు గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 10 గంటలకు ఒడ్డుపై దాగి ఉన్న మొసలి పిల్లను గుర్తించారు. చివరకు దాన్ని బంధించి జూకి తరలించారు. దీం తో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



చంద్రబాబు జాతీయ నాయకుడు..
అలాంటి నేతలు చాలా తక్కువ

టీపీసీసీ చీఫ్ రేవంత్ వ్యాఖ్యలు



- రాష్ట్ర మంత్రి కేటీఆర్ బాగా బలిసి ఉన్నాడు.. ఆయనకు వాళ్ల ఓట్లు కావాలి కానీ.. హైదరాబాద్‌లో నిరసనలు చేయొద్దా?
- తెలంగాణ ఉద్యమ సమయంలో వైట్‌హౌస్ ముందు ఎందుకు ధర్నా చేశారు?
- తెలంగాణకు, అమెరికాకు ఏం సంబంధం?

సాక్షి, హైదరాబాద్: 'చంద్రబాబు అరెస్టు ఏపీకే పరి మితం కాదు. ఆయన జాతీయ నాయకుడు. అలాం టి నేతలు చాలా తక్కువ మంది ఉంటారు. ఏపీలో జరుగుతున్న పరిణామాలు, కేసుల గురించి నేను మాట్లాడదలుచుకోలేదు. తెలంగాణలో జరుగు తున్న నిరసనలు అడ్డుకోవడాన్ని మాత్రమే నేను వ్యతిరేకిస్తున్నా. రాష్ట్ర మంత్రి కేటీఆర్ బాగా బలిసి ఉన్నాడు. ఆయనకు వాళ్ల ఓట్లు కావాలి. కానీ సమస్య వస్తే ఆ రెండు పార్టీలదే అవుతుందా? తెలంగాణ ఉద్యమ సమయంలో వైట్‌హౌస్ ముం దు ఎందుకు ధర్నా చేశారు? అమెరికాకు, తెలంగా ణకు ఏం సంబంధం?..'అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టి మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో జరుగు తున్న నిరసనల విషయంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్య లపై స్పందించారు.

నిరసన తెలిపే హక్కు లేదంటే కాలితో తంతారు

'బీఆర్ఎస్ అవినీతిపై చర్చ వచ్చినప్పుడుల్లా కేటీ ఆర్ దిక్కుమాలిన చర్చ చేస్తాడు. వాళ్ల ఓట్లు కావాలి కానీ నిరసన తెలిపే హక్కు లేదంటే కాలితో తం తారు. నిరసన తెలిపే హక్కు, అధికారం ప్రజలకు ఉంది. చంద్రబాబును తాను తిట్టి పార్టీ ఎమ్మెల్యే లతో అరెస్టును ఖండించమని చెప్పడం.. అత్తను కత్తిరించమని, కోడలిని కొలవమని చెప్పినట్టు ఉం ది. కేటీఆర్ అతి తెలివితేటలు ప్రదర్శిస్తే మూతి పగ లకొడతారు. చంద్రబాబు అరెస్టుకు నిరసన తెలు పుతామంటే తప్పేముంది? వారు ఆస్తులను ధ్వం సం చేయడం లేదు కదా. ఒకవేళ లా అండ్ ఆర్డర్ సమస్య వస్తే పోలీసులు ఏం చేస్తారు? 'ఏపీ వారికి హైదరాబాద్‌లో పనేంటి? ఆందోళనలు వద్దు'అన్న కేటీఆర్ రేపు పాలమూరు ప్రజలు హైదరాబాద్‌లో ధర్నా చేస్తామంటే పాలమూరు వాళ్లు ఇక్కడెందుకు ఆందోళన చేస్తున్నారని కూడా అంటారు..'అని రేవంత్ అన్నారు.

పార్టీ పేరేమిటో కూడా కేటీఆర్‌కు స్పష్టత లేదు

'తుక్కుగూడలో జరిగిన కాంగ్రెస్ విజయభేరి సభ చూసిన తర్వాత సీఎం కేసీఆర్‌కు చలి జ్వరం వచ్చిం ది. ఎంఐఎం, బీఆర్ఎస్ లేని చోట బీజేపీకి ఓట్లు వేయించాలనేది అసద్ ఉద్దేశం. ఆయన విధానంపై ఆయనకు స్పష్టత ఉంది. కానీ కేటీఆర్‌కు తమ పార్టీ పేరేంటో కూడా స్పష్టత లేదు. ఓసారి బీఆర్ఎస్ అని, మరోమారు టీఆర్ఎస్ అని చెపుతున్నా రు..'అని ఎద్దేవా చేశారు.

బీసీలకు 34 సీట్లు

'బీసీలకు ఎన్నికల్లో 34 అసెంబ్లీ సీట్లు ఇచ్చే ప్రయ త్నం చేస్తున్నాం. సామాజిక న్యాయం చేయాలనేది కాంగ్రెస్ విధానం. బీసీ నేతలకు బీఆర్ఎస్ కంటే ఎక్కువ సీట్లు కాంగ్రెస్ పార్టీ ఇస్తుంది. బీఆర్ఎస్ అసంతృప్త ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గురువారం కాంగ్రెస్‌లో చేరతారు. ఆయన కుటుం బానికి రెండు టికెట్లు ఇవ్వాలని పార్టీ నిర్ణయించిం ది. వేముల వీరేశం కూడా పార్టీలోకి వస్తున్నారు. వైఎస్సార్‌టీపీ నాయకురాలు షర్మిల ఎపిసోడ్ నా దృష్టిలో లేదు. పార్టీ అధిష్టానం నాకు ఆ విషయం చెప్పలేదు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ మినహా మిగతా అన్ని పార్టీలతో కలిసి పనిచేయాలని కాం గ్రెస్ నిర్ణయం తీసుకుంది. కమ్యూనిస్టులు మాతో క్లోజ్‌గానే ఉన్నారు..'అని రేవంత్ వివరించారు.

విశాఖ వైపు ‘మెట్రో’ పరుగులు

జనవరి 15వ తేదీన మెట్రో ప్రాజెక్టుకు శంకుస్థాపన

సాక్షి, విశాఖపట్నం: ఏపీ కార్యనిర్వాహక రాజ ధానిగా మారబోతున్న విశాఖ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రజారవా ణా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు వడివ డిగా అడుగులు వేస్తోంది. నగరంలో మెట్రో రైల్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం చరిత్ర, సంస్కృతి, సంప్రదాయం ప్రతి బింబించేలా మెట్రో పిల్లర్లు నిర్మాణం చేపట్టే దిశగా ఆలోచన చేస్తోంది. మరోవైపు తొలి విడతలో 76.90 కి.మీ. మేర లైట్ మెట్రో నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈలోగా నిధుల సమీకరణను వేగవంతం చేయాలని ఏపీ సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి మెట్రో రైల్ కార్పొరేషన్‌కు మార్గదర్శకాలు జారీ చేశారు.

జనవరి 15న పునాది రాయి

వచ్చే ఏడాది జనవరి 15న మెట్రో రైలు పనులకు పునాది రాయి వేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచి స్తోంది. 42 మెట్రో స్టేషన్లతో కూడిన మూడు కారిడార్లను మొదటి దశలో నిర్మించాలని భావిస్తు న్నారు. కారిడార్–1లో స్టీల్‌ప్లాంట్ గేట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు 34.40 కి.మీ., కారిడా ర్–2లో గురుద్వార నుంచి పాత పోస్టాఫీస్ వరకు 5.07 కి.మీ., కారిడార్–3లో భాగంగా తాటిచెట్ల పాలెం నుంచి చినవాల్తేరు వరకూ 6.75 కి.మీ. మేర లైట్ మెట్రో కారిడార్ పూర్తి చేయాలని భావిస్తు న్నారు. ఆ తరువాత రెండో విడత కింద కారిడా ర్–4లో కొమ్మాది నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు 30.67 కి.మీ. మేర నిర్మించనున్నారు. ఈ నాలుగు కారిడార్లలో మొత్తం 54 స్టేషన్లు, రెండు డిపోలు ఏర్పాటు చేయనున్నారు.

బీచ్ రోడ్డులో ట్రామ్ కారిడార్

బీచ్ రోడ్డులో ట్రామ్ కారిడార్ ఒక మణిహారంగా రాబోతోంది. ప్రధాన జంక్షన్ల నుంచి అభివృద్ధి చెం దే ప్రాంతాలకు కూడా ట్రామ్ నడిపే యోచనలో ప్రభుత్వం ఉంది. 60.05 కి.మీ. మేర మోడ్రన్ ట్రామ్‌ని నడిపేందుకు 4 కారిడార్లు గుర్తించారు. కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకూ ట్రామ్ కారి డార్ ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా స్టీల్ ప్లాంట్ నుంచి అనకాపల్లి, ఎన్ఏడీ జంక్షన్ నుంచి పెందుర్తి వరకు ట్రామ్ కారిడార్ రాబోతోంది.

విశాఖ పోలీస్ కమిషనరేట్ అప్‌గ్రేడ్

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖ పోలీస్ కొత్త రూపుసంతరించుకోనుంది. నగర కమిషనరేట్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. త్వరలోనే విశాఖ నుంచి పరిపాలన ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.

ఈ క్రమంలో విశాఖకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా పరిపాలన రాజధానిగా విశాఖ మార నున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా నగరం లో పోలీస్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా విశాఖ పోలీస్ కమిషనరేట్ హోదాను ఐజీ స్థాయి నుంచి అడిషి నల్ డైరెక్టర్ జనరల్ స్థాయికి పెంచడంతోపాటు అదనపు పోస్టుల మంజూరుకు చర్యలు తీసుకుంటు న్నట్టు సమాచారం.

కొత్త సీపీ నియామకంతోనే సంకేతాలు

విశాఖపట్నంలో 1861 జనవరి 28న పోలీస్ వ్యవస్థ ప్రారంభమైంది. 1983 వరకు ఎస్పీ స్థాయి అధికారి మాత్రమే ఉండేవారు. ఆ తర్వాత కమిషరేట్‌ను ఇన్‌స్పెక్టర్ జనరల్ స్థాయికి అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి ఐజీ స్థాయి అధికారే విశాఖ నగర పోలీస్ కమిషనర్‌గా కొనసాగుతూ వచ్చారు. తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విశాఖను పరిపాలన రాజధానిగా చేయాలని భావించిన నేప థ్యంలో కొంతకాలంగా నగరంలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించింది. రాజధాని అవసరాలకు తగ్గట్టుగా నగర పోలీస్ వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించాలన్న నిర్ణయానికి వచ్చింది. ఇందుకు అనుగుణంగానే విశాఖ నగర పోలీస్ కమిషనర్‌గా ఉన్న ఐజీ స్థాయి అధికారి త్రివిక్రమ్ వర్మ స్థానంలో అడిషినల్ డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) స్థాయి అధికారి ఎ.రవిశంకర్‌ను నియమించింది. ఈ నియామకం ద్వారా కమిషనరేట్ హోదాను ఏడీజీ స్థాయికి పెంచుతున్నట్టు ప్రభుత్వం స్పష్ట మైన సంకేతాలు ఇచ్చిందనే అభిప్రాయం వ్యక్తమ వుతోంది.

త్వరలో కొత్త పోస్టుల మంజూరు

విశాఖ రాజధాని కానున్న నేపథ్యంలో నగర పోలీస్ శాఖలో కొత్త పోస్టుల మంజూరుపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా జాయింట్ కమిషనర్‌తోపాటు సీసీఎస్, టాస్క్‌ఫోర్స్‌కు అదనపు పోస్టులు మంజూరు చేసే అవ కాశం ఉందని సమాచారం.

నేడు ముహమ్మద్ ప్రవక్త జయంతి
మిలాద్ ఉన్ నబీ

చేయూత

మనసుకు చూపు ఉంటే
ఎదుటి వారి కష్టం కనపడుతుంది.
మనసుకు స్పందన ఉంటే
ఎదుటివారి సాయం కోసం మార్గం వేస్తుంది.
జహారా బేగంకు అలాంటి మనసు ఉంది.
అందుకే ఆమె అంధుల కోసం పని చేస్తూ ఉంది.
అంధుల క్రికెట్‌కు ప్రోత్సాహం అందిస్తోంది.
వారి మేచ్‌లు నిర్వహిస్తోంది.
ఆ సేవకు 'క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఆంధ్రప్రదేశ్'కు
చైర్ పర్సన్‌గా నియమితురాలైంది.
జహారా పరిచయం.



అంధ క్రికెటర్లతో జహారా బేగం

చూపున్న మనసు

'మనలో ఎవరైనా ఎప్పుడైనా అంధులు కావచ్చు. దృష్టి పోతే జీవితం ఎంత కష్టమో మనందరికీ తెలుసు. అందుకే దృష్టి లేని వారి గురించి ఎవరికి తోచినంత వారు పని చేయాలి' అంటుంది జహారా బేగం. తెనాలికి చెందిన జహారా తన తల్లి తాహెరా పేరున 'తాహెరా ఫౌండేషన్' స్థాపించి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అలాగే బెంగళూరు, హైదరాబాద్‌లలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తోంది. 'నేను నాలుగో క్లాస్‌లో ఉండగా నా క్లాస్‌మేట్ ఒకమ్మాయి మధ్యాహ్నం పూట ప్రసాదం తెచ్చుకుని తినేది. అన్నం ఉండేది కాదు. ఆ అమ్మాయి కోసం నేను మా అమ్మతో చెప్పి బాక్స్ తీసుకెళ్లేదాన్ని. చిన్నప్పటి నుంచి ఎందుకో ఎదుటివారికి సాయం చేయాలనే గుణం నాలో ఉంది. ఆ గుణాన్ని వయసు పెరిగే కొద్దీ కాపాడుకున్నాను' అంటుంది జహారా.



ఆటలంటే ఇష్టం

'మాది గుంటూరు. చిన్నతనం నుంచి ఆటలంటే ఇష్టం. బాస్కెట్‌బాల్ జాతీయస్థాయి ప్లేయర్‌గా ఆడాను. గుంటూరు మహిళా బాస్కెట్‌బాల్ జట్టు మాతోనే మొదలైంది. అయితే చదువులో కూడా చురుగ్గా ఉండి బాపట్లలో అగ్రికల్చర్ బీఎస్సీ చేశాను. ఆ తర్వాత అగ్రికల్చర్ ఎంఎస్సీ చేసి పీహెచ్‌డీ కోసం జర్మనీలో కొంత రీసెర్చి చేశాను. అక్కడి నుంచి తిరిగొచ్చాక నా మాతృమూర్తి పేరుతో తాహెరా ట్రస్ట్ ప్రారంభించి, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సామాజిక సేవల్లో మమేకమయ్యాను. ఆ సమయంలోనే బెంగళూరులోని 'సమర్థనం ట్రస్ట్ ఫర్ బ్లైండ్' చేస్తున్న పని నాకు నచ్చింది. వారితో కలిసి అంధుల కోసం పని చేయసాగాను. బెంగళూరులో విమెన్ బ్లైండ్ క్రికెట్ వర్క్‌షాపును నిర్వహించాను' అని తెలిపిందామె.

అంధుల కోసం

'అంధుల క్రీడలకు సాయం చేసేందుకు ముందుకు వచ్చేవారు చాలా తక్కువ. అంధుల క్రికెట్‌కు ప్రోత్సాహం అందించేవారూ తక్కువే. వారికోసం నేనెందుకు ఏదైనా చేయకూడదు అనుకున్నాను. అప్పటినుంచి నా చేయూత నిరవధికంగా సాగింది. అంతేకాదు, 'క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా' (సీఏబీఐ)లోనూ, 'టి20 వరల్డ్ కప్ క్రికెట్ ఫర్ బ్లైండ్–2017' పోటీల సమయంలోనూ చురుగ్గా పని చేసే అవకాశం కలిగింది. దాంతో ఇప్పుడు క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీబీబీఏపీ) చైర్‌పర్సన్‌గా నియమితురాలినయ్యాను. ఇది నాకు సంతోషంగా ఉంది' అని తెలిపిందామె.

అంధుల టి20

'2017లో దేశంలోని మెట్రో నగరాల్లో 2వ అంధుల టి20 వరల్డ్ కప్ క్రికెట్ పోటీలను సీఏబీఐ నిర్వహించింది. పది దేశాల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీలకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆర్గనైజింగ్ కమిటీ ఇన్‌చార్జ్‌గా నేను రెండు మ్యాచ్‌లను ఆంధ్ర, తెలంగాణలో నిర్వహించేందుకు చొరవ చూపాను. అలాగే 'తొలి విమెన్స్ నేషనల్ క్రికెట్ టోర్నమెంట్ ఫర్ బ్లైండ్ – 2019' న్యూఢిల్లీలో జరిగింది. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్ (సీఏబీఏపీ)కి నిధుల కొరత, స్పాన్సర్లు లేకపోవటం, క్రీడాకారిణుల లేమి గమనించాను. దాంతో ఆంధ్రప్రదేశ్ అంధ మహిళల క్రికెట్ జట్టు రూపకల్పనకు పూనుకున్నా. అనంతపురంలో రాష్ట్రస్థాయి అంధ మహిళల క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహించాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంధ మహిళల క్రికెట్ జట్టు ఎంపికకు సహకారం అందించాను.. ఇటీవల యూకేలో జరిగిన ఐబీఎస్ఏ టోర్నమెంటులో విజేతగా నిలిచిన ఇండియా జట్టులో మా శిక్షణలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు ఉండటం నాకు చాలా సంతోషంగా ఉంది' అని తెలిపిందామె.

అంధుల క్రికెట్ గురించి....

'అంధుల క్రికెట్ డిఫరెంట్‌గా ఉంటుంది. బ్యాట్, వికెట్లు అన్నీ ఒకలాగే ఉంటాయి. బంతి మాత్రం వైవిధ్యంగా తయారు చేస్తారు. ఇందులో ఉండే బేరింగ్స్ చేసే శబ్దాన్ని ఆధారంగా బాట్స్‌మెన్ ఆడతారు. బౌలింగ్ సాధారణ క్రికెట్‌లోలా భుజంపైనుంచి కాకుండా దిగువ నుంచి వేస్తారు. క్రికెట్ జట్టులో బీ1, బీ2, బీ3 అనే మూడు కేటగిరీల వారుంటారు. బౌలరు, బ్యాట్స్‌మెన్ పూర్తిగా అంధులై ఉంటారు. మిగిలినవారు పాక్షికంగా అంధులు. వీరు ఆడే మైదానం 50 గజాలు మాత్రమే. నిబంధనలన్నీ మామూలే. సీఏబీఐలో 25 వేల మంది సభ్యులున్నారు' అని తెలిపిందామె.

తన సేవా కార్యక్రమాలను అమెరికాకు కూడా విస్తరించిన జహారా అక్కడ చిన జీయర్ నేత్రాలయం కోసం నిధులు సేకరించడంతో తనవంతు సహకారం అందించారు.

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి



మానవాళికి దారి దీపం

మానవుల మార్గదర్శనం కోసం అల్లాహ్ అన్ని కాలాల్లో, అన్నిజాతుల్లో తన ప్రవక్తలను ప్రభవింపజేశాడు. గ్రంథాలనూ అవతరింప జేశాడు. హజ్రత్ ఆదం (అ) మొదలు, ముహమ్మద్ ప్రవక్త (స) వరకు అనేక మంది సందేశహరులు భూమండలంపై జన్మించారు. వారిలో చిట్టచివరి దైవప్రవక్త ముహమ్మద్ (స). ఆయనపై అవతరించిన చివరి గ్రంథం పవిత్ర ఖురాన్ . ఇక ప్రళయకాలం వరకూ ప్రవక్తలూ రారు, గ్రంథాలూ అవతరించవు. కనుక మానవులు ప్రళయకాలం వరకు ఆయనను అనుసరించవలసిందే. ముహమ్మద్ ప్రవక్త తనంత తాను ఏమీ బోధించలేదు. మానవుల సంక్షేమం కోసం, సాఫల్యం కోసం దైవం అవతరింపజేసిన హితోపదేశాలనే ఆయన మానవాళికి అందజేశారు. మనిషి పుట్టింది మొదలు మరణించే వరకు వివిధ దశల్లో, వివిధ రంగాల్లో ఎలా నడుచుకోవాలో, ఏది హితమో, ఏది హితం కాదో ఆచరణాత్మకంగా ఆయన వివశద పరిచారు. అందుకే ఆయన ప్రపంచ మానవాళికి సంపూర్ణ మార్గదర్శిగా పరిచయమయ్యారు. ఈ నేపథ్యంలో ఆ మహనీయుని పవిత్ర జీవనానికి సంబంధించిన కొంత సమాచారాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం. దాదాపు 1450 సంవత్సరాల క్రితం అరేబియా దేశంలోని మక్కానగరంలో ముహమ్మద్ ప్రవక్త (స) జన్మించారు. ఆమినా, అబ్దుల్లాహ్ తల్లిదండ్రులు. పుట్టక ముందే తండ్రినీ, ఆరేళ్ళ ప్రాయంలో అమ్మనూ కోల్పోయారు. తాతయ్య ఆయన్ని పెంచారు. చిన్నతనం నుంచే అనేక సుగుణాలను పుణికి పుచ్చుకున్న ముహమ్మద్ ప్రవక్త, 'అమీన్'గా, 'సాదిఖ్'గా వినుతికెక్కారు. ఆయన గొప్ప మానవతావాది. సంస్కరణశీలి. ఉద్యమనేత. అతి సాధారణ జీవితం గడిపిన సామ్రాజ్యాధినేత. జ్ఞానకిరణాలు ప్రసరింపజేసిన విప్లవ జ్యోతి. ప్రాణశత్రువును సైతం క్షమించిన కారుణ్య కెరటం. సుమారు వెయ్యిన్నర సంవత్సరాలంటే.. ఆ సమాజం ఎంత అనాగరికంగా ఉండేదో నేటి ఆధునికులకు తెలియనిదేం కాదు. ప్రవక్త జననానికి ముందు నాటి సమాజంలో 'కర్రగలవాడిదే బర్రె' అన్నట్లుగా బలవంతుడు బలహీనుణ్ణి పీక్కుతినేవాడు. స్త్రీల హక్కుల విషయం కాదుగదా అసలు వారికంటూ ఓ వ్యక్తిత్వం ఉన్న విషయాన్నే వారు అంగీకరించే వారు కాదు. స్త్రీని విలాస వస్తువుగా, అంగడి సరుకుగా భావించేవారు. అలాంటి జాతిని అన్ని విధాలా సంస్కరించి, వారిని మంచి మనుషులుగా తీర్చిదిద్దిన ఘనత ముహమ్మద్ ప్రవక్తకే దక్కింది. నాటి సమాజంలో లేని దుర్మార్గమంటూ లేదు. అలాంటి ఆటవిక సమాజాన్ని నిరక్షరాస్యులు అయిన ముహమ్మద్ ప్రవక్త సమూలంగా సంస్కరించి, ఒక సత్సమాజంగా ఆవిష్కరించారు.

వ్యాపార లావాదేవీల్లో, ఇచ్చి పుచ్చుకోవడాల్లో లెక్కాపత్రాలు, కొలతలు, తూనికలు చాలా ఖచ్చితంగా, నికార్సుగా ఉండాలి. స్వార్థాన్ని, అహాన్ని త్యజించాలి. తోటి మానవ సోదరులను తమకన్నా తక్కువగా చూడకూడదు. స్త్రీ జాతిని గౌరవించాలి. ఆమె మీకు జన్మనిచ్చిన తల్లి. ఆత్మీయత కురిపించే చెల్లి. ప్రేమించే ఇల్లాలు. అమ్మ పాదాల చెంత స్వర్గం ఉంది. వితంతువుల్ని చిన్నచూపు చూడకూడదు. సమాజంలో వారికి గౌరవప్రదమైన స్థానం దక్కాలి. శుభ కార్యాల్లో వారినీ ఆహ్వానించాలి. వితంతువుల పునర్వివాహం వారి హక్కు. అజ్ఞానకాలపు దురాచారాలు, దుర్మార్గాలన్నింటినీ నేను అంతం చేస్తున్నాను. ఒక మనిషికి మరో మనిషిపై ఎలాంటి ఆధిక్యతా లేదు. మానవులంతా ఒక్కటే. విద్యార్జన స్త్రీలు, పురుషులు అందరి విధి. జ్ఞానం జీవితం.. అజ్ఞానం మరణం. కళ్ళున్న వాళ్ళు, గుడ్డివాళ్ళు సమానం కానట్లే, జ్ఞాన సంపన్నులు, జ్ఞాన విహీనులు సమానం కాలేరు. ప్రతి తల్లీ దండ్రీ తమ సంతానానికి విద్య నేర్పాలి. భావితరాల సంక్షేమానికి ఇది చాలా అవసరం. అధికార దుర్వినియోగం చేయకూడదు. పరిపాలన అంటే కేవలం ప్రజాసేవ మాత్రమే... పాలకుడు అంటే ప్రజలకు సేవకుడు అని భావించాలి. ప్రతినిత్యం ప్రజలకు జవాబుదారుగా దైవానికి భయపడుతూ జీవించాలి. ఇక్కడ మనం పలికే ప్రతి మాటకు, చేసే ప్రతిపనికీ రేపు దైవం ముందు సమాధానం చెప్పుకోవాలన్న భావన కలిగి ఉండాలి. ఇలాంటి భావనలే మానవులను మంచివారుగా, నిజాయితీ పరులుగా, సౌశీల్యవంతులుగా తీర్చిదిద్దుతాయి. ఇటువంటి బాధ్యతాభావాన్ని, జవాబుదారీ తనాన్ని ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం ప్రజల మనసుల్లో నూరిపోసి, మానవీయ విలువలతో తులతూగే ఓ చక్కని సత్సమాజాన్ని ఆవిష్కరించారు. అందుకే ఆయన మానవాళికి ఆదర్శమయ్యారు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

ప్రవక్త బోధనల ప్రకారం...

మానవులు తమ సృష్టికర్తను మాత్రమే ఆరాధించాలి. ఆయనకు మాత్రమే భయపడాలి. తోటిమానవుల్ని, సమాజాన్ని ప్రేమించాలి. స్త్రీలను గౌరవించాలి. ఎలాంటి స్థితిలోనూ నీతినీ, న్యాయాన్ని విస్మరించకూడదు. అనాథలను, వృద్ధులను ఆదరించాలి. తల్లిదండ్రులను సేవించాలి. వారిపట్ల విధేయత కలిగి ఉండాలి. బంధువులు, బాటసారులు, వితంతువులు, నిస్సహాయుల పట్ల తమ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలి. సంఘంలో ఒక మనిషికి మరో మనిషిపై పడే విధ్యుక్త ధర్మాల పట్ల ఉపేక్ష వహించకూడదు. అన్యాయం, అధర్మ సంపాదనకు ఒడికట్టవద్దు. ధనాన్ని దుబారా చేయవద్దు. వ్యభిచారం దరిదాపులకు పోవద్దు. దానికై పురిగొలిపే అన్నిరకాల ప్రసార ప్రచార సాధనాలను రూపుమాపాలి. నిష్కారణంగా ఏ ప్రాణినీ చంపవద్దు. ప్రజల ధన, మాన, ప్రాణాలు సురక్షితంగా లేని సమాజం ప్రగతిని సాధించలేదు. సదా సత్యమే మాట్లాడాలి. చేసిన వాగ్దానాలు నెరవేర్చాలి. వాగ్దాన భంగానికి పాల్పడకూడదు. పలికే ప్రతి మాటకూ, చేసే ప్రతి పనికీ సమాధానం చెప్పకోవలసి ఉంటుంది.

సినిమా

ఆస్కార్ నామినేషన్ వరదలో తేలిన 2018

● 96వ ఆస్కార్ అవార్డ్స్ నామినేషన్‌కు '2018' సినిమా

విపత్కర పరిస్థితుల్లో అందరి కులం, మతం ఏదీ అంటే అది మానవత్వమే అనే సందేశంతో 2018 కేరళ వరదల ఆధారంగా తెరకెక్కిన మలయాళ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ '2018: ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో'. ఈ చిత్రం ఆస్కార్ నామినేషన్ బరిలో నిలిచింది. 2024 మార్చిలో జరగనున్న 96వ ఆస్కార్ అవార్డ్స్‌లోని ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో భారత దేశం తరఫున '2018: ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో'ను నామినేషన్‌కు పంపిస్తున్నట్లు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. పలు భాషల్లో 22 చిత్రాలను పరిశీలించిన 16 సభ్యులతో కూడిన జ్యూరీ '2018...'ని ఎంపిక చేసినట్లు జ్యూరీ చైర్మన్ గిరీష్ కాసరవల్లి వెల్లడించారు.

2018లో కేరళలో సంభవించిన భయంకరమైన వరదల నేపథ్యంలో జూడ్ ఆంథోనీ జోసెఫ్ దర్శకత్వం వహించిన '2018' గత ఏడాది మే 5న కేరళలో విడుదలైంది. టొవినో థామస్, అసిఫ్ అలీ, కుంచకో బోబన్, నరేన్, లాల్, వినీత్ శ్రీనివాసన్, అజు వర్గీస్, అపర్ణా బాలమురళీ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మలయాళ చిత్రం తెలుగు అనువాదం మే 26న విడుదలైంది. దాదాపు రూ. 30 కోట్ల బడ్జెట్‌తో వేణు కున్నపిళ్లై, సీకే పద్మకుమార్, జూడ్ ఆంథోనీ నిర్మించిన ఈ చిత్రం రూ. 200 కోట్ల గ్రాస్ వసూళ్లతో మలయాళంలో ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. తెలుగులోనూ సూపర్ హిట్.

2018 కథేంటి?

కేరళలోని అరువిక్కుళం గ్రామానికి చెందిన అనూప్ (టొవినో థామస్) ఇండియన్ ఆర్మీలో చేరి, అక్కడి పోరాటాల్లో చనిపోతున్న తోటి జవాన్లను చూసి భయపడి తిరిగొచ్చేస్తాడు. దుబాయ్ వెళ్లేందుకు వీసా కోసం ట్రై చేస్తుంటాడు. ఈలోపు ఆ ఊరికి చెందిన టీచర్ మంజు (తన్వీ రామ్)తో అతని వివాహం కుదురుతుంది. మరోవైపు కేరళలోని సముద్ర తీర ప్రాంతంలో జీవిస్తుంటాడు నిక్సన్ (అసిఫ్ అలీ). అతని తండ్రి (లాల్), అన్నయ్య (నరేన్) మత్స్యకారులుగా జీవనం సాగిస్తుంటారు. పెద్ద మోడల్ కావాలనేది నిక్సన్ లక్ష్యం. షాజీ (కుంచకో బోబన్) ప్రభుత్వ అధికారి. రమేశన్ (వినీత్ శ్రీనివాసన్) ఐటీ ఉద్యోగి. కేరళ సరిహద్దులోని తమిళనాడు గ్రామవాసి సేతుపతి (కలైయరసన్) లారీ డ్రైవర్. ఓ ప్రముఖ విదేశీ యూ ట్యూబర్‌కు కేరళ తిప్పి చూపించే టాక్సీ డ్రైవర్ కోషి (అజు వర్గీస్). ఇలా ఎవరి జీవితాలు వారివి. కానీ భారీ వరదలు వీరందరి జీవితాలను కష్టాలపాలు చేస్తాయి. అసలు జీవిస్తామో లేదో అనే విపత్కర పరిస్థితుల్లో ఒకరికొకరు ఏ విధంగా సాయం చేసుకుంటారు? జీవించడం కోసం ఎలాంటి పోరాటాలు చేస్తారు? అనేది కథ.

ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో (ప్రతి ఒక్కరూ హీరోనే).. '2018' క్యాప్షన్ ఇది. ఆపత్కాలంలో మానవత్వంతో ప్రతి ఒక్కరూ హీరోగా మారితే ఎలా ఉంటుందనే అంశాన్నే ఈ సినిమా ద్వారా దర్శకుడు జూడ్ ఆంథోనీ జోసెఫ్ చూపించారు. గర్భవతిని హెలీకాప్టర్ ఎక్కించే సీన్, దివ్యాంగుడైన కొడుకును కాపాడుకునేందుకు తల్లిదండ్రులు పడే ఆరాటం, సర్టిఫికెట్ల కోసం నిక్సన్ చేసే సాహసం, వరద సీన్స్.. ఇలాంటివి ప్రేక్షకుల హృదయాలను తాకుతాయి. నటీనటులు తమ పాత్రల్లో జీవించారు. నోబిన్ పాల్ సంగీతం, అఖిల్ జార్జ్ ఛాయాగ్రహణం, చమన్ చాకో ఎడిటింగ్, గ్రాఫిక్ వర్క్స్.. ఇలా అన్నీ బాగా కుదిరాయి.



'2018..'ని చాలా కష్టపడి చేశాం. ఈ సినిమా షూటింగ్ నా లైఫ్‌లో బెస్ట్ మూమెంట్స్‌గా చెబుతాను. ఈ సినిమాకు ప్రజలు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు. కొంత మంది ఏడ్చారు. సహకరించిన టీమ్‌కి, ఆదరించిన ప్రేక్షకులకు థ్యాంక్స్.
– జూడ్ ఆంథోనీ జోసెఫ్



● జూడ్ ఆంథోనీ జోసెఫ్

హిందీ చిత్రాలు 'కేరళ స్టోరీ, రాఖీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ, మిస్సెస్ చటర్జీ వర్సెస్ నార్వే, గదర్ 2, అబ్ తో సబ్ భగవాన్ భరోసే, స్టోరీ టెల్లర్, మ్యూజిక్ స్కూల్, ట్వల్త్ ఫెయిల్, ఘూమర్, తెలుగు చిత్రాలు 'దసరా, బలగం', మరాఠీ చిత్రాలు 'వాల వి, బాపా ల్యాక్', తమిళ చిత్రాలు 'విడుదలై: పార్ట్ 1, 1947, ఆగస్టు 16' వంటివి దేశం తరఫున ఆస్కార్ నామినేషన్ ఎంట్రీ పోటీలో నిలిచినట్లుగా తెలుస్తోంది. ఆ చిత్రాలను దాటుకుని ఆస్కార్ నామినేషన్ వరదలో '2018: ఎవ్రీ వన్ ఈజ్ ఏ హీరో' నామినేషన్ బరిలో నిలిచింది. మరి.. ఈ చిత్రం నామినేషన్ దక్కించుకుంటుందా? అనేది తెలియాలంటే భారతీయ కాలమానం ప్రకారం జనవరి 24 వరకూ వెయిట్ చేయాలి. ఆ రోజే నామినేషన్స్ ప్రకటిస్తారు.

డేట్ ఫిక్స్

రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఈగల్'. ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్, కావ్యా థాపర్ హీరోయిన్లు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న 'ఈగల్' చిత్రాన్ని 2024 జనవరి 13న సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు ప్రకటించి, రవితేజ పోస్టర్ రిలీజ్ చేశారు. ''ఈ సినిమాలో రవితేజ మల్టీ షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: దవ్‌జాంద్, కెమెరా–ఎడిటింగ్–దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.



● రవితేజ

సగం సినిమా పూర్తి



● విజయ్ దేవరకొండ

'గీత గోవిందం' వంటి హిట్ చిత్రం తర్వాత హీరో విజయ్ దేవరకొండ, డైరెక్టర్ పరశురామ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'వీడీ 13' (వర్కింగ్ టైటిల్). మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న 54వ సినిమా ఇది. ఈ సినిమా షూటింగ్ 50 శాతం పూర్తయింది. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. త్వరలో టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేస్తాం. 2024 సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కేయూ మోహనన్, సంగీతం: గోపీసుందర్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: వాసూ వర్మ.

యాక్షన్ సినిమాలపై మరింత గౌరవం పెరిగింది

– శ్రీ లీల



''యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న సినిమా 'స్కంద'. ఇందులో నా పాత్రలో సరదా, భావోద్వేగ సన్నివేశాలు ఉంటాయి. కాలేజ్ డ్రామా కూడా ఉంది. మాస్ ఎలిమెంట్స్, ఫైట్స్‌ని అద్భుతంగా చూపించడంలో బోయపాటిగారి మార్క్ కనిపిస్తుంది. 'స్కంద' చేస్తున్నప్పుడు యాక్షన్ సినిమాలపై మరింత గౌరవం పెరిగింది'' అని శ్రీ లీల అన్నారు. రామ్ పోతినేని హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన చిత్రం 'స్కంద'. జీ స్టూడియోస్ సౌత్, పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా చిత్రకథానాయిక శ్రీ లీల చెప్పిన విశేషాలు.

● 'స్కంద'లో నా పాత్రలో మాస్, క్లాస్ రెండూ మిక్స్ అయ్యుంటాయి. ఇందులో కొన్ని సీన్స్ నా రియల్ లైఫ్‌కి దగ్గరగా ఉంటాయి. ముఖ్యంగా మాస్ సీన్స్.

● ధమాకా'లో నా డ్యాన్స్‌లకు అంత పేరు వస్తుందనుకోలేదు. 'స్కంద' పాటల్లో మాస్, వెస్ట్రన్ డ్యాన్సులు అలరిస్తాయి. రామ్‌గారి డ్యాన్స్‌ని మ్యాచ్ చేయడం కష్టం. శ్రీనివాసా చిట్టూరిగారు ఈ సినిమాని గ్రాండ్‌గా నిర్మించారు. 'స్కంద' బోయపాటిగారి మార్క్‌లో గ్రాండ్‌గా ఉంటుంది. ఇంత మాస్ యాక్షన్ సినిమా చేయడం నాకిదే తొలిసారి. అలాగే పవర్‌ఫుల్ డైలాగ్స్ చెప్పడం కూడా మొదటిసారే.

● 'పెళ్లి సందడి' తర్వాత 'స్కంద'తో పాటు మరో రెండు మూడు సినిమాలు ఒప్పుకున్నాను. ఇప్పుడు దాదాపు ఎనిమిది సినిమాలు ఉన్నాయి. ఇన్ని అవకాశాలు రావడానికి కారణం ఇండస్ట్రీ, ప్రేక్షకులు చూపిస్తున్న అభిమానమే. ఆ ప్రేమను మంచి సినిమాలు చేయడం ద్వారా తిరిగి ఇవ్వాలన్నదే నా తపన.

ఆ ఫీల్ వేరే లెవల్!

– విరాట్ కర్ణ

విరాట్ కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన చిత్రం 'పెదకాపు'. ఈ చిత్రం తొలి భాగం 'పెదకాపు 1' ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకర్ల సమావేశంలో విరాట్ కర్ణ చెప్పిన విశేషాలు.

● చిన్నతనంలో క్రికెటర్ కావాలనుకున్నాను. కానీ కాలేజ్ పూర్తయ్యాక 'జయ జానకి నాయక' సినిమా ప్రొడక్షన్‌లోకి వచ్చాను. నాలో నటించే ప్రతిభ కూడా ఉందని నిరూపించేందుకు ఓ యాక్షన్ షార్ట్ ఫిల్మ్‌ను తీసుకువచ్చి మా బావ (మిర్యాల రవీందర్ రెడ్డి)గారికి చూపించాను. అది దర్శకులు శ్రీకాంత్‌గారికి కూడా నచ్చడం, 'పెదకాపు' సినిమాకు ఓ కొత్త కుర్రాడిగా నేను నప్పుతానని ఆయన అనడంతో ఈ సినిమా మొదలైంది.

● ఈ సినిమాలో పెదకాపుగా నటించాను. 1980 బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా కథ జరుగుతుంది. అనేక సవాళ్లను ఎదుర్కొంటూ బలవంతుడితో పోరాడి ఓ సామాన్యుడు ఎలా ఎదిగాడు? అన్నదే 'పెదకాపు' కథ.

● ఈ సినిమాకు నిర్మాత రవీందర్‌రెడ్డి గారు కాకపోయినట్లయితే ఇంత కాన్వాస్ దొరికేది కాదేమో. ఈ సినిమాలోని ఓ యాక్షన్ ఎమోషనల్ సీన్‌ని నేను బాగా చేశానని, నన్ను గ్రేడ్ ఏ యాక్టర్‌గా సర్టిఫై చేస్తున్నట్లుగా పీటర్ హెయిన్స్‌గారు అన్నారు. అక్కడే ఉన్న రెడ్డిగారి కళ్లలో నీళ్ల తిరిగాయి.

● నేను ప్రభాస్‌గారికి ఫ్యాన్‌ని. ఈ సినిమా రిలీజ్ తర్వాత ఈ చిత్రంపై ప్రభాస్‌గారు స్పందిస్తే నా ఫీల్ వేరే లెవల్‌లో ఉంటుంది. త్వరలో 'పెదకాపు 2' స్టార్ట్ షూటింగ్ ఆరంభమవుతుంది.



నా జీవితమే సినిమాలా ఉంటుంది

– ముత్తయ్య మురళీధరన్



"నా బయోపిక్‌గా '800' అనుకున్నప్పుడు స్క్రిప్ట్ నాలుగైదుసార్లు చదివా. ఇందులో ఎటువంటి మసాలా ఉండకూడదనే విషయాన్ని దర్శక-నిర్మాతలకు ముందుగానే చెప్పాను. నిజమైన కథ లేకపోతే అది బయోపిక్ కాదు. నా జీవితమే సినిమాలా ఉంటుంది. నా జీవితంలో ఎత్తుపల్లాలు ఎలా అయితే ఉన్నాయో.. '800' విడుదల వెనక అలాగే ఎత్తుపల్లాలు ఉన్నాయి" అని శ్రీలంక ప్రముఖ క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్ అన్నారు. ఆయన జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం '800'. ముత్తయ్యగా మధుర్ మిట్టల్ నటించారు. ఎంఎస్ శ్రీపతి దర్శకత్వంలో మూవీ ట్రైన్ మోషన్ పిక్చర్స్ నిర్మించింది. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో అక్టోబర్ 6న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ముత్తయ్య మురళీధరన్ విలేకరులతో పంచుకున్న విశేషాలు.

మీ బయోపిక్ గురించి చెప్పినప్పుడు ఏమనిపించింది?

నా జీవితాన్ని సినిమాగా తీయాలని ఎప్పుడూ అనుకోలేదు. శ్రీలంక ప్రజలకు సహాయం చేయడం కోసం 20 ఏళ్ల క్రితం ఓ ఫౌండేషన్ స్థాపించి, ఎంతో మందికి సాయం అందించాం. శ్రీలంకలోని తమిళ ప్రజలకు సాయం చేయడానికి దర్శకుడు వెంకట్ ప్రభు 2008లో వచ్చారు. ఆయనతో పాటు '800' చిత్రదర్శకుడు శ్రీపతి, ఇంకో ఇద్దరు ఉన్నారు. నా వైఫ్ మదిమలర్, వెంకట్ ప్రభు చిన్ననాటి స్నేహితులు కావడంతో మమ్మల్ని కలిశారు. నా ట్రోఫీలు, సాధించిన ఘనతలు చూసి నా బయోపిక్ తీద్దామంటే ముందు వద్దన్నాను.. ఆ తర్వాత సరే అన్నాను. అప్పుడు శ్రీపతిని కథ రాయమని వెంకట్ ప్రభు చెప్పారు.

బయోపిక్ అంటే ఫిక్షన్ జోడిస్తారు కదా..

నో ఫిక్షన్. ఈ సినిమాలో క్రికెట్ 20 శాతమే ఉంటుంది. మిగతా 80 శాతం నా జీవితం ఉంటుంది. నా జర్నీ, నేను ఇన్ని ఘనతలు సాధించిన క్రమంలో నా కుటుంబం, దేశం ఎదుర్కొన్న పరిస్థితులు '800'లో చూపించాం. నా బాల్యం, సెలెక్టర్లు నన్ను ఎందుకు ఎంపిక చేశారు వంటివి ఎవరికీ తెలియవు. ఆ విషయాలు సినిమాలో ఉంటాయి.

'800' సినిమా రషెస్ చూశారా? మీ పాత్రకు మధుర్ మిట్టల్ ఎంత వరకు న్యాయం చేశారు?

రషెస్ కంటే మూవీ చూడాలనుకున్నాను. అందుకే చూడలేదు. నేను పెద్ద సినిమా అభిమానిని. ఇండియన్ సినిమాలను మిస్ కాను. మధుర్ మిట్టల్‌ని రెండుసార్లు కలిశా. '800' టీజర్, ట్రైలర్ చూశాను. నాలాగా, లుక్స్ పరంగా 70 శాతం మ్యాచ్ అయ్యాడు.

'800' షూటింగ్‌కి వెళ్లలేదా?

ఒక్కసారి మాత్రమే వెళ్లాను. సినిమా నిర్మాణం గురించి నాకేమీ తెలియదు. అది కష్టమైన కళ. కొన్నిసార్లు నిర్మాతలను చూస్తే బాధగా ఉంటుంది. నటీనటులతో పాటు అందరికీ డబ్బులు ఇస్తారు. ఒకవేళ సినిమా ఆడకపోతే నిర్మాతల డబ్బులే పోతాయి కదా.

సినిమా హిట్ కావచ్చు, ఫ్లాప్ అవ్వొచ్చు. అందుకే చాలా మంది క్రికెటర్లు తమ బయోపిక్ తీయాలని కోరుకోరు..

సినిమా విజయంలో చాలా అంశాలు ఉంటాయి. సినిమా ఫ్లాప్ అయితే నా లెగసీ ఏమీ పడిపోదు. నా లెగసీ క్రికెట్. నిజంగా జరిగిన కథను ప్రజలకు చెప్పాలని మేం చేసిన ప్రయత్నం '800'. అది కొందరికి నచ్చవచ్చు.. మరికొందరికి నచ్చకపోవచ్చు. ఇదొక మంచి సినిమా. తప్పకుండా అందరికీ నచ్చుతుంది.

శ్రీలంకలోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నారా?

ప్రపంచవ్యాప్తంగా తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదలవుతోంది. శ్రీలంకన్ సింహళ భాషలోనూ రిలీజ్ చేస్తున్నాం.

తెలుగు సినిమాలు చూస్తారా?

శ్రీలంకలో తమిళ, హిందీ చిత్రాలు రిలీజవుతాయి. ఆ భాషల్లో డబ్బింగ్ చేసిన తెలుగు సినిమాలు చూస్తా. 'బాహుబలి, ఆర్ఆర్ఆర్, పుష్ప' సినిమాలను హిందీ, తమిళ భాషల్లో కూడా విడుదల చేయడంతో చూశా. శ్రీలంకలో బాలీవుడ్ మూవీస్ ఫేమస్. ఇప్పుడు తెలుగు సినిమా టాప్ పొజిషన్‌కు చేరుకుంది.

మీకు ఇష్టమైన తెలుగు నటుడు ఎవరు?

ఇతర భాషలతో పోలిస్తే తెలుగులో సూపర్ హీరోస్, స్టార్ హీరోస్ ఎక్కువ మంది ఉన్నారు. నేను నాని సినిమాలు ఎక్కువ చూశా. 'ఈగ', 'జెర్సీ', 'శ్యామ్ సింగరాయ్' చిత్రాలు బాగున్నాయి.

మీ బయోపిక్ విడుదలవుతోంది. టెన్షన్ ఏమైనా?

ఎందుకు టెన్షన్ పడాలి? నేను వరల్డ్ కప్ ఫైనల్ ఆడుతుంటే టెన్షన్ పడాలి (నవ్వుతూ).

త్వరలో వరల్డ్ కప్ మొదలవుతోంది. మీ ఫేవరేట్ టీమ్?

శ్రీలంక మాత్రమే నా ఫేవరెట్. అయితే ఎవరు గెలుస్తారనేది ఇప్పుడే చెప్పలేం.



చెస్‌లో త్రుటిలో చేజారిన పతకం

ఆసియా క్రీడల చెస్ ఈవెంట్ వ్యక్తిగత విభాగాల్లో భారత్ ఒక్క పతకం కూడా గెలవలేకపోయింది. మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక ఆరు పాయింట్లతో నాలుగో స్థానంలో, కోనేరు హంపి 5.5 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచారు. ఎనిమిదో రౌండ్‌లో హంపితో జరిగిన గేమ్‌ను హారిక 35 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో హారిక 30 ఎత్తుల్లో జినెర్ జు (చైనా)పై గెలిచింది. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత జినెర్ జు ఏడు పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచి స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. ఉమిదా ఒమనోవా (ఉజ్బెకిస్తాన్), హు ఇఫాన్ (చైనా) 6.5 పాయింట్లతో వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి రజత, కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. పురుషుల వ్యక్తిగత విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు విదిత్ సంతోష్ గుజరాతి, ఇరిగేశి అర్జున్ 5.5 పాయింట్లతో వరుసగా ఐదు, ఆరు స్థానాలతో సరిపెట్టుకున్నారు. వె యి (చైనా; 7.5 పాయింట్లు) స్వర్ణం, నొదిర్‌బెక్ (ఉజ్బెకిస్తాన్; 7 పాయింట్లు) రజతం, సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్; 7 పాయింట్లు) కాంస్యం గెల్చుకున్నారు.



ఓటమితో ముగింపు

ఆస్ట్రేలియాతో చివరి వన్డేలో భారత్ విజయలక్ష్యం 353 పరుగులు... టీమ్ తాజా ఫామ్, పిచ్‌ను బట్టి చూస్తే అసాధ్యమేమీ అనిపించలేదు. అయితే చివరకు భారత్‌కు ప్రతికూల ఫలితమే వచ్చింది. రోహిత్, కోహ్లిలు బరిలోకి దిగి సత్తా చాటినా గెలుపు దక్కలేదు. వరుస విజయాల ఊపులో మరో మ్యాచ్ గెలిచి ఆస్ట్రేలియాపై తొలిసారి వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేద్దామనుకున్న టీమిండియా కోరిక నెరవేరలేదు. ఆస్ట్రేలియా సమష్టి ప్రదర్శనతో విజయాన్ని అందుకొని తమ వరుస ఐదు పరాజయాలకు బ్రేక్ వేసింది. అయితే ఇప్పుడు ఈ వామప్ తరహా మ్యాచ్‌కంటే మరో పది రోజుల తర్వాత జరిగే అసలు పోరుపైనే అందరి దృష్టీ నిలిచింది. అక్టోబర్ 8న భారత్, ఆస్ట్రేలియా వరల్డ్ మ్యాచ్ కోసం ఇక ఎదురు చూదండి.

- చివరి వన్డేలో భారత్ పరాజయం
- 66 పరుగులతో గెలిచిన ఆస్ట్రేలియా
- సిరీస్ 2–1తో భారత్ సొంతం



రాజ్‌కోట్: ప్రపంచకప్‌కు ముందు సన్నాహకంగా ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 2–1తో సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 66 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 352 పరుగులు చేసింది. టాప్–4 బ్యాటర్లు అర్ధసెంచరీలు సాధించారు. మిచెల్ మార్ష్ (84 బంతుల్లో 96; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్టీవ్ స్మిత్ (61 బంతుల్లో 74; 8 ఫోర్లు, 1 సిక్స్), లబుషేన్ (58 బంతుల్లో 72; 9 ఫోర్లు), డేవిడ్ వార్నర్ (34 బంతుల్లో 56; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) కీలక పరుగులు చేశారు. మార్ష్, స్మిత్ రెండో వికెట్‌కు 137 పరుగులు జోడించారు. 353 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 49.4 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రోహిత్ శర్మ (57 బంతుల్లో 81; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (61 బంతుల్లో 56; 5 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయస్ అయ్యర్ (43 బంతుల్లో 48; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించగా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ మ్యాక్స్‌వెల్ 4 వికెట్లతో భారత్‌ను దెబ్బ తీశాడు. ఓవరాల్‌గా 178 పరుగులు చేసిన శుబ్‌మన్ గిల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (సి) రాహుల్ (బి) ప్రసిధ్ 56; మార్ష్ (సి) ప్రసిధ్ (బి) కుల్దీప్ 96; స్మిత్ (ఎల్బీ) (బి) సిరాజ్ 74; లబుషేన్ (సి) శ్రేయస్ (బి) బుమ్రా 72; క్యారీ (సి) కోహ్లి (బి) బుమ్రా 11; మ్యాక్స్‌వెల్ (బి) బుమ్రా 5; గ్రీన్ (సి) శ్రేయస్ (బి) కుల్దీప్ 9; కమిన్స్ (నాటౌట్) 19; స్టార్క్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 352. వికెట్ల పతనం:** 1–78, 2–215, 3–242, 4–267, 5–281, 6–299, 7–345. **బౌలింగ్:** బుమ్రా 10–0–81–3, సిరాజ్ 9–0–68–1, ప్రసిధ్ కృష్ణ 5–0–45–1, జడేజా 10–0–61–0, వాషింగ్టన్ సుందర్ 10–0–48–0, కుల్దీప్ యాదవ్ 6–0–48–2.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి అండ్ బి) మ్యాక్స్‌వెల్ 81; సుందర్ (సి) లబుషేన్ (బి) మ్యాక్స్‌వెల్ 18; కోహ్లి (సి) స్మిత్ (బి) మ్యాక్స్‌వెల్ 56; శ్రేయస్ (బి) మ్యాక్స్‌వెల్ 48; కేఎల్ రాహుల్ (సి) క్యారీ (బి) స్టార్క్ 26; సూర్యకుమార్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) హాజల్‌వుడ్ 8; జడేజా (ఎల్బీ) (బి) సంఘా 35; కుల్దీప్ (బి) హాజల్‌వుడ్ 2; బుమ్రా (సి) లబుషేన్ (బి) కమిన్స్ 5; సిరాజ్ (సి) కమిన్స్ (బి) గ్రీన్ 1; ప్రసిధ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (49.4 ఓవర్లలో ఆలౌట్) 286. వికెట్ల పతనం:** 1–74, 2–144, 3–171, 4–223, 5–233, 6–249, 7–257, 8–270, 9–286, 10–286. **బౌలింగ్:** స్టార్క్ 7–0–53–1, హాజల్‌వుడ్ 8–0–42–2, కమిన్స్ 8–0–59–1, గ్రీన్ 6.4–0–30–1, మ్యాక్స్‌వెల్ 10–0–40–4, తన్వీర్ సంఘా 10–0–61–1.

విష్ణు శరవణన్‌కు కాంస్యం



ఆసియా క్రీడల్లో మంగళవారం సెయిలింగ్‌లో భారత్‌కు రెండు పతకాలు రాగా... బుధవారం మరో పతకం చేరింది. పురుషుల డింగీ ఐఎల్‌సీఏ–7 ఈవెంట్‌లో విష్ణు శరవణన్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. 11 రేసులు జరిగిన ఈ ఈవెంట్‌లో విష్ణు శరవణన్ 34 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచాడు.

ఫైనల్లో రోషిబినా దేవి



ఆసియా క్రీడల మహిళల వుషు క్రీడాంశంలో భారత్‌కు కనీసం రజత పతకం ఖాయమైంది. సాండా ఈవెంట్ 60 కేజీల విభాగంలో భారత క్రీడాకారిణి రోషిబినా దేవి ఫైనల్లోకి ప్రవేశించింది. సెమీఫైనల్లో రోషిబినా 2–0తో థి థు ఎన్గుయెన్ (వియత్నాం)పై నెగ్గింది.

సాకేత్ జోడీకి పతకం ఖాయం



ఆసియా క్రీడల టెన్నిస్‌లో బుధవారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల డబుల్స్ విభాగంలో సాకేత్ మైనేని–రామ్‌కుమార్ రామనాథన్ జోడీ సెమీఫైనల్ చేరి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. పురుషుల సింగిల్స్‌లో సుమిత్ నగాల్, మహిళల సింగిల్స్‌లో అంకిత రైనా క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. క్వార్టర్ ఫైనల్లో సాకేత్–రామ్‌కుమార్ ద్వయం 6–1, 7–6 (10/8)తో జిజెన్ జాంగ్–యిబింగ్ వు (చైనా) జంటను ఓడించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాకేత్‌కిది ఆసియా క్రీడల్లో మూడో పతకం కానుంది. 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో సాకేత్ పురుషుల డబుల్స్‌లో రజతం, మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణం సాధించాడు. సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో సుమిత్ నగాల్ 7–6 (7/3), 1–6, 2–6తో టాప్ సీడ్ జిజెన్ జాంగ్ (చైనా) చేతిలో, అంకిత రైనా 6–3, 4–6, 4–6తో హరూకా కాజి (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయారు.


క్వార్టర్ ఫైనల్లో నిఖత్

తొలిసారి ఆసియా క్రీడల్లో పాల్గొంటున్న 'డబుల్ వరల్డ్ చాంపియన్' నిఖత్ జరీన్ పతకానికి విజయం దూరంలో నిలిచింది. మహిళల 50 కేజీల విభాగంలో భారత స్టార్ బాక్సర్ నిఖత్ బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 5–0తో చోరోంగ్ బాక్ (దక్షిణ కొరియా)ను చిత్తుగా ఓడించింది.

భారీ విజయంతో భారత్ బోణీ

ఆసియా క్రీడల మహిళల హాకీ ఈవెంట్‌లో సింగపూర్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 13–0తో గోల్స్‌తో నెగ్గింది. భారత్ తరఫున సంగీత మూడు గోల్స్ చేయగా... నవనీత్ కౌర్ రెండు గోల్స్ సాధించింది. ఉదిత, సుశీల దీపిక, దీప్ గ్రేస్ ఎక్కా, నేహా, సలీమా, మోనిక, వందన ఒక్కో గోల్ చేశారు.

బుల్లెట్ దిగింది...


సిఫ్ట్ కౌర్

చైనా గడ్డపై భారత తుపాకీ గర్జించింది. ఒకే రోజు మన షూటర్లు ఏకంగా ఏడు పతకాలతో అదరహో అనిపించారు. స్టెతస్కోప్‌ను వదిలేసి రైఫిల్ ఎత్తిన సిఫ్ట్ కౌర్ సామ్రా కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పి పసిడి పతకం సొంతం చేసుకుంది. తెలంగాణ టీనేజ్ షూటర్ ఇషా సింగ్ డబుల్ ధమాకా సృష్టించింది. పిస్టల్ ఈవెంట్‌లో ఇషా సభ్యురాలిగా ఉన్న భారత జట్టు స్వర్ణ పతకంతో మెరిపించగా... వ్యక్తిగత విభాగంలో ఇషా రజత పతకంతో మురిపించింది. స్కీట్ ఈవెంట్‌లో అనంత్ జీత్ సింగ్ రెండు పతకాలతో భారత బృందంలో ఆనందాన్ని రెట్టింపు చేశాడు. సెయిలింగ్‌లో విష్ణు శరవణన్ కాంస్య పతకం గెలిచాడు. మహిళల వుషు సాండా ఈవెంట్‌లో రోషిబినా దేవి ఫైనల్ చేరి... పురుషుల టెన్నిస్ డబుల్స్‌లో సాకేత్ మైనేని–రామ్‌కుమార్ జోడీ సెమీఫైనల్ చేరి పతకాలను ఖాయం చేసుకున్నారు. వెరసి ఆసియా క్రీడల్లో నాలుగో రోజు భారత్ ఖాతాలో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, మూడు కాంస్యాలతో కలిపి ఎనిమిది పతకాలు చేరాయి. ఓవరాల్‌గా 22 పతకాలతో భారత్ ఏడో స్థానంలో ఉంది.

ఒకే రోజు ఏడు పతకాలతో అదరగొట్టిన భారత షూటర్లు

- ప్రపంచ రికార్డుతో పసిడి పతకం నెగ్గిన సిఫ్ట్ కౌర్
- తెలంగాణ షూటర్ ఇషా సింగ్ డబుల్ ధమాకా
- 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం, వ్యక్తిగత విభాగంలో రజతం నెగ్గిన ఇషా

హాంగ్జౌ: గురి తప్పని లక్ష్యంతో భారత షూటర్లు ఆసియా క్రీడల్లో పతకాల మోత మోగించారు. బుధవారం ఏకంగా ఏడు పతకాలతో తమ సత్తా చాటుకున్నారు. ఈ ఏడు పతకాల్లో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, రెండు కాంస్య పతకాలు ఉండటం విశేషం. మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్ సామ్రా కొత్త ప్రపంచ రికార్డు సృష్టించడంతో పాటు స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఎనిమిది మంది మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో సిఫ్ట్ కౌర్ 469.6 పాయింట్లు స్కోరు చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. 467 పాయింట్లతో బ్రిటన్ షూటర్ సియోనైడ్ మెకింటోష్ పేరిట ఉన్న వరల్డ్ రికార్డును 22 ఏళ్ల సిఫ్ట్ కౌర్ బద్దలు కొట్టింది. ఇదే ఈవెంట్‌లో భారత్‌కే చెందిన ఆశి చౌక్సీ 451.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ప్రపంచ చాంపియన్ కియోంగ్‌యు జాంగ్ (చైనా; 462.3 పాయింట్లు) రజతం కైవసం చేసుకుంది. అంతకుముందు క్వాలిఫయింగ్‌లో సిఫ్ట్ కౌర్, ఆశి చౌక్సీ, మానిని కౌశిక్‌లతో కూడిన భారత జట్టు 1764 పాయింట్లు సాధించి రజత పతకాన్ని సాధించింది. పంజాబ్‌లోని ఫరీద్‌కోట్ ప్రాంతానికి చెందిన సిఫ్ట్ కౌర్ ఒకవైపు వైద్య విద్యను అభ్యసిస్తూ రైఫిల్ షూటింగ్‌లో కొనసాగింది. అయితే షూటింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో సిఫ్ట్ కౌర్‌కు మంచి ఫలితాలు వస్తుండటంతో ఏడాది తర్వాత ఆమె వైద్య విద్యకు బ్రేక్ ఇచ్చి పూర్తిస్థాయిలో ఈ క్రీడపై దృష్టి సారించింది. ఆమె సరైన నిర్ణయమే తీసుకుందని తాజా ఫలితం నిరూపించింది.


25 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో నెగ్గిన స్వర్ణ పతకంతో హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్

అంతకుముందు మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లోనూ భారత షూటర్లు ఇషా సింగ్, రిథమ్ సాంగ్వాన్, మనూ భాకర్ త్రయం మెరిసింది. క్వాలిఫయింగ్‌లో ఇషా, రిథమ్, మనూ 1759 పాయింట్లు స్కోరు చేసి టీమ్ విభాగంలో పసిడి పతకాన్ని దక్కించుకుంది. ఇషా, మనూ భాకర్ వ్యక్తిగత విభాగం ఫైనల్‌కూ అర్హత సాధించారు. ఎనిమిది మంది మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్ 34 పాయింట్లు సాధించి రజత పతకాన్ని గెలిచింది. మనూ భాకర్ 21 పాయింట్లతో ఐదో స్థానంతో సరిపెట్టుకుంది.


అనంత్ జీత్

పురుషుల స్కీట్ ఈవెంట్‌లో భారత్‌కు టీమ్ విభాగంలో కాంస్యం, వ్యక్తిగత విభాగంలో రజతం లభించాయి. అనంత్ జీత్ సింగ్, గురుజోత్ సింగ్, అంగద్ వీర్‌సింగ్ బాజ్వాలతో కూడిన భారత జట్టు క్వాలిఫయింగ్‌లో 355 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఆరుగురు పోటీపడ్డ వ్యక్తిగత విభాగం ఫైనల్లో అనంత్ జీత్ 58 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని హస్తగతం చేసుకున్నాడు.

పతకాల పట్టిక (టాప్–10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	76	43	21	140
దక్షిణ కొరియా	19	18	33	70
జపాన్	15	27	24	66
ఉజ్బెకిస్తాన్	6	10	12	28
థాయ్‌లాండ్	6	3	8	17
హాంకాంగ్	5	8	14	27
భారత్	5	7	10	22
ఇండోనేసియా	3	2	7	12
చైనీస్ తైపీ	2	3	4	9
సింగపూర్	2	3	4	9

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

కొడితే బంతి ఎవరెస్ట్‌కు...

- టి20 మ్యాచ్‌లో నేపాల్ జట్టు కమాల్
- ఐదు కొత్త ప్రపంచ రికార్డులు నమోదు
- 34 బంతుల్లో కుశాల్ మల్లా ఫాస్టెస్ట్ సెంచరీ
- 9 బంతుల్లో దీపేంద్ర సింగ్ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ
- 273 పరుగులతో మంగోలియా చిత్తు




కుశాల్


దీపేంద్ర

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో నేపాల్ క్రికెట్ జట్టు అద్భుతం చేసింది. అంతర్జాతీయ క్రికెట్‌లో పసికూనలాంటి ఆ జట్టు ఆటలో ఇప్పుడే నడక మొదలుపెట్టిన టీమ్‌పై తమ ప్రతాపాన్ని ప్రదర్శించింది. పరుగుల వాన, పరుగుల వరద అనే విశేషణాలు ఈ మ్యాచ్‌కు సరిపోవు... విధ్వంసం, దూకుడు అనేవి కూడా చిన్న పదాలు... ఒకదాని తర్వాత మరో కొత్త మరో రికార్డు... పరుగులు, బంతులు, బౌండరీలు... ఇలా అన్నింటిలోనూ కొత్త ఘనతలే. ఆసియా క్రీడల్లో భాగంగా బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో నేపాల్ ఏకంగా 273 పరుగుల తేడాతో మంగోలియాను చిత్తుచిత్తుగా ఓడించింది. ఈ క్రమంలో టి20ల్లో పలు రికార్డులు తమ ఖాతాలో వేసుకుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 314 పరుగులు చేసింది. కుశాల్ మల్లా (50 బంతుల్లో 137 నాటౌట్; 8 ఫోర్లు, 12 సిక్స్‌లు) మెరుపు సెంచరీతో చెలరేగాడు. రోహిత్ పౌడెల్ (27 బంతుల్లో 61; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు), దీపేంద్ర సింగ్ ఐరీ (10 బంతుల్లో 52 నాటౌట్; 8 సిక్స్‌లు) అతనికి అండగా నిలిచారు. అనంతరం మంగోలియా 13.1 ఓవర్లలో 41 పరుగులకే కుప్పకూలింది. దవాసురెన్ (10) ఒక్కటే రెండంకెల స్కోరు చేయగా, ఎక్స్‌ట్రాలదే (23) అత్యధిక స్కోరు. మంగోలియా జట్టుకు ఇది తొలి అంతర్జాతీయ మ్యాచ్ మాత్రమే కాదు, ఓవరాల్‌గా కూడా ఆ జట్టుకు ఇదే తొలి టి20 మ్యాచ్. తుది జట్టులోని 11 మందీ తొలిసారి టి20 మ్యాచ్ బరిలోకి దిగినవారే. దాంతో కాస్త అనుభవం ఉన్న నేపాల్ ముందు ఈ జట్టు కనీసం నిలవలేకపోయింది.

మ్యాచ్‌లో నమోదైన రికార్డులు...

314 అంతర్జాతీయ టి20ల్లో ఇదే అత్యధిక స్కోరు. గతంలో ఏ జట్టూ 300 పరుగులు చేయలేదు. 278 పరుగులతో ఉన్న రికార్డును (2019లో ఐర్లాండ్ జట్టుపై అఫ్గానిస్తాన్, 2019లో తుర్కియే జట్టుపై చెక్ రిపబ్లిక్) నేపాల్ బద్దలు కొట్టింది.

273 టి20ల్లో అతి పెద్ద విజయం. గతంలో చెక్ రిపబ్లిక్ 257 పరుగులతో తుర్కియేని ఓడించింది.

34 అంతర్జాతీయ టి20ల్లో కుశాల్ మల్లా 34 బంతుల్లో ఫాస్టెస్ట్ సెంచరీని నమోదు చేశాడు. గతంలో 35 బంతుల్లో రోహిత్ శర్మ (భారత్; 2017లో శ్రీలంకపై), డేవిడ్ మిల్లర్ (దక్షిణాఫ్రికా; 2017లో బంగ్లాదేశ్‌పై), విక్రమశేఖర (చెక్ రిపబ్లిక్; 2019లో తుర్కియేపై) నెలకొల్పిన సెంచరీ రికార్డు తెరమరుగైంది.

9 అంతర్జాతీయ టి20ల్లో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీని దీపేంద్ర సింగ్ నమోదు చేశాడు. గతంలో 12 బంతులతో ఈ రికార్డు భారత స్టార్ యువరాజ్ సింగ్ (2007లో ఇంగ్లండ్‌పై) పేరిట ఉంది.

26 ఇన్నింగ్స్‌లో నేపాల్ అత్యధిక సిక్సర్ల రికార్డు నమోదు చేసింది. గతంలో అఫ్గానిస్తాన్ జట్టు ఐర్లాండ్‌పై (2019లో), వెస్టిండీస్ జట్టు దక్షిణాఫ్రికాపై (2023లో) 22 సిక్స్‌లు చొప్పున కొట్టింది.

ఏడేళ్ల తర్వాత భారత గడ్డపై...

హైదరాబాద్ చేరిన పాకిస్తాన్ జట్టు ● రేపు న్యూజిలాండ్‌తో వామప్ మ్యాచ్

వన్డే ప్రపంచకప్ మరో 7 రోజుల్లో

సాక్షి, హైదరాబాద్: పాకిస్తాన్ క్రికెట్ జట్టు సభ్యులు రెండు వారాల పాటు హైదరాబాద్ నగరంలో అతిథులుగా ఉండబోతున్నారు. వన్డే వరల్డ్ కప్‌లో రెండు వామప్ మ్యాచ్‌లతో పాటు రెండు ప్రధాన మ్యాచ్‌లను కూడా పాకిస్తాన్ ఇక్కడి ఉప్పల్ స్టేడియంలో ఆడనుంది. మెగా టోర్నీలో పాల్గొనేందుకు బాబర్ ఆజమ్ నాయకత్వంలోని 15 మంది సభ్యుల బృందం బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకుంది. శంషాబాద్ విమానాశ్రయంలో హెచ్‌సీఏ ప్రతినిధులు పాక్ జట్టుకు స్వాగతం పలికారు. విమానాశ్రయంలో జట్టుకు నగర పోలీసులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పాక్ క్రికెట్ టీమ్ ఏడేళ్ల తర్వాత భారత గడ్డపై అడుగు పెట్టడం విశేషం. 2016లో ఇక్కడే టి20 ప్రపంచకప్ ఆడిన ఆ టీమ్ మళ్లీ ఇప్పుడే మరో వరల్డ్ కప్ కోసం ఇక్కడకు వచ్చింది. టీమ్‌లోని మొహమ్మద్ నవాజ్, సల్మాన్ ఆగాలకు మాత్రమే గతంలో భారత్‌లో ఆడిన అనుభవం (జూనియర్ స్థాయిలో) ఉండగా... టీమ్ కెప్టెన్, ఇప్పటి అగ్రశ్రేణి బ్యాటర్లలో ఒకడిగా గుర్తింపు పొందిన బాబర్ ఆజమ్ తొలిసారి భారత్‌లో ఆడబోతున్నాడు. భారత్ బయల్దేరే ముందు లాహోర్‌లో మీడియాతో మాట్లాడిన బాబర్ ఆజమ్ తమ జట్టు మెరుగైన ప్రదర్శన ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. భారత్‌తో మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు చెప్పాడు. 'గతంలో భారత్‌లో ఆడకపోయినా మాపై ఎలాంటి ఒత్తిడీ లేదు. దాదాపు ఆసియా ఖండంలోనే ఇతర దేశాల్లాగే ఉండే ఇక్కడి పరిస్థితులపై మాకు అవగాహన ఉంది. అందుకే మేం తగిన విధంగా సన్నద్ధమై వచ్చాం. హౌస్‌ఫుల్‌గా ఉండబోయే అహ్మదాబాద్‌లో భారత్‌తో జరిగే మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తా. నా సొంత రికార్డుల గురించి ఆలోచన లేదు. ఎంత స్కోరు చేసినా జట్టు విజయానికి ఉపయోగపడటం ముఖ్యం' అని బాబర్ అన్నాడు. ఉప్పల్ స్టేడియంలో రేపు న్యూజిలాండ్‌తో, అక్టోబర్ 3న ఆస్ట్రేలియాతో పాకిస్తాన్ రెండు వామప్ మ్యాచ్‌లు ఆడుతుంది. అనంతరం ప్రధాన టోర్నీలో అక్టోబర్ 6న నెదర్లాండ్స్‌తో, అక్టోబర్ 10న శ్రీలంకతో ఆ జట్టు తలపడుతుంది. మరోవైపు కేన్ విలియమ్సన్ నేతృత్వంలో క్రైస్ట్‌చర్చ్ నుంచి వచ్చిన న్యూజిలాండ్ టీమ్ రెండో బృందం కూడా బుధవారం రాత్రే హైదరాబాద్‌కు చేరుకుంది.


శంషాబాద్ విమానాశ్రయంలో పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ అజమ్, పేస్ బౌలర్ షాహీన్ అఫ్రిది

సాక్షి బిజినెస్
గురువారం
28-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
173	52
66,119	19,716

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,988	▽	75
డోజోన్స్	33,357	▽	253
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,593	▽	32
డాక్స్	15,217	▽	38
షాంఘై	3,107	▲	5
నికాయ్	32,371	▲	57

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,454
బంగారం (99.5 స్వచ్ఛత)	58,220
వెండి (కిలో)	70,930

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.56	83.09
£	బ్రిటన్ పౌండ్		100.83	103.56
€	యూరో		85.31	90.63
¥	జపాన్ ఎన్ (100)		54.85	55.18
AU$	ఆస్ట్రేలియా డాలర్		52.84	55.69
S$	సింగపూర్ డాలర్		60.93	62.48
SAR	సౌదీ రియాల్		21.24	22.86
UAE D	యూఏఈ దిర్హామ్		21.76	23.55
¥	చైనా యువాన్		10.27	12.34

మళ్లీ జీఆర్‌టీ జ్యువెలర్స్ బ్యాంగిల్ మేళా



హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జీఆర్‌టీ జ్యువెలర్స్ మళ్లీ బ్యాంగిల్ మేళా నిర్వహిస్తుంది. విస్తృత శ్రేణిలో వివిధ రకాల మోడల్ గాజులను ఆకర్షణీయమైన ఆఫర్లతో సంస్థ అందుబాటులోకి తెచ్చింది. బంగారు ఆభరణాల తరుగుపై 20%, వజ్రాలు, అన్‌కట్ వజ్రాల విలువపై 10% డిస్కౌంట్ ఇస్తుంది. 'ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాదీ బ్యాంగిల్ మేళా తీసుకొచ్చాము. కస్టమర్లు తమకు నచ్చిన డిజైన్లు, గాజులను తక్కువ ధరలో కొనుగోలు చేయొచ్చు' అని కంపెనీ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.

ఎస్‌హెచ్‌జీలకు ఇండియన్ బ్యాంక్ రుణాలు



హైదరాబాద్: స్వయం సహాయక సంఘాలకు మరింత చేరువయ్యేందుకు ఇండియన్ బ్యాంక్ బుధవారం 'మెగా ఎస్‌హెచ్‌జీ అవుట్‌రీస్ క్యాంప్' నిర్వహించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు రూ.870 కోట్లు, తెలంగాణాకు రూ.140 కోట్ల ఎస్‌హెచ్‌జీ రుణాలు పంపిణీ చేసింది. అలాగే చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలను ప్రోత్సాహించేందుకు అదనంగా రూ.47.28 కోట్ల రుణాలు కేటాయించింది. స్వయం సేవా సంఘాల ఆర్థిక సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ఇండియన్ బ్యాంక్ గణనీయమైన కృషి చేస్తుందని బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇమ్రాన్ అమిన్ సిద్ధిఖీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా సెర్ప్ డైరెక్టర్ వై నరసింహా రెడ్డితో పాటు ఇతర అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-9-2023	
విశాఖ	533-00
చిత్తూరు	533-00
విజయవాడ	533-00
రిటైల్ ధర (డజను)	72.00
27-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	516-00
వరంగల్	518-00
రిటైల్ ధర	5.75

ఉద్యోగుల చాయిస్ 'జెప్టో'

లింక్డ్‌ఇన్ రేటింగ్స్‌లో టాప్ ర్యాంకు

న్యూఢిల్లీ: దేశీయంగా ఉద్యోగులు పని చేసేందుకు అత్యధికంగా ఇష్టపడుతున్న టాప్ 20 స్టార్టప్‌ల జాబితాలో ఈ-కామర్స్ దిగ్గజం జెప్టో అగ్రస్థానం దక్కించుకుంది. ఎలక్ట్రిక్ వాహనాల క్యాబ్ అగ్రిగేటర్ బ్లూస్మార్ట్, ఫిన్‌టెక్ సంస్థ డిట్టో ఇన్సూరెన్స్, ఆడియో ఓటీటీ ప్లాట్‌ఫాం పాకెట్ ఎఫ్‌ఎం, స్కైరూట్ ఏరోస్పేస్ తదుపరి స్థానాల్లో ఉన్నాయి. రిక్రూట్‌మెంట్ ప్లాట్‌ఫాం లింక్డ్‌ఇన్ బుధవారం విడుదల చేసిన 'టాప్ 20 భారత స్టార్టప్స్' వార్షిక జాబితాలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. లింక్డ్‌ఇన్‌లో దాదాపు 1 కోటి మంది సభ్యులు ఉన్నారు. వారి డేటా ఆధారంగా, ఉద్యోగం చేసేందుకు ప్రొఫెషనల్స్ ఇష్టపడుతున్న వర్ధమాన కంపెనీలను విశ్లేషించి లింక్డ్‌ఇన్ ఈ ర్యాంకులు ఇచ్చింది. ఉద్యోగుల వృద్ధి, ఉద్యోగార్థుల ఆసక్తి తదితర అంశాల ప్రాతిపదికన జెప్టో తాజాగా మూడు స్థానాలు ఎగబాకి అగ్రస్థానం దక్కించుకుంది. జెప్టో ఇటీవలే యూనికార్న్ (1 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్ గల స్టార్టప్) హోదాను దక్కించుకుంది. ఈ ఏడాది లిస్టులో చోటు దక్కించుకున్న 20 స్టార్టప్‌లలో 14 సంస్థలు కొత్తవేనని లింక్డ్‌ఇన్ ఇండియా హెడ్ (ఎడిటోరియల్) నిరాజితా బెనర్జీ తెలిపారు. స్టార్టప్‌ల విభాగంలో అసాధారణ వేగంతో ఆవిష్కరణల రూపకల్పన జరుగుతుండటం, పుష్కలమైన వృద్ధి అవకాశాలకు ఇది నిదర్శనమని ఆమె చెప్పారు.



సాగర రవాణాకు ఐజీఎస్‌టీ మినహాయింపు

అక్టోబర్ 1 నుంచి అమల్లోకి


న్యూఢిల్లీ: సాగర రవాణాకు అనుకూల నిర్ణయాన్ని కేంద్రం తీసుకుంది. సాగర రవాణా ద్వారా దిగుమతులకు చేసే చెల్లింపులపై ఇప్పటి వరకు 5% ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ (ఐజీఎస్‌టీ) అమలవుతుండగా, దీన్ని పూర్తిగా మినహాయించింది. ఇందుకు సంబంధించి ఐజీఎస్‌టీ చట్టానికి చేసిన సవరణలను ఆర్థిక శాఖ నోటిఫై చేసింది. అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. మోహిత్ మినరల్స్ కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఐజీఎస్‌టీకి కేంద్రం ఈ సవరణలు చేసినట్టు కేపీఎంజీ పరోక్ష పన్నుల విభాగం చీఫ్ అభిషేక్ జైన్ తెలిపారు.



కనిష్ట స్థాయిల నుంచి రికవరీ

- సూచీలకు అధిక వెయిటేజీ షేర్ల అండ
- కలిసొచ్చిన ఆసియా, యూరప్ మార్కెట్ల సానుకూలత

ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ షేర్లు 2% వరకు రాణించడంతో స్టాక్ సూచీలు బుధవారం కనిష్ట స్థాయిల నుంచి రికవరీ అయ్యాయి. ఆసియా, యూరప్ మార్కెట్లలోని సానుకూలతలు కలిసొచ్చాయి. ట్రేడింగ్‌లో 395 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 173 పాయింట్ల లాభంతో 66,119 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 52 పాయింట్లు బలపడి 19,716 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 111 పాయింట్లు పతనమైన 19,554 వద్ద కనిష్టాన్ని తాకింది. ఉదయం నష్టాలతో ట్రేడైన సూచీలు ప్రథమార్థం మొత్తం అదే ధోరణి కదలాడాయి. మిడ్ సెషన్‌లో యూరప్ మార్కెట్ల సానుకూల ప్రారంభం ఇన్వెస్టర్లను కొనుగోళ్లకు ప్రేరేపించింది. క్యాపిటల్ గూడ్స్, ఫార్మా, పారిశ్రామిక, ఎఫ్‌ఎంసీజీ, రియల్టీ, ఐటీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి. బ్యాంకులు, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.354 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.386 కోట్ల షేర్లను కొన్నారు.



అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ 22 ఏళ్ల గరిష్టాన్ని తాకిన తర్వాత దిగిరావడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సంకేతాలు నెలకొన్నాయి.

- సెన్సెక్స్ కనిష్టం(65,550) నుంచి మొత్తం 569 పాయింట్లు ర్యాలీ చేయడంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టింగ్ కంపెనీల మొత్తం విలువ రూ.1.53 లక్షల కోట్లు పెరిగి రూ.319.68 లక్షల కోట్లకు చేరింది. ఈ సూచీలో మొత్తం 30 షేర్లకు గానూ 20 షేర్లు లాభపడ్డాయి.
- రూ.2800 కోట్ల లక్ష్యంగా ఐపీఓకు వచ్చిన జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పబ్లిక్ ఇష్యూ చివరి రోజు నాటికి 37.37 రెట్ల అధిక స్పందన లభించింది. కంపెనీ 13.62 కోట్ల ఈక్విటీలను జారీ చేయగా 509 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.
- అప్‌డేటర్ సర్వీసెస్ ఐపీవోకు 2.90 రెట్ల అధిక స్పందన లభించింది. 1.19 కోట్ల ఈక్విటీలను జారీ చేయగా 3.47 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.
- గత రెండు ట్రేడింగ్ సెషన్లలో డీలా పడిన రూపాయి బుధవారం రికవరీ అయ్యింది. డాలర్ మారకంలో బుధవారం 6 పైసలు బలపడి 83.22 స్థాయి వద్ద స్థిరపడింది.

మెప్పించిన సాయి సిల్క్స్ లిస్టింగ్



హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సాయి సిల్క్స్ (కళా మందిర్) షేరు లిస్టింగ్‌లో మెప్పించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.222)తో పోలిస్తే 3.50% ప్రీమియంతో రూ.230 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్ 11% ర్యాలీ చేసి రూ.247 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 10% లాభంతో రూ.245 వద్ద నిలిచింది. మార్కెట్ విలువ రూ.3,755 కోట్లుగా నమోదైంది.

- రియల్ ఎస్టేట్ డెవలపర్ సిగ్నేచర్ గ్లోబల్ (ఇండియా) తొలిరోజు 19% లాభాలు పంచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.385)తో పోలిస్తే 15.58% ప్రీమియంతో రూ.445 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్ 23% ర్యాలీ చేసి రూ.473 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 19% లాభంతో రూ.457 వద్ద నిలిచింది.

వేదాంతా రిసోర్సెస్‌కు రేటింగ్ షాక్

డౌన్‌గ్రేడ్ చేసిన మూడీస్ ఇన్వెస్టర్స్

న్యూఢిల్లీ: గ్లోబల్ రేటింగ్ దిగ్గజం మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ తాజాగా మైనింగ్ దిగ్గజం వేదాంతా రిసోర్సెస్ లిమిటెడ్(వీఆర్‌ఎల్) రేటింగ్‌ను డౌన్‌గ్రేడ్ చేసింది. రుణ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో రానున్న కొద్ది నెలల్లో పెరగనున్న రిస్కుల కారణంగా సీఏఏ1 నుంచి సీఏఏ2కు రేటింగ్‌ను డౌన్‌గ్రేడ్ చేస్తున్నట్లు మూడీస్ పేర్కొంది. రానున్న కాలంలోని రుణ చెల్లింపుల కోసం ఎలాంటి రీఫైనాన్సింగ్ సౌకర్యాలకూ తెరతీయకపోవడం కార్పొరేట్ ఫ్యామిలీ రేటింగ్(సీఎఫ్‌ఆర్)పై ప్రభావం చూపినట్లు వెల్లడించింది. అంతేకాకుండా కంపెనీ ప్రతికూల ఔట్‌లుక్‌ను కొనసాగించేందుకు నిర్ణయించింది. ప్రధానంగా 2024 జనవరి, ఆగస్టులలో కాలావధి తీరనున్న మొత్తం రెండు బిలియన్ డాలర్ల విలువైన బాండ్లకోసం తగిన రీఫైనాన్సింగ్‌ను చేపట్టకపోవడాన్ని మూడీస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ కౌస్తుభ్ చౌబాల్ పేర్కొన్నారు. బలహీన లిక్విడిటీ నేపథ్యంలో సంస్థ రుణ(క్రెడిట్) నాణ్యత దెబ్బతిన్నట్లు తెలియజేశారు. ఇందుకు భారీ ఫైనాన్సింగ్ అవసరాలు, వడ్డీ వ్యయాలు కారణమని వివరించారు. గ్లోబల్ క్యాపిటల్ మార్కెట్లలో ఫైనాన్సింగ్ పరిస్థితులు కఠినమవుతున్న సమయాన కంపెనీ రుణ రీఫైనాన్సింగ్‌కు సవాళ్లు ఎదురుకావచ్చని అభిప్రాయపడింది. నిలకడలేని మూలధన నిర్మాణం, పెరుగుతున్న రిస్కులు, బలహీన ఆర్థిక నిర్వహణ సంస్థ సీఎఫ్‌ఆర్ సీఏఏ విభాగానికి కారణమని చౌబాల్ తెలియజేశారు.



వాటా విక్రయం

ఈ ఏడాది(2023) ఆగస్టులో ప్రధాన అనుబంధ కంపెనీ వేదాంతా లిమిటెడ్(వీడీఎల్)లో 4.3 శాతం వాటాను విక్రయించింది. 50 కోట్ల డాలర్లు సమకూర్చుకుంది. తద్వారా హోల్డింగ్ కంపెనీకి పెరుగుతున్న నగదు అవసరాల ఒత్తిడినుంచి తప్పించుకుంది. మరోవైపు గ్రూప్ ఏకీకృత నగదులో ముప్పావువంతుకు సమానమైన వేదాంతాలోని పూర్తి వాటా, హిందుస్తాన్ జింక్‌లో వీడీఎల్‌కుగల 64.9 శాతం వాటా ఇప్పటికే తనఖాలో ఉంది. దీంతో రుణ సమీకరణకు పరిమిత అవకాశాలు మాత్రమే ఉన్నట్లు మూడీస్ పేర్కొంది. కమోడిటీల ధరలు నీరసిస్తున్న వాతావరణానికితోడు.. వీఆర్‌ఎల్ అనుబంధ కంపెనీల క్యాష్ ఫ్లోను దెబ్బతీయవచ్చు. దీంతో హోల్డింగ్ కంపెనీ రుణ రిస్కులు అనుబంధ కంపెనీల నిధుల సమీకరణ, డివిడెండ్ల పంపిణీపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపవచ్చునంటూ మూడీస్ అభిప్రాయపడింది.

మూడీస్ డౌన్‌గ్రేడ్‌తో వేదాంతా షేరు 7% పతనమై 52 వారాల కనిష్టం రూ. 209 వద్ద ముగిసింది.

అపోలో హాస్పిటల్స్ చేతికి 'కోల్‌కతా' ఆస్పత్రి

రూ. 102 కోట్లకు పాక్షికంగా నిర్మించిన అసెట్ కొనుగోలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ తూర్పు రాష్ట్రాల్లో మరింతగా కార్యకలాపాలను విస్తరించడంపై దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా కోల్‌కతాలో పాక్షికంగా నిర్మించిన ఓ ఆస్పత్రిని కొనుగోలు చేసింది. ఫ్యూచర్ ఆంకాలజీ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ నుంచి తమ అనుబంధ సంస్థ అపోలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ రూ. 102 కోట్లకు ఈ హాస్పిటల్‌ను కొనుగోలు చేసినట్లు సంస్థ వెల్లడించింది. కోల్‌కతా ప్రాంతంలో అపోలో హాస్పిటల్‌కు ఇది రెండో ఆస్పత్రి కాగా, తూర్పు ప్రాంతంలో అయిదోది. దీనితో కోల్‌కతా, భువనేశ్వర్, గువాహటివ్యాప్తంగా 1,800 పైచిలుకు పడకలతో అతిపెద్ద హెల్త్‌కేర్ ప్రొవైడర్‌గా తమ స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోగలమని తెలిపింది. తూర్పు రాష్ట్రాల్లో వచ్చే 3 ఏళ్ల వ్యవధిలో పడకల సంఖ్యను మరో 700 మేరకు పెంచుకోనున్నామని, తద్వారా సదరు ప్రాంతంలో మొత్తం పడకల సంఖ్య 2,500కి చేరగలదని వివరించింది. తాజాగా కొనుగోలు చేసిన సోనార్‌పూర్‌లో ఆస్పత్రిని 325 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. ఇందులో తొలి దశ కింద 1.75 లక్షల చ.అ. విస్తీర్ణంలోని 225 పడకలు వచ్చే 12 నెలల్లో అందుబాటులోకి రాగలవని సంస్థ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. అధునాతన సాంకేతికతతో అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తున్న అపోలో హాస్పిటల్స్‌ను రెండు దశాబ్దాలపైగా కోల్‌కతా, ఈశాన్య రాష్ట్రాల ప్రజలు ఆదరిస్తున్నారని ఆమె చెప్పారు.



భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

సింగిల్ గర్ల్ చైల్డ్ స్కాలర్‌షిప్-2023

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ).. తల్లిదండ్రులకు ఏకైక బాలికా సంతానంగా ఉన్న ప్రతిభ కలిగిన విద్యార్థినుల కోసం ఉపకార వేతనాన్ని అందిస్తోంది. దీనికి సంబంధించి 2023 ప్రకటన వెలువడింది. సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** విద్యార్థిని తల్లిదండ్రులకు ఏకైక కూతురై ఉండాలి. విద్యార్థిని సీబీఎస్‌ఈలో పదో తరగతి ఉత్తీర్ణురాలై, సీబీఎస్‌ఈ అనుబంధ పాఠశాలలో పదకొండో తరగతి, పన్నెండో తరగతి చదువుతూ ఉండాలి. పదో తరగతి పరీక్షలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. విద్యార్థిని ట్యూషన్ ఫీజు నెలకు రూ.1500 కంటే మించకూడదు.
» **స్కాలర్‌షిప్:** స్కాలర్‌షిప్‌కి ఎంపికైన విద్యార్థినులు 11వ తరగతి తర్వాత ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. రెన్యువల్ చేయించుకోవాలంటే.. విద్యార్థిని కనీసం 50 శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించాలి. విద్యార్థినులకు రెండేళ్ల పాటు నెలకు రూ.500 చొప్పున అందిస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**18.10.2023
» **సీబీఎస్‌ఈ పాఠశాలల దరఖాస్తు ధ్రువీకరణ తేదీలు:** 25.09.2023 నుంచి 25.10.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.cbse.gov.in

నిమ్స్ హైదరాబాద్‌లో ఎంపీటీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్).. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపీటీ కోర్సులో ప్రవేశానికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు వివరాలు

» **మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ-15 సీట్లు. స్పెషాలిటీ:** మస్క్యులోస్కెలెటల్ సైన్సెస్, కార్డియోవాస్కులర్ అండ్ పల్మనరీ సైన్సెస్, న్యూరోసైన్సెస్. కోర్సు వ్యవధి: రెండేళ్లు.
» **అర్హత:** బీపీటీ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.12.2023 నాటికి 22ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**07.10.2023
» **ప్రవేశ పరీక్ష తేది:** 02.11.2023.
» **వెబ్‌సైట్:** www.nims.edu.in

సైనిక్ స్కూల్ రెవాలో ఉద్యోగాలు

రెవాలోని సైనిక్ స్కూల్.. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **పోస్టుల వివరాలు:** అకౌంటెంట్-01, నర్సింగ్ అసిస్టెంట్-01, లోయర్ డివిజన్ క్లర్క్-01, టీజీటీ సోషల్ సైన్స్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్/ఇంటిగ్రేటెడ్ డిగ్రీ/బీఈడీ/బ్యాచిలర్స్ డిగ్రీ/నర్సింగ్ డిప్లొమా/బీకామ్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 18 నుంచి 50 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్, సైనిక్ స్కూల్, రేవా(మధ్యప్రదేశ్)-486001 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.10.2023.
» **వెబ్‌సైట్:** www.sainikschoolrewa.ac.in

టీఐఎఫ్‌ఆర్, హైదరాబాద్‌లో వివిధ ఖాళీలు

హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టీఐఎఫ్‌ఆర్).. తాత్కాలిక ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 02
» **ఖాళీల వివరాలు:** ప్రాజెక్ట్ సైంటిస్ట్ అసిస్టెంట్-01, ప్రాజెక్ట్ అసోసియేట్-01.
» **అర్హత:** బీఎస్సీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ), డిప్లొమా(మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ సైంటిఫిక్ అసిస్టెంట్‌కు రూ.58,400,ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.38,800
» **ఎంపిక విధానం:** రాతపరీక్షలు, స్కిల్ టెస్ట్‌లు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**13.10.2023
» **వెబ్‌సైట్:** www.tifrh.res.in

టీఐఎఫ్‌ఆర్, ముంబైలో అప్రెంటిస్‌లు

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టీఐఎఫ్‌ఆర్).. అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 09
» **విభాగాలు:** టర్నర్, మెషినిస్ట్, కార్పెంటర్, వెల్డర్, ఫిట్టర్, పెయింటర్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 28 ఏళ్లు ఉండాలి. **స్టైపెండ్:** నెలకు రూ.18,500 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కుల మెరిట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఇంటర్వ్యూ వేదిక:**టీఐఎఫ్‌ఆర్,1 హోమీబాబా రోడ్, నేవీ నగర్, కొలబ, ముంబై-400005.
» **ఇంటర్వ్యూ తేది:** 16.10.2023.
» **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 9 గంటలు.
» **వెబ్‌సైట్:** https://tifrrecruitment.tifrh.res.in

కోర్సుతోపాటే కొలువు

» 600 జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి ఐడీబీఐ ప్రకటన
» పీజీడీబీఎఫ్ ప్రోగ్రామ్ విధానంలో ఎంపిక ప్రక్రియ
» రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» ఏడాది వ్యవధిలో క్లాస్‌రూమ్ బోధన, ఆన్ జాబ్ శిక్షణ

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. ఐడీబీఐ. పర్సనల్ నుంచి కార్పొరేట్ కంపెనీల వరకు..బ్యాంకింగ్ సేవలు అందిస్తున్న సంస్థ! ఈ బ్యాంక్.. బ్యాంకింగ్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు అందించేలా పీజీడీబీఎఫ్ పేరుతో ప్రత్యేక కోర్సును నిర్వహిస్తోంది. ఈ కోర్సులో ప్రవేశం పొంది శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బ్యాంకులో కొలువు ఖరారు చేస్తోంది. తాజాగా ఐడీబీఐ 600 జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది! ఈ నేపథ్యంలో.. ఐడీబీఐ పీజీడీబీఎఫ్ ప్రత్యేకత, ఎంపిక విధానం, కోర్సు-శిక్షణ, కెరీర్ స్కోప్ తదితర వివరాలు..

ఐడీబీఐ ఏడాది వ్యవధిలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సును అందిస్తోంది. దీనిద్వారా అభ్యర్థులకు బ్యాంకింగ్ రంగ నైపుణ్యాలపై ఆరు నెలల పాటు క్లాస్ రూమ్ శిక్షణ, రెండు నెలల ఇంటర్న్‌షిప్, మరో నాలుగు నెలలు ఐడీబీఐ శాఖల్లో ఆన్ జాబ్ ట్రెనింగ్ ఉంటుంది. ఈ కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత అభ్యర్థులకు ఐడీబీఐ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఓ స్థాయిలో నియామకం ఖరారవుతుంది.

అర్హత

ఆగస్ట్ 31, 2023 నాటికి ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.

వయసు

ఆగస్ట్ 31, 2023 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

స్టయిఫండ్

ఐడీబీఐ పీజీడీబీఎఫ్ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులకు స్టయిఫండ్ పేరిట ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఆరు నెలల క్లాస్ రూం లెర్నింగ్ వ్యవధిలో నెలకు రూ.5వేలు; రెండు నెలల ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.15 వేలు చొప్పున స్టయిఫండ్ అందిస్తారు.

వార్షిక వేతనం రూ.6.5 లక్షలు

పీజీడీబీఎఫ్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకుని.. జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఓ హోదాలో కొలువు ఖరారు చేసుకున్న వారికి ప్రారంభ వార్షిక వేతనం రూ.6.14 లక్షల నుంచి రూ. 6.5 లక్షల వరకు లభిస్తుంది. ఈ హోదాలో మూడేళ్లు పని చేశాక బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా గ్రేడ్-ఎ ఆఫీసర్లుగా పదోన్నతికి అర్హత లభిస్తుంది.

ప్రొబేషన్.. సర్వీస్ బాండ్

జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఓ హోదాలో నియమితులైన వారికి ఏడాది పాటు ప్రొబేషనరీ పీరియడ్ విధానం అమలవుతోంది. నియామకం ఖరారు చేసుకున్న వారు బ్యాంకులో కనీసం మూడేళ్ల పాటు విధులు నిర్వర్తిస్తామని రూ.2 లక్షల సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.

రెండు దశల్లో ఎంపిక

ఐడీబీఐ బ్యాంకులో జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఓ పోస్టులకు మార్గం వేసే పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ కోర్సులో ప్రవేశానికి ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో నిర్వహిస్తారు. అవి..రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ.

రాత పరీక్ష.. 200 మార్కులు

ఐడీబీఐ పీజీడీబీఎఫ్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే రాత పరీక్ష.. రెండు వందల మార్కులకు ఉంటుంది. ఇందులో లాజికల్ రీజనింగ్, డేటా అనాలిసిస్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 60 ప్రశ్నలు-60 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 40 ప్రశ్నలు-40 మార్కులు, జనరల్ /ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్/కంప్యూటర్/ఐటీ 60 ప్రశ్నలు-60 మార్కులకు.. ఇలా మొత్తం 200 ప్రశ్నలు-200 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష ఆన్‌లైన్ టెస్ట్ విధానంలో ఆబ్జెక్టివ్ పద్ధతిలో జరుగుతుంది. పరీక్షకు కేటాయించిన సమయం 2:30 గంటలు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కు తగ్గిస్తారు.



పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్ష తర్వాత.. చివరగా 100 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. నిర్దేశిత కటాఫ్‌లను పేర్కొని..ఆ జాబితాలో నిలిచిన వారిని పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు. పీజీడీబీఎఫ్ కోర్సుకు నిర్దేశించిన సీట్లకు మూడు రెట్లకు సమానమైన సంఖ్యలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

100 మార్కులు సాధించేలా

- ఐడీబీఐ పీజీడీబీఎఫ్ ప్రోగ్రామ్ అభ్యర్థులు రాత పరీక్షలో 100 మార్కులు సాధించేలా కృషి చేయాలి. 2022 కటాఫ్‌లను పరిశీలిస్తే..జనరల్ కేటగిరీలో 74.75 మార్కులు; ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 74.25 మార్కులు; ఓబీసీ కేటగిరీలో 74.75 మార్కులు; ఎస్సీ కేటగిరీలో 62.65 మార్కులు; ఎస్టీ కేటగిరీలో 59.5 మార్కులు ఫైనల్ కటాఫ్ మార్కులుగా నమోదయ్యాయి. ఈ కటాఫ్ శ్రేణిలో నిలిచిన వారికి పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహించారు.
- పర్సనల్ ఇంటర్వ్యూ తర్వాత ఫైనల్ కటాఫ్ జనర్ కేటగిరీలో 80.88 మార్కులు; ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 75.94; ఓబీసీ కేటగిరీలో 74.94; ఎస్సీ కేటగిరీలో 64.38; ఎస్టీ కేటగిరీలో 59.13గా నమోదైంది.

వెయిటేజీ విధానం

తుది జాబితా రూపకల్పన, పీజీడీబీఎఫ్ కోర్సుకు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అమలు చేస్తారు. రాత పరీక్షకు 75 మార్కులు; పర్సనల్ ఇంటర్వ్యూకు 25 మార్కులు చొప్పున వెయిటేజీని నిర్ధారించారు. అభ్యర్థులు పొందిన మార్కులను ఈ వెయిటేజీలకు అనుగుణంగా క్రోడీకరించి.. తుది జాబితా విడుదల చేస్తారు.

అసిస్టెంట్ మేనేజర్ నుంచి ఈడీ వరకు

పీజీడీబీఎఫ్ పూర్తి చేసుకుని ఐడీబీఐలో జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఓ హోదాలో నియమితులైన వారు భవిష్యత్తులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్థాయి వరకు చేరుకునే అవకాశముంది. తొలుత అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఎగా పదోన్నతి లభిస్తుంది. తర్వాత మేనేజర్ (గ్రేడ్-బి)గా పదోన్నతి పొందొచ్చు. అనంతరం నిర్ణీత కాల వ్యవధి ఆధారంగా.. ఏజీఎం(గ్రేడ్-సి), ఏజీఎం(గ్రేడ్-డి), డీజీఎం (గ్రేడ్-డి), జనరల్ మేనేజర్(గ్రేడ్-ఇ), చీఫ్ జనరల్ మేనేజర్ (గ్రేడ్-ఎఫ్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వంటి పదోన్నతులు లభిస్తాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** సెప్టెంబర్ 30, 2023
- **ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:** అక్టోబర్ 20, 2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://www.idbibank.in/idbibankcareerscurrentopenings.aspx

ప్రిపరేషన్ ఇలా

- లాజికల్ రీజనింగ్, డేటా అనాలిసిస్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు సంబంధించి డైరెక్షన్స్, డిస్టెన్స్, అనాలజీ, బ్లడ్ రిలేషన్స్, సిరీస్, డబుల్ లైనప్, డయాగ్రమ్స్, ఫ్లో చార్ట్‌లను ప్రాక్టీస్ చేయాలి.
- ఇంగ్లిష్‌కు సంబంధించి గ్రామర్ అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా వొకాబ్యులరీ, కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. అదే విధంగా సింపుల్, కాంప్లెక్స్, కాంపౌండ్ సెంటెన్స్‌లను ప్రాక్టీస్ చేయాలి.
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి మ్యాథమెటిక్స్‌లోని కోర్ అంశాలతోపాటు అర్థమెటిక్ అంశాల(నిష్పత్తులు, శాతాలు, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, యావరేజెస్, స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, కూడికలు, హెచ్చవేతలు తదితర)పై దృష్టి పెట్టాలి.
- నాలుగో విభాగంలోని జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. ఎకానమీలో ఇటీవల కాలంలో ఆర్థిక రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు తెలుసుకోవాలి. బ్యాంకింగ్ అవేర్‌నెస్‌లో బ్యాంకింగ్ వ్యవస్థ స్వరూపం తోపాటు తాజా పరిణామాలు, బ్యాంకింగ్ టెర్మినాలజీపై అవగాహన ఏర్పరచుకోవాలి. కంప్యూటర్/ఐటీ అవేర్‌నెస్‌లో కంప్యూటర్ ఆపరేషన్ టూల్స్‌పై పట్టు సాధించాలి.

క్లుప్తంగా...


గురుకుల విద్యార్థినులకు ఎలుక కాట్లు

- నాలుగు రోజుల తర్వాత వెలుగులోకి ఘటన


ఎలుకల దాడిలో గాయపడిన విద్యార్థినులు

వైరా (ఖమ్మం జిల్లా): గురుకుల బాలికల(జనరల్) పాఠశాల విద్యార్థినులు నిద్రిస్తున్న సమయంలో ఎలుకలు గాయపరిచిన ఘటన ఖమ్మం జిల్లా వైరాలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 23న శనివారం రాత్రి వేర్వేరు గదుల్లో నిద్రిస్తున్న 9, 10వ తరగతుల విద్యార్థినుల కాలివేళ్లపైనా, చేతివేళ్లపైనా ఎలుకలు కొరకడంతో ఆ విద్యార్థినులకు గాయాలయ్యాయి. ఈ విషయాన్ని ఆదివారం ఉదయం తెలుసుకున్న సిబ్బంది ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న డీఈఓ సోమశేఖరశర్మ బుధవారం పాఠశాలకు వచ్చి బాలికలతో మాట్లాడారు. డార్మెటరీ, డైనింగ్ హాల్‌లో ఎలుకలు సంచరించకుండా చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాల్ రమను ఆదేశించారు.

ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు ఎందుకు చేయరు?: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక షెడ్యూల్ తెగలు (ఎస్టీ) కమిషన్ ఏర్పాటు ఎందుకు చేయడం లేదో.. వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించింది. ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ న్యాయవాది రాపోలు భాస్కర్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం అధికారులు నోటీసులు జారీ చేసింది. అలాగే, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకాన్ని చేపట్టకపోవడాన్ని సవాల్ చేస్తూ సికింద్రాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త ఎస్.గణేశ్‌రావుతో పాటు మరొకరు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో వాదనలను ముగించింది. ప్రభుత్వం కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకం చేపట్టడంతో ధర్మాసనం ఈ మేరకు సమస్య పరిష్కారమైనట్టు పేర్కొంది.

పీజీ ప్రవేశాల తొలి జాబితా విడుదల రేపు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఓయూతో పాటు ఇతర యూనివర్సిటీల్లో వివిధ పీజీ కోర్సులలో ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల తొలి జాబితాను ఈనెల 29న విడుదల చేయనున్నట్లు టీఎస్‌సీపీజీఈటీ–2023 కన్వీనర్ పాండురంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 45 వేల సీట్లకు 33 వేల మంది నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో వర్సిటీ, ప్రభుత్వ, ప్రైవేటు పీజీ కళాశాలల్లో 25 వేల నుంచి 30 వేల సీట్ల వరకు భర్తీ చేయనున్నట్లు వివరించారు. సీటు లభించిన అభ్యర్థులు అక్టోబరు 4 వరకు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

బెంగళూరు-వాడీ లైన్ల అనుసంధానం సిద్ధం

దేవరకద్ర-కృష్ణా మధ్య పనులు పూర్తి ● రాష్ట్ర పర్యటనలో ఈ మార్గాన్ని ప్రధాని జాతికి అంకితం చేసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం మంజూరైన రైల్వే ప్రాజెక్టు ఎట్టకేలకు జాతికి అంకితం కాబోతోంది. ప్రాజెక్టులో తెలంగాణ ప్రాంత సరిహద్దు వరకు పనులు పూర్తి కావడంతో సమాంతరంగా ఉన్న రెండు ప్రధాన రైలు మార్గాల అనుసంధానానికి అవకాశం ఏర్పడింది. మహబూబ్‌నగర్-కర్ణాటకలోని మునీరాబాద్ మధ్య 243 కి.మీ. మేర జరుగుతున్న రైల్వే లైన్ పనుల్లో భాగంగా దేవరకద్ర-కృష్ణా స్టేషన్‌ల అనుసంధానంతో ఈ ప్రాజెక్టు తెలంగాణ పరిధిలో పూర్తయింది. ఇది ఇటు సికింద్రాబాద్ (మహబూబ్‌నగర్)–బెంగళూరు లైను, అటు సికింద్రాబాద్-వాడీ-ముంబై లైన్‌లను అనుసంధానిస్తుంది. బెంగళూరు లైన్‌లో దేవరకద్ర నుంచి మొదలయ్యే ఈ ప్రాజెక్టు, వాడీ మార్గంలోని కృష్ణా స్టేషన్ వద్ద తెలంగాణ పరిధిలో ముగుస్తుంది. ఇక్కడి వరకు పనులు పూర్తి కావడంతో ఈ అనుసంధాన లైన్‌ను ఇప్పుడు ప్రధాని మోదీ జాతికి అంకితం చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి బెంగళూరు సహా కొన్ని ఇతర ప్రాంతాలకు వాడీ మీదుగా రైళ్లు తిరుగుతున్నాయి. దీని బదులు ఆ రైళ్లు ఇకపై దేవరకద్ర మీదుగా బెంగళూరుకు చేరుకోవచ్చు. దీనివల్ల రైల్వేకు దూరాభారం తగ్గుతుంది. సరుకు రవాణా రైళ్లకూ ఇది దగ్గరి దారి కానుంది. అలాగే జక్లేర్, మరికల్, మక్తల్, మాగనూరు లాంటి ప్రాంతాలకు రైల్వే సౌకర్యం కూడా అందుబాటులోకి వస్తుంది.



ప్రాజెక్టు:	మహబూబ్‌నగర్–మునీరాబాద్
మంజూరు:	1997–98
నిడివి:	243 కి.మీ.
ప్రాజెక్టు వ్యయం:	రూ. 3,473 కోట్లు
తెలంగాణ పరిధి:	66 కి.మీ.
వ్యయం:	రూ.943 కోట్లు
విద్యుదీకరణ:	పూర్తి

ప్రధాని చేతులమీదుగా కాచిగూడ-సిద్దిపేట డెమూ ప్రారంభం?

మనోహరాబాద్-కొత్తపల్లి ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట వరకు రైల్వేలైన్ సిద్ధమై రైల్వే సేఫ్టీ కమిషనర్ ఆమోదముద్ర కూడా రావడంతో రైళ్లను నడిపేందుకు అవకాశం కలిగింది. ఇందులో భాగంగా కాచిగూడ–సిద్దిపేట మధ్య రోజువారీ నడిచేలా డెమూ సర్వీసును ప్రారంభించాలని రైల్వే శాఖ ఇప్పటికే నిర్ణయించింది. ప్రధాని మోదీ రాష్ట్రంలో పర్యటించే రెండు రోజుల్లో ఏదో ఒక రోజు డెమూ రైలు సర్వీసును ఆయన చేతుల మీదుగా ప్రారంభించాలని రైల్వే శాఖ భావిస్తోంది. ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం-రైల్వే శాఖ సంయుక్తంగా చేపట్టాయి. ప్రధాని చేతుల మీదుగా రైలును ప్రారంభించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలా స్పందించనుందో చూడాల్సి ఉంది. ఇక ముద్ఖేడ్-డోన్ మార్గంలో డబ్లింగ్ పనులు దాదాపు పూర్తయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో రెండు లైన్లు వినియోగానికి సిద్ధమైన నేపథ్యంలో ఆ పనులను కూడా ప్రధాని జాతికి అంకితం చేసే అవకాశం ఉంది.

కంటి తుడుపుగానే ముంపు నివారణ!

- పోలవరం ముంపు విషయంలో కేంద్రం వైఖరిపై తెలంగాణ తీవ్ర విమర్శలు
- సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్ వాస్తవ విరుద్ధంగా ఉందంటూ అభ్యంతరం
- ఇప్పటికైనా ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- కేంద్ర జల సంఘానికి లేఖ



సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో తెలంగాణ భూభాగం ముంపునకు గురికావడాన్ని నివారించే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు పూర్తిగా కంటి తుడుపు చర్యలుగానే ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం విమర్శించింది. ముంపు పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ ఈ నెల 1న సుప్రీంకోర్టులో కేంద్రం సమర్పించిన అఫిడవిట్.. క్షేత్ర స్థాయిలోని వాస్తవ పరిస్థితులకు పూర్తి విరుద్ధంగా ఉందని ఆక్షేపించింది. ఉమ్మడి సర్వే జరపడానికి ఏపీ, తెలంగాణలు సమ్మతించాయని, సర్వే ఫలితాల ఆధారంగా ఏపీ ప్రభుత్వం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)లు చర్యలు తీసుకుంటాయని సుప్రీంకోర్టుకు కేంద్రం హామీ ఇవ్వడం కంటితుడుపు చర్యేనని ఆరోపించింది. ఇకనైనా పోలవరం వల్ల జరిగే ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి.మురళీధర్ మంగళవారం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్‌కు లేఖ రాశారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు సీడబ్ల్యూసీ, కేంద్ర జలశక్తి శాఖకు ఎన్నో లేఖలు రాసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. లేఖలో ఇంకా ఏముందంటే ..

ఉమ్మడి సర్వేకు అంగీకరించినా..

పోలవరం ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్) 150 అడుగుల మేరకు నీటిని నిల్వ చేసినప్పుడు ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తిస్తూ ఏర్పాటు చేసిన సర్వే రాళ్ల వద్ద నుంచి ఉమ్మడి సర్వేను ప్రారంభించాలని సీడబ్ల్యూసీ/పీపీఏ/ఏపీ ప్రభుత్వం అంగీకరించినా ఆ తర్వాత మిన్నకుండిపోయాయి. తెలంగాణలో 954 ఎకరాలు ముంపునకు గురి అవుతున్నట్టు ఏపీ సమర్పించిన మ్యాపులే బయటపెట్టాయి. సీడబ్ల్యూసీ చైర్మన్ సూచన మేరకు పోలవరం బ్యాక్‌వాటర్‌తో తెలంగాణలోని 7 వాగులు, భద్రాచలం, మణుగూరు భార జల ప్లాంట్ వద్ద ఉండనున్న ముంపు/నీటి స్థాయిలపై ఉమ్మడి సర్వే జరిపేందుకు ఏపీ, పీపీఏలు ముందుకు రావడం లేదు.

నదిలో పూడికపై సర్వే జరపాలి

భద్రాచలం వద్ద 8 ఔట్‌ఫాల్ స్లూయిస్‌ల వద్ద పూడిక పేరుకుపోవడంతో బ్యాక్‌వాటర్ ప్రభావం పెరిగి తెలంగాణలోని 37 వాగులు ముంపునకు గురి అవుతున్నాయి. ఎన్జీటీ ఆదేశాల మేరకు కిన్నెరవాగు, ముర్రేడువాగులకు ఉన్న ముంపుపై ఇంకా ఉమ్మడి సర్వే జరపలేదు. నదిలో పూడికపై సీడబ్ల్యూసీ, లైడార్ సర్వేల నివేదికల మధ్య తీవ్ర వ్యత్యాసాలున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో మళ్లీ సర్వే జరపాలి.

వరద లెక్కల్లో లోపాలు సవరించాలి

ఇటీవల వచ్చిన భారీ వరదల సందర్భంగా నమోదు చేసిన వరద లెక్కల్లో తీవ్ర లోపాలున్నాయి. వీటిని సీడబ్ల్యూసీ పరిశీలించి సవరించాలి. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే, కాఫర్ డ్యామ్ నిర్మించిన తర్వాత తెలంగాణ ముంపు ప్రభావం భారీగా పెరిగింది. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఉమ్మడి సర్వే జరిపి ముఖ్య కట్టడాలు, ప్రాంతాలకు ఉండనున్న ముంపు ప్రభావంపై పరిశీలన జరపాలి. పోలవరం ముంపుపై తెలంగాణలో మళ్లీ బహిరంగ విచారణ జరపాలి. పోలవరం బ్యాక్‌వాటర్‌తో ముంపునకు గురి అవుతున్న ప్రాంతాలకు రక్షణగా వరద గోడలను నిర్మించాలి.

తెలంగాణ భాష, యాస లేని సినిమాలు లేవు

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాదాపూర్ (హైదరాబాద్): గతంలో ఏ సినిమాలు చూసినా మనభాషను, యాసను అవమానించే విధంగా ఉండేవని, ఇప్పుడు తెలంగాణ భాష, యాస లేకపోతే సినిమాలే లేవన్నట్టుగా ఉందని పర్యాటక మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో నిర్వహిస్తున్న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలలో భాగంగా బుధవారం చివరి రోజు ముగింపు కార్యక్రమాల సందర్భంగా టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 36 కేటగిరిలలో హోటల్స్, రెస్టారెంట్స్, రిసార్ట్స్‌లకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో కళాకారులు ఆటపాటలతో అలరించారు.

నేతన్నలకు ఆర్థిక సాయం

- 33 మంది తెలంగాణ నేతన్నలకు రూ.30 లక్షల కేంద్ర సాయం

సాక్షి, న్యూఢిల్లీ: చేనేత రంగానికి సంబంధించి వివిధ జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు పొందిన నేతలన్నలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 68 మందిని ఎంపిక చేసి.. వారి ఖాతాల్లోకి నిధులను రెండు విడతల్లో విడుదల చేసింది. ఇందులో భాగంగా.. తెలంగాణ నుంచి 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు హైదరాబాద్ వీవర్ సర్వీస్ సెంటర్ కింద ఉన్న 33 మంది అవార్డు పొందిన నేతన్నలకు కేంద్ర టెక్స్ టైల్స్ మంత్రిత్వ శాఖ రూ. 30 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది. ఈ 33మందికి ఒక్కొక్కరి ఖాతాల్లోకి .. నెలకు రూ.8వేల చొప్పున సంవత్సరం మొత్తానికి కలుపుకొని రూ.96వేలను ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా జమచేసింది.

దేశంలో ఎక్కువ తెలంగాణకే

దేశవ్యాప్తంగా 68 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ. 62లక్షలు జమ చేయగా.. ఇందులో ఎక్కువగా రూ.30 లక్షలు తెలంగాణకు సంబంధించిన లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయి. కాగా, ఈ నిధుల విడుదల.. నేతన్నల సంక్షేమం పట్ల కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.


బుధవారం హైదరాబాద్‌లో లులు మాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో సంస్థ చైర్మన్ యూసఫ్ అలీ, ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అష్రఫ్ అలీ తదితరులు


లులు మాల్ షురూ

కేపీహెచ్‌బీలో ప్రారంభించిన మంత్రి కేటీఆర్

- హైపర్ మార్కెట్, ఎంటర్‌టైన్‌మెంట్, గేమింగ్ జోన్‌ల పరిశీలన
- లులు పెట్టుబడులతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడి

కేపీహెచ్‌బీ కాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రతిష్టాత్మక లులు షాపింగ్ మాల్‌ను రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు బుధవారం ప్రారంభించారు. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన లులు మాల్ రాష్ట్రంలో మొట్టమొదటిది కావడం విశేషం. కాగా మాల్ వివిధ అంతస్తుల్లోని హైపర్ మార్కెట్, ఎంటర్‌టైన్‌మెంట్, గేమింగ్ జోన్‌లను కేటీఆర్ పరిశీలించారు. సంస్థ ప్రతినిధులు మాల్‌లో కొలువుదీరిన విభాగాలను, వాటి ప్రత్యేకతలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కేరళ నుంచి వెళ్లి దుబాయిలో స్థిరపడి ప్రపంచ వ్యాప్తంగా పలు షాపింగ్ మాళ్లను నెలకొల్పిన లులు సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ యూసఫ్ అలీని అభినందించారు. ప్రపంచ వ్యాప్తంగా 25 దేశాల్లో సుమారు 275 హైపర్ మార్కెట్‌లను ఏర్పాటు చేసిన లులు గ్రూప్ హైదరాబాద్‌లోనూ రూ.3,500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావటం హర్షణీయమన్నారు. ఇందులో భాగంగానే మొదటి షాపింగ్ మాల్‌ను ప్రారంభించటం జరిగిందని, రాబోయే రోజుల్లో వివిధ రంగాల్లో పెట్టుబడులతో రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అంతకుముందు లులు చైర్మన్‌తో పాటు ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అష్రఫ్ అలీ మాట్లాడుతూ..దావోస్‌లో జరిగిన సదస్సులో తెలంగాణ మంత్రి కేటీఆర్‌ను కలిశామని, ఆయన పనితీరు నచ్చి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపినట్లు తెలిపారు. రాష్ట్రంలో షాపింగ్ మాల్స్, హైపర్ మార్కెట్లు, డెస్టినేషన్ మాల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫిషరీస్ ఇండస్ట్రీస్, లాజిస్టిక్స్, రవాణా లాంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టనున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌రావు, లులు గ్రూప్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

టుడేస్ గ్రాఫిక్



ఫ్రాన్స్‌కు చెందిన అంతర్జాతీయ మార్కెట్ పరిశోధన, కన్సల్టింగ్ సంస్థ ఐపీఎస్‌వోఎస్ అధ్యయనం ప్రకారం వివిధ దేశాల్లో సాయుధ దళాలపై విశ్వాసం ఇలా...

ఉత్తమ పర్యాటక పురస్కారాల ప్రదానం

ఢిల్లీలో అవార్డులు అందుకున్న అధికారులు, సర్పంచ్‌లు

సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్ : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా బుధవారం ఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కేంద్ర పర్యాటకశాఖ కార్యదర్శి విద్యావతి ఈ అవార్డులను రాష్ట్ర పర్యాటకశాఖ ముఖ్యకార్యదర్శి శైలాజారామయ్యర్, సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పెంబర్తి, చంద్లాపూర్ గ్రామ సర్పంచ్‌లు అంబాల ఆంజనేయులు, సూరగోని చంద్రకళలకు అందజేశారు. పెంబర్తి, చంద్లాపూర్ గ్రామాలకు జాతీయ ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రాలుగా అవార్డులు దక్కడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు.


ఇంజనీరింగ్ విద్యార్థులకు 'బైట్ బైండింగ్ చాంపియన్‌షిప్'

విజేతలకు రూ.లక్ష పారితోషికం ● టీ వర్క్స్‌తో పనిచేసే చాన్స్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్న 25 ఏళ్ల లోపు విద్యార్థుల కోసం 'టీ వర్క్స్' మొట్టమొదటి జాతీయ 'ఎంబెడ్డెడ్ చాంపియన్‌షిప్'ను నిర్వహించనుంది. 'ది బైట్ బైండింగ్ చాంపియన్‌షిప్ 2023' పేరిట జరిగే ఈ చాంపియన్‌షిప్ ద్వారా దేశవ్యాప్తంగా ఆవిష్కరణలు, పాల్గొనేవారి సామర్థ్యాలు వెలికితీయడం, కొత్త ఆలోచనలు కలిగిన వారిని ఒకే వేదికపైకి తీసుకురావడం తదితరాలు లక్ష్యంగా ఈ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. మూడు రౌండ్లలో ఎంబెడెడ్ ఇంజనీర్ల హార్డ్‌వేర్, సిస్టమ్స్ థింకింగ్, టీమ్ వర్క్‌లో నైపుణ్యం పరీక్షించేలా ఈ చాంపియన్‌షిప్ పోటీని రూపకల్పన చేశారు. తొలి రెండు రౌండ్లలో పాల్గొనే వారిని వర్చువల్ విధానంలో సంక్లిష్టమైన కోడింగ్, హార్డ్‌వేర్ సవాళ్ల పరిష్కారానికి వారు అనుసరించే పద్ధతులను పరీక్షిస్తారు. ఇందులో అగ్రస్థానంలో నిలిచే 25 బృందాలను ఎంపిక చేసి మూడో రౌండ్లో ఎంబెడ్డెడ్ పజిల్స్ పరిష్కరించాల్సి ఉంటుంది. పోటీలో విజేతలుగా నిలిచేవారికి రూ.లక్ష పారితోషికంతో పాటు స్టార్టప్‌లు, దిగ్గజ పారిశ్రామికవేత్తలు, ఇతర మార్గదర్శకులతో కలిసి పనిచేసే అవకాశం లభిస్తుంది. హైదరాబాద్ మినహా ఇతర ప్రాంతాల నుంచి ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు వచ్చేవారికి వసతి సదుపాయాలకు అయ్యే ఖర్చును టీ వర్క్స్ చెల్లిస్తుంది.

ఓటర్లను చైతన్యపరచాలి

సీఈఓ వికాస్‌రాజ్



సాక్షి, హైదరాబాద్: వచ్చే శాసనసభ సాధారణ ఎన్నికల్లో అత్యధిక మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యపరచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ కోరారు. ఓటర్లను చైతన్యపరచడానికి నియమించిన ఎన్నికల సంఘం ప్రచారకర్తలతో బుధవారం ఆయన తన కార్యాలయంలో చర్చించారు. అధిక సంఖ్యలో కొత్త ఓటర్ల నమోదుతో పాటు ఓటరు జాబితాలో తమ పేర్లను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకునేలా చైతన్యపరిచామన్నారు. కార్యక్రమంలో జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్, ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్‌లో 2015లో అర్జున్ అవార్డు గ్రహీత అనూప్ కుమార్, అంతర్జాతీయ క్రికెటర్ మహేందర్ వైష్ణవ్, టీవీ ప్రజెంటర్ బి.సుజాత, జాతీయ పడవ పందాల క్రీడాకారుడు చరణ్‌సింగ్ షెకావత్, జాతీయస్థాయి విలు విద్య క్రీడల కోచ్, ప్రెసిడెంట్ అవార్డ్ గ్రహీత పి.రవిశంకర్, తెలంగాణ ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు లైలా పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.